సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 304

గురువారం 25-1-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'




**భళా బోపన్న...**

టెన్నిస్‌లో నంబర్‌వన్ ర్యాంక్ అందుకోనున్న అతిపెద్ద వయస్కుడిగా రికార్డు -12లో



**సూర్యకుమార్‌కు అవార్డు**

టి20ల్లో వరుసగా రెండో ఏడాది ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపిక -12లో



**కొనసాగుతున్న భక్తుల వరద**

అయోధ్యకు భక్తులు పోటెత్తుతున్నారు. బుధవారం 3 లక్షల మంది బాలక్ రామ్ దర్శనం చేసుకున్నట్టు జన్మభూమి ట్రస్టు తెలిపింది.

- వివరాలు 6లో



**వేల ఏళ్లనాటి వైరస్‌ల విజృంభణ**

48,500 ఏళ్లపాటు మంచు ఫలకాల కింద కూరుకుపోయిన వినాశకర వైరస్‌లు బయటికొస్తున్నాయని శాస్త్రవేత్తలు ప్రకటించారు.

- వివరాలు 6లో



**ప్రైమరీలో ట్రంప్‌కు మరో గెలుపు**

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వానికి జరుగుతున్న ప్రైమరీ ఎన్నికల్లో ట్రంప్ గెలుపొందారు.

- వివరాలు 6లో



**రష్యాలో కూలిన ఆర్మీ విమానం**

రష్యాలో సైనిక విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 65 మంది ఉక్రెయిన్ యుద్ధఖైదీలు సహా 74 మంది సజీవదహనం అయ్యారు.

- వివరాలు 6లో

# ఇదేమి రాజ్యం..?



ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని జుట్టుపట్టి లాక్కెళ్తున్న పోలీసులు

**ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని జుట్టుపట్టి ఈడ్చుకెళ్లిన పోలీసులు**

- స్కూటీపై వెళ్తూ లాక్కెళ్లేందుకు మహిళా కానిస్టేబుళ్ల ప్రయత్నం
- వ్యవసాయ వర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దంటూ ఆందోళన చేస్తున్నవారిపై అమానవీయ ప్రవర్తన

ఏజీ వర్సిటీ (హైదరాబాద్): వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దంటూ ఆందోళన చేస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీతో పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు స్కూటీపై వెళ్తూ.. ఆమెను జుట్టుపట్టుకుని లాక్కెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కిందపడిపోయిన ఝాన్సీకి గాయాలయ్యాయి. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సదరు పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఆందోళనను అదుపు చేసేందుకు..**

హైదరాబాద్ శివార్లలోని రాజేంద్రనగర్‌లో ఉన్న జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 100 ఎకరాల భూమిని రాష్ట్ర సర్కారు కొత్త హైకోర్టు నిర్మాణం కోసం కేటాయించిన విషయం తెలిసిందే. దీనిని నిరసిస్తూ ఏబీవీపీ కొన్నిరోజులుగా వ్యవసాయ వర్సిటీ వద్ద ఆందోళన కార్యక్రమాలను

మిగతా 10వ పేజీలో ▶

## న్యూస్‌రీల్

**'రీజనల్'కు రాష్ట్ర నిధులు త్వరగా ఇవ్వండి**



రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని.. భూసేకరణకు సంబంధించి రాష్ట్ర వాటా నిధులు వెంటనే విడుదల చేయాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు.

- వివరాలు 3లో▶

**కాంగ్రెస్ నేతలను బట్టలూడదీసి ఉరికిస్తాం**



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలు హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయకుంటే బట్టలూడదీసి ఉరికించే రోజులు వస్తాయని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు.

- వివరాలు 2లో▶

**మెదక్ ఎంపీ సీటుపై గొడవలు**



మెదక్ ఎంపీ సీటు కోసం ఎమ్మెల్సీ కవిత పట్టుబడుతుండటంతో కేసీఆర్ కుటుంబంలో గొడవలు అవుతున్నాయని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేర్కొన్నారు. అందుకే సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు.

- వివరాలు 2లో▶

**మేము పార్టీ మారే ప్రసక్తే లేదు**



తాము పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, తమను అప్రతిష్టపాలు చేసేందుకే కొందరు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌ను వీడేది లేదన్నారు.

- వివరాలు 2లో▶

# అవినీతి రూ.500 కోట్లు!

**హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్, మెట్రోరైల్ డైరెక్టర్ శివబాలకృష్ణపై ఏసీబీ దాడులు**

- హైదరాబాద్ పుప్పాలగూడలోని ఇల్లు, కార్యాలయం, బంధువుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు
- అక్రమంగా రూ.500 కోట్లకుపైగా ఆస్తులు కూడబెట్టినట్టు అంచనా
- బుధవారం సాయంత్రానికి రూ.100 కోట్లకుపైగా ఆస్తుల గుర్తింపు
- భారీగా స్థిరాస్తుల పత్రాలు, బంగారు, వజ్రాభరణాలు, 15కుపైగా ఐఫోన్లు, రూ.40 లక్షల నగదు స్వాధీనం?
- బినామీల పేరిట భారీగా భూములు కొన్నారంటున్న అధికారులు
- సోదాలకు ఏమాత్రం సహకరించని కుటుంబ సభ్యులు, బంధువులు
- లాకర్లను తెరవాల్సి ఉందన్న అధికారులు... నేడూ తనిఖీలు!
- ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి లక్ష్యంగానే ఈ ఏసీబీ సోదాలనే ప్రచారం

10 లో



ఏసీబీ సోదాల్లో పట్టుబడిన నగదు, వాచీలు (ఇన్‌సెట్‌లో) శివబాలకృష్ణ

# కూటమికి బీటలు

**బెంగాల్లో ఒంటరి పోరు: మమత**

- పంజాబ్‌లోనూ ఒంటరి పోరే: ఆప్
- 'ఇండియా' కూటమికి జంట షాకులు
- విపక్షాలకిది చావుదెబ్బే: బీజేపీ

➤ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమికి గట్టి పోటీ ఇవ్వాలన్న విపక్షాల ప్రయత్నాలకు ఆదిలోనే హంసపాదు! కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష 'ఇండియా' కూటమికి భాగస్వామ్య పార్టీలు తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ బుధవారం రెండు భారీ షాకులిచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని రెండు పార్టీలూ చెప్పాయి. మమత ప్రకటనను విపక్ష ఇండియా కూటమికి చావుదెబ్బగా బీజేపీ అభివర్ణించింది.

- వివరాలు 6లో



బర్ధమాన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ

# అంతరాలపై విద్యాయుద్ధం

**రాష్ట్రంలో పేదరికానికి నాణ్యమైన విద్యే సరైన మందు**

**ఇండియా టుడే సదస్సులో ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి**




సదస్సులో సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశ్నలకు బదులిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- నాణ్యమైన విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు కావాలి... సంపన్నుల పిల్లలకు అందే చదువులు పేద పిల్లలకూ అందాలన్నదే మా లక్ష్యం
- పిల్లలకు నాణ్యమైన ఇంగ్లిష్ విద్య కోసం సమగ్ర విధానం..
- స్కూళ్లలో నాడు–నేడు కింద మౌలిక సదుపాయాలు

10 లో

## గోల్కొండ జిగేల్



గోల్కొండ కోటలో సరికొత్తగా ఏర్పాటు చేసిన లేజర్ బేస్డ్ లైట్ అండ్ సౌండ్ షోను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రస్తుతమున్న లైట్ అండ్ సౌండ్ షోకు మరింత ఆధునిక సాంకేతికత జోడించి పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. కోటలో ఈ లైట్ అండ్ సౌండ్ షో ప్రతి రోజు మూడు భాషల్లో ఉంటుంది. కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

- వివరాలు 14లో

## ఆ సంస్థలతో అభివృద్ధి అసాధ్యం

- బహుళ జాతి సంస్థలపై డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్య... వాటితో సామాజిక న్యాయం, ఉపాధి కల్పన జరగదు

2 లో

## కంప్యూటర్ ఇంజనీరింగ్ సీట్ల పెంపునకు బ్రేక్!

- సంప్రదాయ కోర్సులకు డిమాండ్ తగ్గడంతో ఈ నిర్ణయం?
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ఏఐసీటీఈ

- వివరాలు 5లో



## 'ఎమ్మెల్సీ'ల నియామకంపై గవర్నర్‌కు ఆదేశాలివ్వలేం

- ప్రస్తుతం స్టే ఇవ్వడం చట్టప్రకారం సాధ్యం కాదు: హైకోర్టు
- అందరి వాదనలు ఒకేరోజున వింటామన్న ధర్మాసనం
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం పిటిషన్లపై విచారణ 8కి వాయిదా

2 లో

## చెంచుల చెంతకు అధికారులు

- కొల్లంపెంట, కొమ్మెన పెంట సందర్శన
- ఐసీడీఎస్ భవన నిర్మాణానికి స్థలం ఖరారు
- 11.30 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు కొలతలు

సాక్షి ఎఫెక్ట్

- వివరాలు 14లో



కొల్లంపెంటలో చెంచులతో మాట్లాడుతున్న అధికారులు

నల్లమల అటవీ పరిధిలోని చెంచు పెంటల చెంతకు అధికార యంత్రాంగం తరలివచ్చింది. చెంచుల వెతలకు 'సాక్షి' అక్షరరూపం ఇస్తూ 'అడవే చెంచులకు అమ్మ' శీర్షికన బుధవారం కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు అమ్రాబాద్ మండలంలోని కొమ్మెనపెంట, కొల్లంపెంటను సందర్శించారు.





# అన్నీ కలెక్టర్లే అంటే సరికాదు

**ధరణి పోర్టల్ సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్లు**

- పని ఒత్తిడి తీవ్రంగా ఉందని, క్షేత్రస్థాయిలో సిబ్బంది లేరని వెల్లడి
- అధికారాల వికేంద్రీకరణతోనే మేలు జరుగుతుందనే అభిప్రాయం
- ఐదు జిల్లాల కలెక్టర్లతో భేటీ అయిన ధరణి పునర్నిర్మాణ కమిటీ
- మరికొన్ని సమావేశాల తర్వాతే ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక

సాక్షి, హైదరాబాద్: ధరణి దరఖాస్తుల పరిష్కారంలో అధికారాలను వికేంద్రీకరించడమే మేలని పలు జిల్లాల కలెక్టర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. ధరణి పరిధిలోని ప్రతి మాడ్యూల్ ద్వారా వచ్చే దరఖాస్తులన్నింటినీ జిల్లా కలెక్టర్లే పరిష్కరించే పద్ధతి సరైంది కాదని, ఇందుకు పరిస్థితులు కూడా అనుకూలంగా ఉండవని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ధరణి దరఖాస్తులు పేరుకుపోయాయని వెల్లడించారు. ధరణి పునర్నిర్మాణ కమిటీ బుధవారం సచివాలయంలో ఐదు జిల్లాల కలెక్టర్లతో సమావేశమైంది. కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి, ఎం.సునీల్‌కుమార్, రేమండ్ పీటర్, మధుసూదన్, నవీన్ మిత్తల్‌తో పాటు సీఎంఆర్‌వో పీడీ వి.లచ్చిరెడ్డి, జిల్లాల కలెక్టర్లు ప్రశాంత్ పాటిల్ (సిద్దిపేట), రాజీవ్‌గాంధీ హనుమంతు (నిజామాబాద్), ప్రావీణ్య (వరంగల్), గౌతమ్ కుమార్ (ఖమ్మం), శశాంక్ (రంగారెడ్డి), రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు, అనుభవాలను కమిటీ సభ్యులకు కలెక్టర్లు వివరించారు.

**అన్ని సమస్యలకూ తగిన మాడ్యూల్స్ లేవు**

ధరణి పోర్టల్‌లో అన్ని సమస్యల పరిష్కారానికి అవసరమైన మాడ్యూల్స్ లేవని, తమకు ఉన్న పని ఒత్తిడిలో అన్ని దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించేందుకు జాప్యం జరుగుతోందని కలెక్టర్లు తెలిపారు. ఈ మేరకు అవసరమైన సిబ్బంది కూడా క్షేత్రస్థాయిలో లేరని చెప్పినట్టు తెలిసింది. సమస్యల పరిష్కార అధికారాలను కేవలం కలెక్టర్లకే కాకుండా కేటగిరీల వారీగా తహశీల్దార్లకు, ఆర్డీవోలకు కూడా ఇవ్వాలని సూచించారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు లేనందున వాటిని పరిష్కరించలేకపోయామని వివరించినట్టు సమాచారం.

**27న అటవీ, వ్యవసాయ అధికారులతో భేటీ**

27న మరోమారు భేటీ కావాలని, ఉదయం అటవీ, గిరిజన శాఖలతో, మధ్యాహ్నం వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం కావాలని నిర్ణయించారు. ఆ తర్వాత స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, సర్వే సెటిల్‌మెంట్, దేవాదాయ, వక్ఫ్ ఉన్నతాధికారులతో సమావేశం కావాలని, ఆ భేటీ తర్వాతే ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు.

కాగా ధరణి పోర్టల్ నిర్వహిస్తోన్న టెర్రాసిస్ కాంటెల్లా కంపెనీ ప్రతినిధులతోనూ కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ధరణి పోర్టల్ పనితీరు, ఇందులో ఇమిడి ఉన్న సాంకేతిక అంశాలు, సమస్యల పరిష్కారానికి ఉన్న మార్గాల గురించి చర్చించారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, కంపెనీ ప్రతినిధుల నుంచి అవసరమైన సమాచారాన్ని కమిటీ సభ్యులు సేకరించారు.



## బుల్ బౌన్స్ బ్యాక్

- కలిసొచ్చిన కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు... ప్రపంచ మార్కెట్లలో సానుకూలతలు
- అధిక వెయిటేజీ షేర్ల ర్యాలీ
- ఒక శాతం పెరిగిన స్టాక్ సూచీలు
- మళ్లీ 71 వేల పాయింట్లపైకి సెన్సెక్స్... 21,450 పాయింట్ల ఎగువకు నిఫ్టీ

- వివరాలు 13లో

# బట్టలూడదీసి ఉరికిస్తాం

## కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ హెచ్చరిక

- హామీలు అమలు చేయకుంటే అదే పని చేస్తాం
- రేవంత్‌రెడ్డి ఏక్‌నాథ్ షిండేగా మారడం ఖాయం
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటే
- రైతు బంధు పడని రైతులు చెప్పుతో కొడతారో.. ఓటుతో కొడతారో తేల్చుకోండి
- చేతనైతే ఎంపీ బండి సంజయ్ చర్చకు రావాలి
- కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యేలా కేడర్ పనిచేయాలి
- సోషల్ మీడియా వారియర్స్‌తో భేటీ



సాక్షిప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలు హామీలు ఇచ్చిందని, ఆరు గ్యారంటీలతో పాటు వివిధ డిక్లరేషన్‌ల పేరిట 420 హామీలు ఉన్నాయని, వాటిని అమలు చేయకుంటే కాంగ్రెస్ నేతలను బట్టలూడదీసి ఉరికించే రోజులు వస్తాయని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండుసార్లు అధికారమిచ్చిన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించామని, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సానుభూతితో, అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఓటమితో నైరాశ్యం వద్దని, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఓట్ల శాతం తేడా 1.85 శాతమేనని చెప్పారు.

**ప్రతిపక్ష నేత తరహాలో సీఎం పాలన**

గుంపుమేస్త్రీ రేవంత్‌రెడ్డి సీఎంగా కాకుండా ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తూ పాలన సాగిస్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి మరో ఏక్‌నాథ్ షిండేగా మారడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. రైతుబంధు పడలేదని రైతులు అంటుంటే చెప్పుతో కొడుతామంటూ మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలను రైతుబంధు పడని రైతులు చెప్పుతో కొడుతారో..? ఓటుతో కొడుతారో ఆలోచించుకోవాలన్నారు.

**కేసీఆర్ మళ్లీ సీఎం అయ్యేలా క్యాడర్ పనిచేయాలి**

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల చిల్లర రాజకీయాలను సోషల్ మీడియా ద్వారా ఎండగట్టి, గుంపుమేస్త్రీ రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పి రానున్న రోజుల్లో కేసీఆర్‌ను తిరిగి సీఎం చేసేలా కార్యకర్తలు పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని, బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అయితే మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్, గజ్వేల్, దుబ్బాక, హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ ఎవరిమీద గెలిచిందో తెలుసుకోవాలని హితవు పలికారు. ఎవరు ఎవరితో ఉన్నారు..? ఎవరు ఎవరికి బీటీమ్..? ఎవరు ఎవరితో అంటకాగుతున్నారో అర్థమయ్యేలా ప్రజాక్షేత్రంలో వివరించాలని ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. ప్రతి మండలంలో వార్‌రూం పెట్టుకుని సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

### వినోద్‌తో చర్చకు బండి రావాలి

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని, చేతనైతే మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో చర్చకు రావాలని కేటీఆర్ సవాల్ చేశారు. తేదీ, సమయం, వేదిక ఎక్కడో చెబితే తామే బహిరంగ వేదిక ఏర్పాటు చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. సంజయ్ తెచ్చిన నిధులూ లేవు, గుడి కట్టిందీ లేదు.. బడి కట్టిందీ లేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో మాజీమంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్, జగిత్యాల ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వొడితెల సతీశ్‌బాబు, కోరుకంటి చందర్, పార్టీ ఇన్‌చార్జీలు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్, నగర మేయర్ వై.సునీల్‌రావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, నాయకులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, జీవీ.రామకృష్ణారావు, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

# ఏమి అభివృద్ధి చేశానో చర్చకు సిద్ధం

## వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న దగ్గర బహిరంగ చర్చకు రండి

## బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సవాల్



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ఎంపీగా తానేం అభివృద్ధి చేశానో మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావుతో చర్చకు సిద్ధమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పేర్కొన్నారు. ఎంపీగా బండి సంజయ్ ఏం చేశారని కరీంనగర్‌లో మాజీ మంత్రి కేటీ రామారావు చేసిన వ్యాఖ్యలపై ఆయన పైవిధంగా స్పందించారు. తాను చేసిన అభివృద్ధి.. తెచ్చిన నిధులపై మీ అయ్య (కేసీఆర్)తో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, నీకు దమ్ముంటే వేములవాడ రాజన్న దగ్గరకో.. కొండగట్టు అంజన్న దగ్గరకో రమ్మనేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎంపీగా తాను వేల కోట్ల నిధులు తీసుకొచ్చానని, అభివృద్ధిపై రూపొందించిన పుస్తకాన్ని చూపించారు. మాజీ మంత్రి కేటీఆర్ వల్లే బీఆర్ఎస్ సర్వనాశనమైందన్నారు. ఆయన ఎంత మొరిగినా కరీంనగర్‌లో బీఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా దక్కదని, ఆ పార్టీది మూడో స్థానమేనని పేర్కొన్నారు.

**కరీంనగర్‌కు చేసిందేమీ లేదు...**

టిప్పర్ దరఖాస్తులు పంపిన సోకాల్డ్ మేధావి వినోద్ కుమార్ కేసీఆర్ కుటుంబానికి ఉపయోగపడ్డారే తప్ప కరీంనగర్‌కు ఆయన చేసిందేమీ లేదని బండి సంజయ్ విమర్శించారు. కేంద్రమంత్రితో మాట్లాడి కరీంనగర్-వరంగల్ - కరీంనగర్-జగిత్యాల-ఎల్కతుర్తి-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనులు సహా రోడ్ల నిర్మాణానికి దాదాపు రూ.8 వేల కోట్లు, కరీంనగర్, వరంగల్ రోడ్డు మరమ్మతులకు రూ.41 కోట్లు తీసుకొచ్చానన్నారు. కరీంనగర్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ, తీగలగుట్టపల్లి ఆర్వోబీ, శాతవాహన వర్సిటీకి అటానమస్ హోదా, ఎస్సారార్ కాలేజీకి 12బీ హోదా తెచ్చానన్నారు. 2015లో కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీ కింద గుర్తించి రూ.196 కోట్లు మంజూరు చేస్తే.. ఆ నిధులను నాలుగేళ్లపాటు మళ్లించిన మూర్ఖులు బీఆర్ఎస్ నేతలని మండిపడ్డారు. సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల్లపు రమేశ్, జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ పాల్గొన్నారు.

## సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

సాక్షి, హైదరాబాద్: సర్పంచుల పెండింగ్ బిల్లుల విడుదలకు వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు కావొస్తున్నా రూ.1,850 కోట్ల పెండింగ్ బిల్లులపై దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్ బిల్లుల కారణంగా 65 మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనున్నందున..గత 21 నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామాల అభివృద్ధికి కేటాయించాల్సిన నిధులు రూ.6,400 కోట్లు వెంటనే మంజూరు చేయాలని లేఖలో కోరారు.

## క్లుప్తంగా...

### వంద రోజుల్లో గ్యారంటీలన్నీ అమలు చేస్తాం : షబ్బీర్ అలీ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికలకు ముందు ప్రజలకు హామీ ఇచ్చినట్టుగానే ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో నెరవేరుస్తామని రాష్ట్ర ప్రభుత్వ (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు) సలహాదారుగా నియమితులైన షబ్బీర్‌అలీ చెప్పారు. గాంధీభవన్‌లో మీడియాతో షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా బాధ్యతలు స్వీకరిస్తానని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన టీపీసీసీ ఎస్సీ, బీసీ, మైనార్టీ సెల్ అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో చర్చించారు. తనకు అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### 28న పదవీ బాధ్యతలు స్వీకరిస్తా: మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా ఈనెల 28న పదవీబాధ్యతలు స్వీకరిస్తానని ఆ పదవిలో నియమితులైన మాజీ ఎంపీ మల్లురవి చెప్పారు. ఢిల్లీలో పదవీ బాధ్యతలు తీసుకుంటానని, గతంలో ఈ పదవిలో ఉన్నప్పుడు చేసినట్టుగానే రాష్ట్రానికి చెందిన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వెల్లడించారు. గాంధీభవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ... ఇరిగేషన్ ప్రాజెక్టులు, డిఫెన్స్‌కు సంబంధించిన అంశాలు, విభజన హామీలు లాంటి అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. తాను ఈ పదవిలో ఉన్నప్పటికీ ఎంపీగా పోటీ చేసేందుకు ఎలాంటి ఇబ్బందీ లేదని రానున్న లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ ఎంపీగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు.

### 'పీడిత్ అధికార్ యాత్ర'ను ప్రారంభించనున్న కవిత



సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ ఓబీసీ హక్కుల ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యాత్ర నేపథ్యంలో 28న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మధ్యప్రదేశ్‌లో పర్యటించనున్నారు. ఫ్రంట్ వ్యవస్థాపకుడు, ప్రముఖ బీసీ నాయకుడు దామోదర్‌సింగ్ యాదవ్ చేపట్టనున్న పీడిత్ అధికార్ యాత్రను ఆ రాష్ట్రంలోని దాతియా పట్టణంలో కవిత ప్రారంభిస్తారు.

### రామ భక్తులు ఎవరో తేల్చుకుందాం: వంశీచంద్‌రెడ్డి




సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీచేసేందుకు రూ.15 కోట్లు అడిగిన విషయం వాస్తవమా కాదా అని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి ప్రశ్నించారు. రాముడి ఫొటో ఒకవైపు, ప్రధాని మోదీ ఫొటో మరోవైపు పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్న డీకే అరుణ ముందుగా ఈ విషయం తేల్చి రామభక్తిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. మహబూబ్‌నగర్ పట్టణంలో బుధవారం మహబూబ్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వంశీచంద్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. తాను చెప్పింది అబద్ధమని..రూ.15 కోట్లు అడగలేదని డీకే అరుణ చెబితే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు.

### 'సీఎంను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలవడం వెనుక మతలబేంటి?'



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలవడం వెనుక మతలబు ఏంటని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. విదేశీ పర్యటన సందర్భంగా బీఆర్ఎస్‌ను పాతరేస్తానని మాట్లాడిన రేవంత్‌ను అభినందించేందుకు ఆ ఎమ్మెల్యేలు కలిశారా? అని ఎద్దేవాచేశారు. బుధవారం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ వేళ తెలంగాణలో నిర్వహించాల్సిన హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించకుండా దేవాదాయ శాఖ ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని మండిపడ్డారు. దీనిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

### రేవంత్‌రెడ్డిది కులతత్వ పోకడ: మందకృష్ణ



పంజగుట్ట(హైదరాబాద్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసే నియామకాల్లో పారదర్శకం కన్నా కులతత్వమే ఎక్కువగా ఉందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాన్ని దొరల రాజ్యం అన్నామని అక్కడ దక్కిన అవకాశాలు కూడా ఇక్కడలేవని, సామాజికన్యాయం లేకుండా రెడ్డి మోతాదు మించిపోతుందని ఆయన మండిపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ముఖ్యమంత్రి తన మేనిఫెస్టోలో పెట్టిన 10 అంశాలను ఆయన గుర్తు చేశారు.

# ఆ బీఆర్ఎస్ నేతలు తిహార్ జైలుకే



## కారు స్క్రాప్‌కు వెళ్లింది.. బీఆర్ఎస్ పార్టీ ఉండదు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

యాదాద్రిలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న మంత్రి కోమటిరెడ్డి

బొమ్మలరామారం, యాదగిరిగుట్ట రూరల్ : ప్రజలు కరెంట్ బిల్లులు కట్టొద్దనీ కాంగ్రెస్ పార్టీనే కడుతుందంటున్న బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ ప్రెస్‌మీట్‌లలో మాట్లాడుతున్న ఆ ఐదారుగురు బీఆర్ఎస్ నాయకులు త్వరలో తీహార్ జైలుకు వెళ్తారని, అక్కడ మీడియా సమావేశాలు నిర్వహించుకోవచ్చని ఎద్దేవా చేశారు. ఆయన బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం, యాదగిరిగుట్టలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి అనంతరం మాట్లాడారు. 'కారు'షెడ్డుకు కాదు సర్వీసింగ్‌కు వెళ్లిందని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారని, కానీ కారు వెళ్లింది సర్వీసింగ్‌కు కాదనీ స్క్రాప్‌కే వెళ్లిందని కోమటిరెడ్డి విమర్శించారు. త్వరలో కారూ ఉండదు, బీఆర్ఎస్ పార్టీనూ ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు 48 రోజుల కాంగ్రెస్ పాలనపై రోజుకో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

**యాదాద్రిలో నిధుల దుర్వినియోగం**

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రిటైర్డ్ ఈవోని గత సీఎం నియమించడంతో ఆలయ పునర్నిర్మాణంలో నిధుల దుర్వినియోగం జరిగిందని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. యాదాద్రి ఆలయం పునర్నిర్మాణంలో అవసరం లేకుండా రోడ్లను తొలగించి, ఫ్లైఓవర్‌లను వేశారని నిందించారు. యాదాద్రిలో రూ.కోట్లు ఖర్చు చేశారని చెప్పినా.. భక్తులకు కనీస వసతులను కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. భక్తులు ఆలయం పైన నిద్ర చేసే వసతులు కూడా లేకుండా చేశారని, ఆటోలు కొండపైకి వెళ్లనివ్వకుండా రోడ్డును వెడల్పు చేసి దుకాణదారులు, వ్యాపారుల పొట్టకొట్టారన్నారు. బస్సులు కూడా సరిపడా లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, ఇప్పుడు బస్ డిపో కెపాసిటీని పెంచుతామని మంత్రి హామీనిచ్చారు. అలాగే యాదగిరిగుట్టలో నూతనకోర్టు భవనం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# రాహుల్ ప్రజల్లోకి వెళితే బీజేపీకి ఎందుకు భయం?

## టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: దేశాన్ని సంఘటితం చేసేందుకు రాహుల్ గాంధీ ప్రజల్లోకి వెళితే బీజేపీ ఎందుకు భయపడుతోందో అర్థం కావడం లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి అన్నారు. అసోం ప్రభుత్వం కావాలనే రాహుల్ యాత్రలో శాంతిభద్రతల సమస్య సృష్టిస్తోందని, మోదీ మెప్పు కోసమే సీఎం హిమంత బిశ్వ శర్మ రాహుల్ యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాహుల్ గాంధీ న్యాయ్‌యాత్ర సందర్భంగా ఆలయానికి వెళ్లాలంటే అసోం సీఎం అనుమతి తీసుకోవాలా? అని ప్రశ్నించారు. శ్రీరాముడిని మొక్కాలని బీజేపీ నేతలు చెప్తే తప్ప మాకు తెలియదా? అని నిలదీశారు. అసలు దేవుడు ముందు పుట్టాడో, బీజేపీ ముందు పుట్టిందో అర్థంకాని రీతిలో ఆ పార్టీ నేతలు చెలరేగిపోతున్నారన్నారు. ఇన్నాళ్లూ తెలంగాణలో బతుకమ్మ పేరుతో కవిత సినిమా చూపిస్తే, ఇప్పుడు దేశంలో మోదీ.. రాముని పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. అయోధ్య ఆలయం కట్టేందుకు ప్రధాన కారకుడు బీజేపీ నేత అద్వానీ అని, ఆయనకు కనీసం సన్మానమైనా చేశారా? అని ప్రశ్నించారు.

**కేసీఆర్ నేరుగా బీఆర్ఎస్‌లోనే రాజకీయాలు చేశారా?**

మెదక్ జిల్లాకు చెందిన నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని ఎందుకు కలిశారో తనకు తెలియదని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో ఉన్న సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదని, గత తొమ్మిదేళ్లలో సాధ్యం కాని అవకాశాన్ని సీఎంగా రేవంత్ రెండు నెలల్లోనే కల్పించారని అన్నారు. సీఎం రేవంత్‌ను విమర్శించే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదని, గతం గురించి మాట్లాడితే తాము కూడా వారి గతం గురించి మాట్లాడాల్సి వస్తుందని జగ్గారెడ్డి అన్నారు. కేటీఆర్ తండ్రి కేసీఆర్ యూత్ కాంగ్రెస్ నేతగా పని చేశారని, ఆయన ఎక్కడా పని చేయకుండానే నేరుగా బీఆర్ఎస్‌లోనే రాజకీయాలు చేశారా? అని ప్రశ్నించారు.

### సీఎంతో సునీల్ కనుగోలు భేటీ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ రాజకీయ వ్యూహకర్త సునీల్ కనుగోలు సమావేశమయ్యారు. సచివాలయంలో జరిగిన ఈ భేటీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు. సమావేశంలో కార్పొరేషన్ పదవుల భర్తీ, సామాజిక సమీకరణాలు తదితర అంశాలపై గంటన్నరకు పైగా చర్చించినట్లు తెలిసింది. ఈ అంశంపై మంగళవారం కూడా రేవంత్, సునీల్ చర్చించారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

# మెదక్ ఎంపీ సీటుపై గొడవలు

- అందుకే హరీశ్‌రావు బ్లాక్ మెయిల్ చేస్తున్నారు
- మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు వ్యాఖ్యలు




సాక్షి, సిద్దిపేట: మెదక్ ఎంపీ సీటు కోసం ఎమ్మెల్సీ కవిత పట్టుపడుతుండటంతో కేసీఆర్ కుటుంబంలో గొడవలు అవుతున్నాయని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు చెప్పారు. అందుకే సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. 'హరీశ్‌రావు అనుమతి లేకుండానే మెదక్ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు సీఎంను కలిసే అవకాశం ఉందా?' అని ప్రశ్నించారు. రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యేలతో బలవంతంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేయించారని అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రెండోసారి సీఎం అయ్యాక సిద్దిపేట ఎమ్మెల్యే ఇలాగే బొకేతో వెళ్లి ఆయన్ను కలిశారని గుర్తు చేశారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

**కాంగ్రెస్‌కు ఏడు నెలలు కూడా పట్టదు**

కవిత మెదక్ ఎంపీగా పోటీ చేస్తున్నట్లు వార్తలు రావడంతో జిల్లా నేతలు, ఎమ్మెల్యేలు అలర్ట్ అవుతున్నారని రఘునందన్ అన్నారు. ఖర్మ సిద్ధాంతం ఇప్పుడు బీఆర్ఎస్‌కు అనుభవంలోకి వస్తోందని, ఎవరు చేసుకున్నది వారికే తిరిగి వస్తుందనడానికి ఆ నలుగురు ఎమ్మెల్యేలు సీఎంను కలవడమే నిదర్శనమని చెప్పారు. అప్పుడు బీఆర్ఎస్ చేసిన పని ఇప్పుడు కాంగ్రెస్ చేస్తోందని, పార్టీలను చీల్చడానికి, ఎమ్మెల్యేలను చేర్చుకోవడానికి బీఆర్ఎస్‌కు ఏడేళ్లు పడితే, కాంగ్రెస్‌కు ఏడు నెలలు కూడా పట్టదని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ పెద్ద జీరో అని అన్నారు. బీఆర్ఎస్‌కు 12 సీట్లు అనడం భ్రమ అని, 90 సీట్లతో అధికారంలో ఉన్నప్పుడే ఆ పార్టీకి సింగిల్ డిజిట్ వచ్చిందని చెప్పారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు ఐదుగురు.. ఐదు చోట్ల ఎంపీగా పోటీ చేసి గెలిస్తే రాజకీయాలకు దూరంగా ఉంటానని సవాల్ చేశారు. బీజేపీకి ఈసారి రాష్ట్రంలో 16 సీట్లు వస్తాయని అన్నారు.

# గవర్నర్‌కు ఆదేశాలు ఇవ్వలేం



## 'ఎమ్మెల్సీ'ల నియామకంపై హైకోర్టు

- ప్రస్తుతం స్టే ఇవ్వడం చట్టప్రకారం సాధ్యం కాదు: హైకోర్టు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం పిటిషన్లపై విచారణ వచ్చే నెల 8కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై న్యాయస్థానంలో కేసు తేలేవరకు స్టే ఇవ్వాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. అలా గవర్నర్‌కు ఆదేశాలు ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8వ తేదీకి వాయిదా వేస్తూ.. ఆ రోజు అందరి వాదనలు వింటామని తెలిపింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలంటూ గత ప్రభుత్వం పలువురు అభ్యర్థుల పేర్లతో రాజ్‌భవన్‌కు ప్రతిపాదనలు పంపగా.. గవర్నర్ తమిళిసై తిరస్కరించిన విషయం తెలిసిందే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 (5) ప్రకారం గవర్నర్‌కు ఉన్న విస్తృత అధికారాల మేరకు తిరస్కరిస్తున్నట్టు గవర్నర్ స్పష్టం చేశారు. దీనిని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ నిర్వహించింది.

**ఒకే రోజున అందరి వాదనలు వినేలా..**

ఈ విచారణకు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆదిత్య సోదీ, మయూర్‌రెడ్డి, గవర్నర్ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.అశోక్ ఆనంద్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఏ.సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. అసలు ఈ పిటిషన్ల విచారణార్హత తేలుస్తామని ధర్మాసనం గత విచారణ సమయంలో చెప్పిన నేపథ్యంలో చెప్పడంతో.. న్యాయవాదులు ఈ అంశంపై వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. కానీ ధర్మాసనం అందరి వాదనలు ఒకేరోజున వింటామంటూ.. విచారణను వచ్చే నెల 8కి వాయిదా వేసింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు జోక్యం చేసుకుని.. న్యాయస్థానంలో కేసు విచారణ తేలేవరకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై ఏజీ స్పందిస్తూ.. అలా ఆదేశాలు ఇవ్వడం చట్టప్రకారం సాధ్యం కాదని కోర్టుకు వివరించారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. వాస్తవాలు, సాంకేతిక అంశాలను పరిశీలించి న్యాయ సమీక్షకు సంబంధించిన అంశాన్ని నిర్ణయిస్తామని పేర్కొంది.

# ఆ సంస్థలతో అభివృద్ధి అసాధ్యం

## బహుళ జాతి సంస్థలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్య



- వాటితో సామాజిక న్యాయం, ఉపాధి కల్పన జరగదు
- అవి చిన్న పరిశ్రమలను మింగేశాయి
- మల్టీనేషనల్ కంపెనీల ద్వారా ఉపాధి గోబెల్స్ ప్రచారమే

సాక్షి, హైదరాబాద్: బహుళ జాతి కంపెనీల ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం, ఉద్యోగ ఉపాధి కల్పన వంటివి భూతద్దం పెట్టి వెతికినా కనిపించవని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. బహుళ జాతి సంస్థలతో అభివృద్ధి సాధ్యం కాదని, వాటి ద్వారా అభివృద్ధి అనేది గోబెల్స్ ప్రచారమేనని స్పష్టం చేశారు. హైదరాబాద్ టూరిజం ప్లాజాలో ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వెండర్స్ డెవలప్‌మెంట్ కార్య క్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 'ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలోకి అడుగుపెట్టిన బహుళ జాతి సంస్థలు సూక్ష్మ, లఘు పరిశ్రమలను మింగేశాయి. సంపద మొత్తం ఒకేచోట పోగుపడటం ప్రజాస్వామ్యానికి ఎంత మాత్రం మంచిది కాదు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో భాగంగా సూక్ష్మ, లఘు, చిన్న పరిశ్రమలను ప్రోత్సహిస్తాం.' అని భట్టి పేర్కొన్నారు.

**పారిశ్రామిక క్లస్టర్లను పెంచుతాం**

'ఉద్యోగ, ఉపాధి కల్పన, సమానత్వం, సామాజిక న్యాయం, వృద్ధిరేటు తదితరాల కోసం సూక్ష్మ, లఘు, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు అవసరం. పారిశ్రామిక క్లస్టర్ల సంఖ్య పెంచడం ద్వారా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి ఉపాధి, ఉద్యోగాల కల్పన చేస్తాం. తద్వారా వృద్ధిరేటుతో పాటు వనరుల పంపకం సమానంగా జరుగుతుంది. సంపద సృష్టించే రంగాల్లో అందరినీ భాగస్వాములు చేయడం ద్వారానే సమసమాజ స్థాపన జరుగుతుంది. ఎస్సీ, ఎస్టీ, యువ పారిశ్రామిక వేత్తలు, ఎంఎస్ఎంఈలకు మరిన్ని రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తాం' అని డిప్యూటీ సీఎం తెలిపారు. వివిధ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన ప్రారంభించారు.

# మేము పార్టీ మారే ప్రసక్తే లేదు

## మెదక్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

- సమస్యల పరిష్కారం కోసమే సీఎంను కలిశాం..
- మాకు రాజకీయ విలువలున్నాయి.. కేసీఆర్ వెంటే ఉంటాం



మీడియాతో మాట్లాడుతున్న సునీత, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు

సాక్షి, హైదరాబాద్: తాము పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, తమను అప్రతిష్టపాలు చేసేందుకే కొందరు, ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్‌తో పాటు ఇతర అంశాలకు సంబంధించి మంగళవారం తాము సీఎం రేవంత్‌రెడ్డిని కలవడాన్ని కొందరు పనిగట్టుకుని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు మీడియాతో మాట్లాడారు. 'నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రొటోకాల్ వివాదాలపై గతంలోనూ ప్రశ్నించడంతో పాటు ఏడీజీ శివధర్‌రెడ్డితో పాటు సీఎం రేవంత్‌ను కూడా కలిశాము. మేము పార్టీ మారే ప్రసక్తే లేదు. మెదక్ గులాబీ జెండాకు పుట్టినిల్లు, కేసీఆర్ వెంటే ఉండి లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధిస్తాం. మాకు రాజకీయ విలువలు ఉన్నాయి. దుష్ప్రచారం చేస్తే పరువు నష్టం దావాలకు వెనుకాడం'అని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. 'ప్రజల సమస్యల పరిష్కారంలో భాగంగా సీఎంను కలిశాం. గతంలో మంజూరైన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల పనులను ఆపొద్దని కోరాను. భద్రతకు సంబంధించిన అంశాలపైనా సీఎంతో మాట్లాడాం. రాజకీయంగా బీఆర్ఎస్‌లోనే పుట్టిన నేను బీఆర్ఎస్‌లోనే చనిపోతా'అని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు.

**కేసీఆర్ వెంటే నడుస్తాం: కొత్త ప్రభాకర్‌రెడ్డి**

'నియోజకవర్గం సమస్యలపై సీఎంను కలిస్తే పార్టీ మారుతున్నట్లు కాంగ్రెస్ వాళ్లే ప్రచారం చేస్తున్నారు. ఎండ్రకాయల పార్టీ లాంటి కాంగ్రెస్‌లో ఎవరు చేరుతారు. ఉద్యమ కాలం నుంచి కేసీఆర్ వెంటే నడుస్తున్నాం. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి పెట్టాలి. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టండి అని కాంగ్రెస్ నేతలు సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారు. నాకు అదనపు భద్రత కావాలని సీఎంను కోరా'అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 'స్థానిక సంస్థల సమస్యల పరిష్కారం కోసం ఎస్పీ, కలెక్టర్‌ను కలసిన తరహాలోనే సీఎంను కూడా కలిశాం. నేను బతికున్నంత కాలం బీఆర్ఎస్ పార్టీని వీడను'అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

# బయోడేటాలు తీసుకునే వారూ లేరు

- పదేళ్లు కష్టపడితే మీకేమొచ్చిందని అడుగుతున్నారు
- మధుయాష్కీ, జగ్గారెడ్డిలతో యూత్ కాంగ్రెస్ నేతల మొర

సాక్షి, హైదరాబాద్: పార్టీ గెలుపునకు కష్టపడి పనిచేసిన తమకు గుర్తింపు లేకుండా పోతోందని యూత్ కాంగ్రెస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఇందిరాభవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతకు యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు యూత్‌కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ పార్టీజెండా మోసిన వారిని పట్టించుకోవాలని కోరారు. 'తెలంగాణ ఏర్పాటయిన తర్వాత పదేళ్లు అనేక కష్టాలు అనుభవించాం. బీఆర్ఎస్ నేతల దౌర్జన్యాలు, ఒత్తిళ్లు తట్టుకొని పార్టీ కోసం పనిచేశాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మీకేమొచ్చిందని గ్రామాల్లో కార్యకర్తలు అడుగుతున్నారు. ఇక్కడకు వస్తే బయోడేటాలివ్వండి పరిశీలిస్తామని అంటున్నారు కానీ బయోడేటాలు ఎవరు తీసుకుంటారో కూడా అర్థం కావడం లేదు.'అని మధుయాష్కీగౌడ్, జగ్గారెడ్డిల ఎదుట వాపోయారు. యూత్‌కాంగ్రెస్‌ను ముందుండి నడిపించిన రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డికి ఏదో రూపంలో న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన జగ్గారెడ్డి, మధుయాష్కీలు మాట్లాడుతూ అందరం కష్టపడితేనే పార్టీ అధికారంలోకి వచ్చిందని, అందరికీ ఒకేసారి పదవులు రావని, యూత్‌కాంగ్రెస్‌కు కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. సమావేశంలో భాగంగా రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో యూత్‌కాంగ్రెస్ నిర్వహించాల్సిన పాత్రపై దిశానిర్దేశం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి సమన్వయకర్తను నియమిస్తామని చెప్పారు. సమావేశంలో భాగంగా అసెంబ్లీ ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసిన యూత్‌కాంగ్రెస్ నేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

## క్లుప్తంగా...

### క్రీడాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం: రేవంత్‌రెడ్డి

- సీఎంను కలిసిన పలువురు క్రీడాకారులు, అర్జున విజేతలు

సాక్షి, హైదరాబాద్: తమ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి తగినంత ప్రోత్సాహం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హతలకు అనుగుణంగా ఆర్థిక సాయం, ఉద్యోగావకాశాలు కల్పించి క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉన్నదని పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, జాబితాను రూపొందించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. బుధవారం సచివాలయంలో రాష్ట్రానికి చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన విజేతలు సీఎంను కలుసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రతి క్రీడాకారుడిని పలకరించి వారి విజయాలు, భవిష్యత్తు టోర్నీలను అడిగి తెలుసుకున్నారు. విజేతలందరినీ సీఎం శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా విజేతలు తమ పతకాలు, అవార్డులను ముఖ్యమంత్రికి చూపించారు. సీఎం అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో హుసాముద్దీన్ (బాక్సింగ్ మరియు కామన్వెల్త్ గేమ్స్ కాంస్య పతక విజేత), ఈషా సింగ్ (షూటింగ్, ఆసియా క్రీడలు 2023 బంగారు పతక విజేత), ఆసియా క్రీడలు 2023లో పాల్గొన్న నిఖత్ జరీన్ (బాక్సింగ్‌లో కాంస్య పతకం), కినాన్ చెనై డారి యస్ (షూటింగ్‌లో బంగారు పతక విజేత), అగసర నందిని (అథ్లెటిక్స్‌లో కాంస్య పతక విజేత), ఎస్. సిక్కిరెడ్డి (బ్యాడ్మింటన్ పార్టిసిపెంట్) పి.గాయత్రి గోపీచంద్ (బ్యాడ్మింటన్ పార్టిసిపెంట్), పారా అథ్లెట్, పారా గేమ్స్‌లో గోల్డ్ మెడలిస్ట్ అయిన జీవన్‌జీ దీప్తి ఉన్నారు.

### మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థిని ఆత్మహత్య

గచ్చిబౌలి (హైదరాబాద్): పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన వాసిరెడ్డి సురేంద్రరెడ్డి తన కుటుంబంతో కలిసి నగర శివారుకు వలస వచ్చారు. మణికొండ పంచవటికాలనీలో హ్యాంగింగ్ గార్డెన్స్ ఎస్ఎంఎస్ ఇన్‌ఫ్రా ఫ్లాట్ నంబర్ 301లో నివాసముంటున్నారు. నరేంద్రరెడ్డి కుమార్తె మనస్విని 13 నెక్నాంపూర్‌లోని బ్లూమ్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కాగా, ఇటీవలి పరీక్షల్లో మనస్వినికి తక్కువ మార్కులు వచ్చాయి. ఈ క్రమంలో తల్లి శ్రీలక్ష్మీ మందలించగా తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో కుటుంబ సభ్యులు నిద్రపోయిన తర్వాత మనస్విని ఇంట్లోంచి బయటకు వచ్చి తాము నివాసముండే అపార్ట్‌మెంట్ 3వ అంతస్తునుంచి కిందకు దూకింది. అలికిడితో నిద్ర నుంచి మేలుకున్న తల్లిదండ్రులు, తోటి వారు గమనించి మనస్విని తీవ్ర గాయాలపాలైందని గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

# పురపాలక మండళ్లపై అవిశ్వాసం!

**స్థానిక సంస్థల్లో ఆధిపత్యానికి కాంగ్రెస్ ప్రయత్నాలు**

- ప్రస్తుత పాలక మండళ్లపై అవిశ్వాస తీర్మానాలు
- మేయర్లు, ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్లపై సైతం..
- ఇప్పటికే పలు మునిసిపాలిటీల్లో నెగ్గిన అవిశ్వాసాలు
- గద్దె దిగిన బీఆర్ఎస్ చైర్‌పర్సన్లు
- నేడు, 27న మరిన్ని మునిసిపాలిటీల్లో 'అవిశ్వాస సభలు'



సాక్షి, హైదరాబాద్: గత తొమ్మిదిన్నరేళ్లుగా గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్ వరకు, మునిసిపల్ వార్డు నుంచి మేయర్ వరకు బీఆర్ఎస్ ఏలుబడిలో ఉన్న స్థానాల్లో క్రమంగా కాంగ్రెస్ పట్టు బిగిస్తోంది. ముందుగా రాష్ట్రంలోని పలు మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టడం ద్వారా పాలక మండళ్లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటోంది. ఈ నెల మొదటి వారం నుంచే రాష్ట్రంలోని చాలా మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలకు సంబంధించి ప్రత్యేక సమావేశాలు జరుగుతూ వస్తున్నాయి. అందులో ఒకటి రెండు చోట్ల మినహా అధికారంలో ఉన్న పాలక మండళ్ల చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు పదవులు కోల్పోయారు. నల్లగొండ, భువనగిరి, నేరేడుచర్ల, మంచిర్యాల, క్యాతనపల్లి, లక్సెట్టిపేట, ఖానాపూర్, నస్పూరు, కాగజ్‌నగర్, ఆర్మూర్, కోస్గి తదితర పలు మునిసిపాలిటీల్లో కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. బెల్లంపల్లి, చేర్యాల వంటి ఒకటి రెండు చోట్ల అవిశ్వాసాలు వీగిపోయినప్పటికీ, బెల్లంపల్లిలో చైర్‌పర్సన్ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీలో చేరడం గమనార్హం. తాజాగా హుజూర్‌నగర్ మునిసిపాలిటీలో బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఇక కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో గురువారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరగనుంది. అలాగే 27వ తేదీన ఆలేరు, సూర్యాపేట, కోదాడ, మహబూబ్‌నగర్ తదితర 8 మునిసిపాలిటీల్లో అవిశ్వాస సమావేశాలు జరగనున్నాయి. ఫిబ్రవరి 5న ఇల్లందు సమావేశం జరుగనుండగా, రంగారెడ్డి, మెదక్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన పలు మునిసిపాలిటీలలో అవిశ్వాస తీర్మానానికి సంబంధించి కలెక్టర్లకు నోటీసులు ఇచ్చారు. సదాశివపేట, ఆందోల్–జోగిపేట, జవహర్‌నగర్ కార్పొరేషన్, జనగామ, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్లు తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలపై హైకోర్టును ఆశ్రయించగా, ప్రభుత్వానికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలోని మెజారిటీ మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్ చైర్‌పర్సన్లను గద్దె దింపి కాంగ్రెస్ అనుకూల కౌన్సిలర్లు గద్దెనెక్కడమే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు.

**మేయర్లపై సైతం..**

రాష్ట్రంలో మూడేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న నగర పాలక సంస్థల్లో కూడా అవిశ్వాస తీర్మానానికి పావులు కదులుతున్నాయి. కరీంనగర్‌లో మేయర్ సునీల్‌రావుపై పలువురు కార్పొరేటర్లు అవిశ్వాసం దిశగా పావులు కదిపినప్పటికీ, స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ చక్రం తిప్పారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ వైపు వెళ్లకుండా తనదైన శైలిలో నిలువరించగలిగారు. రామగుండంలో మేయర్‌పై అవిశ్వాసానికి కార్పొరేటర్లు సిద్ధంగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇక్కడి కార్పొరేటర్లను బుజ్జగిస్తున్నప్పటికీ, ఎప్పుడైనా మేయర్‌పై అవిశ్వాం పెట్టే అవకాశం ఉందని చెపుతున్నారు. జవహర్‌నగర్ మేయర్ కావ్యపై ఇప్పటికే అవిశ్వాస నోటీసులు ఇచ్చినప్పటికీ, ఆమె కోర్టును ఆశ్రయించారు. జిల్లాలోని బడంగ్‌పేట, పీర్జాదిగూడ, మీర్‌పేట, నిజాంపేట, నిజామాబాద్, ఖమ్మం తదితర కార్పొరేషన్లలో కూడా అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టే సూచనలు కన్పిస్తున్నాయి.

### పరిషత్ పీఠాలు కూలదోసేలా..

మండల, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌లపై కూడా అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టి గద్దె దించే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే భువనగిరి, వెల్గటూర్, టేకులపల్లి వంటి మండలాల్లో ఎంపీపీలపై పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్టా మధుపై కూడా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే ఆలోచనతో జెడ్పీటీసీలు ఉన్నట్టు సమాచారం. మరోవైపు మేజర్ గ్రామ పంచాయతీల్లోని ప్రాథమిక సహకార సంఘాలలో కూడా అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టి బీఆర్ఎస్ చైర్మన్లను తొలగించే కార్యక్రమం సాగుతోంది. ఇప్పటికే కోదాడ మండలం చిమిర్యాల, చిట్యాల మండలం వెలిమినేడు, రంగారెడ్డి జిల్లా కీసర గ్రామాల్లో పీఏసీఎస్ చైర్మన్లు అవిశ్వాస తీర్మానాలతో గద్దె దిగారు. మరిన్ని సహకార సంఘాలు, జిల్లా స్థాయిలో డీసీఎంఎస్, డీసీసీ స్థాయిల్లో కూడా అవిశ్వాస తీర్మానాలు తెరపైకి వస్తున్నాయి.

# కోస్గి మున్సిపల్‌లో నెగ్గిన అవిశ్వాసం

**మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి కాంగ్రెస్ వశం**

కోస్గి: నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై బుధవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. నారాయణపేట ఆర్డీఓ రాంచందర్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించి అవిశ్వాస ప్రక్రియను నిర్వహించారు. 16 మంది కౌన్సిలర్లు, ముగ్గురు ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి మొత్తం 19 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. అయితే మల్‌రెడ్డిపల్లి కౌన్సిలర్ లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా.. మరో కౌన్సిలర్‌పై అనర్హత కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాస ప్రత్యేక సమావేశం నిర్వహించగా కాంగ్రెస్ నుంచి ఏడుగురు, ముగ్గురు బీఆర్ఎస్, ఒకరు స్వతంత్ర అభ్యర్థి మొత్తం 11 మంది కౌన్సిలర్లు హాజరై చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఓటేశారు. మెజారిటీ సభ్యులు హాజరు కావడంతో ఓటింగ్ నిర్వహించి అవిశ్వాసం నెగ్గినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇలాఖాలో ఉన్న కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి కాంగ్రెస్ వశమైంది.

**హుజూర్‌నగర్ వైస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం**

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావుపై పెట్టిన అవిశ్వాసం బుధవారం నెగ్గింది. మున్సిపాలిటీలో మొత్తం 28 మంది కౌన్సిలర్లు కాగా వీరిలో కాంగ్రెస్ 18, సీపీఎం ఒకరు, బీఆర్ఎస్ 9 మంది ఉన్నారు. అయితే ఎక్స్ అఫీషియో సభ్యుడు మంత్రి ఉత్తమ్‌కుమార్‌ని కలుపుకుంటే సభ్యుల సంఖ్య 29కి చేరింది. ఈ సమావేశానికి 24 మంది హాజరయ్యారు. వీరిలో కాంగ్రెస్‌కు చెందిన 18 మంది, సీపీఎం ఒకరు, బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు మొత్తం 22 మంది అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు వ్యతిరేకంగా చేతులెత్తారు. గైర్హాజరీలు ఉన్నప్పటికీ అవిశ్వాసానికి 22 మంది మద్దతు తెలియజేయడంతో తీర్మానం నెగ్గినట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు.

# 'రీజనల్'కు రాష్ట్ర నిధులు త్వరగా ఇవ్వండి

**ఆర్ఆర్ఆర్ కోసం రూ.2,585 కోట్లను ఎన్‌హెచ్ఏఐకి జమ చేయండి**

- సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖలు
- రాష్ట్రంలోని 11 జాతీయ రహదారి ప్రాజెక్టులకు ఇంకా 4,048 హెక్టార్ల భూమి అవసరం.. దానిని వెంటనే సేకరించి, హైవేల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని.. భూసేకరణకు సంబంధించి రాష్ట్ర వాటా నిధులు వెంటనే విడుదల చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. వెంటనే భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు రూ.2,585 కోట్లను జమ చేయాలని.. హైవే నిర్మాణం వేగంగా సాగేందుకు సహకరించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దీనితోపాటు తెలంగాణలో మరో 11 జాతీయ రహదారి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి 4,048 హెక్టార్ల భూమిని వెంటనే సేకరించి ఇవ్వాలన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి బుధవారం రెండు లేఖలు రాశారు.

**ప్రాజెక్టు ఆలస్యమైతే సమస్యలు**

కేంద్రం భారత్‌మాల పరియోజనలో భాగంగా రూ.26 వేల కోట్లకుపైగా అంచనా వ్యయంతో హైదరాబాద్ నగరం చుట్టూ 350 కిలోమీటర్లకుపైగా రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)ను నిర్మిస్తోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం భూసేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,585 కోట్లను వెంటనే ఎన్‌హెచ్ఏఐకి జమ చేసి నిర్మాణ పనుల ప్రారంభానికి సహకరించాలని పేర్కొన్నారు. దీనికి సంబంధించి గతేడాది ఫిబ్రవరి 3న తాను స్వయంగా రాష్ట్ర సర్కారుకు లేఖ రాశానని, ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ, కేంద్ర కార్యాలయాల అధికారులు కూడా పలుమార్లు లేఖలు రాశారని.. అయినా ఆశించిన స్పందన రాలేదని వివరించారు. రాష్ట్రవాటా నిధుల జమలో ఆలస్యం కారణంగా ప్రాజెక్టు జాప్యమై ట్రాఫిక్ సమస్యలు పెరుగుతాయన్నారు.

**భూసేకరణ త్వరగా చేయండి**

66 ఏళ్లలో తెలంగాణలో 2,500 కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే.. తెలంగాణ ఏర్పాటయ్యాక గత తొమ్మిదిన్నర ఏళ్లలో ఎన్డీయే సర్కారు మరో 2,500 కి.మీ జాతీయ రహదారులను నిర్మించిందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# ఆ ప్రమాదం కూడా వారి పాపమేనా?

- 'బీఎండబ్ల్యూ కారు ప్రమాదం'కేసు తీగను లాగుతుంటే.. కదిలిన నాటి 'మహేంద్ర థార్ యాక్సిడెంట్'డొంక
- మాజీ ఎమ్మెల్యే షకీల్, రహీల్‌ల పాత్రపై లోతైన విచారణ
- 2022లో కారు ఢీకొని రెండేళ్ల చిన్నారి దుర్మరణం
- నాటి ప్రమాదంపై విచారణలోనూ గోల్‌మాల్ జరిగినట్టు అనుమానాలు



షకీల్-రహీల్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: పంజగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రజాభవన్ ఎదురుగా గత నెల ఆఖరివారంలో చోటు చేసుకున్న 'బీఎండబ్ల్యూ కారు ప్రమాదం'కేసు తీగను లాగుతుంటే... 2022లో జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటు చేసుకున్న 'మహేంద్ర థార్ యాక్సిడెంట్'డొంక కదులుతోంది. ఈ రెండు కేసుల్లోనూ బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌తో పాటు ఆయన కుమారుడు రహీల్ అమీర్ పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. ఈ రెండు ప్రమాదాల కేసులను ప్రత్యేక బృందం దర్యాప్తు చేస్తుండగా... పశ్చిమ మండల డీసీపీ ఎస్.విజయ్‌కుమార్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రజాభవన్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదం కేసులో షకీల్, రహీల్ సహా మరికొందరు నిందితులుగా మారడంతో పాటు ఓ ఇన్‌స్పెక్టర్‌పై వేటు పడిన విషయం విదితమే. ఈ ప్రమాద విచారణ నేపథ్యంలోనే నాటి జూబ్లీహిల్స్ యాక్సిడెంట్ తెరపైకి తెచ్చింది.

**ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రెండు నెలల చిన్నారి**

జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ పరిధిలో 2022 మార్చి 17 రాత్రి ఓ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ వైపు నుంచి జూబ్లీహిల్స్ వైపునకు దూసుకువచ్చిన మహేంద్ర థార్ కారు రోడ్డుపై బుడగలు విక్రయించే వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు నెలల బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ వాహనంపై ఎమ్మెల్యే షకీల్ స్టిక్కర్ ఉండటంతో అప్పట్లో రహీల్‌పై ఆరోపణలు వచ్చాయి. మరుసటి రోజు స్పందించిన షకీల్ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రమాదానికి కారణమైన కారు తన సోదరుడిదని (కజిన్), తానూ అప్పుడప్పుడు వాడుతుంటానని చెప్పుకొచ్చారు. సోదరుడి కుటుంబం కారులో ప్రయాణిస్తుండగా జూబ్లీహిల్స్ రోడ్ నం.45 వద్ద సిగ్నల్ సమీపంలో బెలూన్లు అమ్ముకునే యువతికి కారు వల్ల గాయమైందని, ఆ భయంలో ఆమే పసిపాపను పడేయడంతో దుర్ఘటన జరిగిందని చెప్పుకొచ్చారు. పసిపాపను కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకోవాలని తాను తన కజిన్‌కి చెప్పానని షకీల్ ఆ వీడియోలో చెప్పారు.

**ఆ కేసులో రహీల్‌కు క్లీన్‌చిట్...**

అదే నెల 19న విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన పోలీసులు రహీల్‌కు క్లీన్ చిట్ ఇచ్చేశారు. ఆ వాహనాన్ని తానే నడుపుతున్నట్లు షకీల్ బంధువు సయ్యద్ అఫ్నాన్ అహ్మద్ లొంగిపోయాడని వెల్లడించారు. ఈ ప్రమాదంలో రహీల్ పాత్ర లేనట్లు తేల్చేశారు. అయితే తాజాగా ఆ కేసుపై దృష్టి పెట్టిన ప్రత్యేక బృందం రికార్డులను పరిశీలించగా అనేక లోపాలు కనిపించాయి. కాజల్ వాంగ్మూలంలో ఎక్కడా ప్రమాద సమయంలో డ్రైవింగ్ ఎవరు చేశారనే ప్రస్తావన లేదు. ఆమెతో అఫ్నాన్‌కు టెస్ట్ ఐడెంటిఫికేషన్ పెరేడ్ నిర్వహించిన దాఖలాలు లేవు. మరోపక్క అప్పట్లో పోలీసుల ప్రకటించిన వేలిముద్రల రికార్డులు కోర్టుకు సమర్పించలేదు. అదే ఏడాది నవంబర్‌లో లోపభూయిష్టమైన అభియోగపత్రాలు దాఖలు చేశారు. ఈ వ్యవహారం వెనుక షకీల్–రహీల్ పాత్ర అనుమానిస్తున్న వెస్ట్‌జోన్ పోలీసులు ఆ ఫైల్‌ను రీ–ఓపెన్ చేశారు. ఈ నేపథ్యంలోనే తండ్రీకొడుకులతో పాటు అప్పట్లో జూబ్లీహిల్స్ కేసు దర్యాప్తు చేసిన అధికారుల చుట్టూ ఉచ్చుబిగుస్తోంది.

# 'వాపసీ' కార్మికుల పునరావాసానికి ప్రాధాన్యమివ్వాలి

**జెనీవా ప్రపంచ వేదిక సదస్సులో తెలంగాణవాసులు**



సదస్సులో మంద భీంరెడ్డి, సిస్టర్ లిజీ జోసెఫ్

మోర్తాడ్ (బాల్కొండ): గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు వలస వెళ్లి, వెనక్కి తిరిగి వచ్చిన కార్మికులను గుర్తించి పునరావాసానికి చర్యలు తీసుకోవాలని గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో సోమ, మంగళవారాల్లో గ్లోబల్ ఫోరం ఆన్ మైగ్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ సదస్సులో వంద దేశాల ప్రభుత్వాల ప్రతినిధులు, వలస కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సులో జగిత్యాల జిల్లాకు చెందిన గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు మంద భీంరెడ్డి, హైదరాబాద్‌కు చెందిన సిస్టర్ లిజీ జోసెఫ్, సౌదీలో నివసించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం వాసి చేతన మాట్లాడారు. వలసలతో దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తున్నా, వలస కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడాన్ని వారు తప్పుపట్టారు. గల్ఫ్ యేతర దేశాల్లో ఉపాధి పొందుతున్నవారి జీవన శైలికి గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న వారి జీవన విధానానికి చాలా తేడా ఉందని వారు పేర్కొన్నారు. వలస వెళ్లి ఇంటికి తిరిగి చేరుకున్న తర్వాత వారి ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారుతోందన్నారు. సొంతూళ్లకు చేరుకున్న వలస కార్మికుల జాబితాలను సిద్ధం చేసి వారికి పునరావాసం కల్పించడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని సూచించారు. ఇది ఒక్క భారత దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లోని వలస కార్మికులకూ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఐదుగురు ఐఏఎస్‌లకు పోస్టింగులు

**దళితాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఐదుగురు ఐఏఎస్ అధికారులకు పోస్టింగులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలో కీలక అధికారులుగా, ప్రధాన జిల్లాలకు కలెక్టర్లుగా పనిచేసి ఇటీవల బదిలీ అయి పోస్టింగుల కోసం ఎదురుచూస్తున్న వీరికి పోస్టింగులిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సింగరేణి సీఎండీగా పనిచేసిన అధికారి శ్రీధర్‌కు దళితాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. గనుల శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కాత్యాయనీదేవిని అక్కడి నుంచి బదిలీ చేసి గ్రామీణాభివృద్ధి సంస్థ (టీఎస్ఐఆర్‌డీ) సీఈవోగా నియమించారు.

| ఐఏఎస్ పేరు | పోస్టింగ్ |
|---|---|
| ఎన్. శ్రీధర్ | దళితాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి |
| డి.అమోయ్‌కుమార్ | పశుసంవర్ధక శాఖ సంయుక్త కార్యదర్శి |
| టి.వినయ్ కృష్ణారెడ్డి | వైద్యారోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి |
| ఎస్.హరీశ్ | రోడ్లు, భవనాల శాఖ సంయుక్త కార్యదర్శి |
| పి.కాత్యాయనీదేవి | సీఈవో, టీఎస్ఐఆర్‌డీ |
| సుశీల్‌కుమార్ (నాన్‌కేడర్) | గనుల శాఖ డైరెక్టర్ |

# మమ్మల్ని విధుల్లోకి తీసుకోండి

**సీఎంను కలిసేందుకు వచ్చిన మాజీ ఆర్టీసీ ఉద్యోగులు**

**అపాయింట్‌మెంట్ లేకపోవడంతో వెనక్కిపంపేసిన పోలీసులు**

బంజారాహిల్స్ (హైదరాబాద్): తమను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలంటూ వివిధ కారణాలతో ఆర్టీసీలో ఉద్యోగాలు కోల్పోయిన కండక్టర్లు, డ్రైవర్లు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసేందుకు జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసం వద్దకు వచ్చారు. అనివార్య కారణాల వల్ల గతంలో శాఖాపరమైన చర్యలకు గురైన వారు చాలామంది ఉన్నారని తమను మానవతా దృక్పథంతో తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని సీఎంను కోరేందుకు వచ్చినట్లు ఉద్యోగుల ప్రతినిధి రాంబాబు తెలిపారు. ఉద్యోగాలు లేక కుటుంబ పోషణ భారమై దుర్భరమైన జీవితాలను గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సీఎం అపాయింట్‌మెంట్ లేకపోవడంతో పెద్ద ఎత్తున వచ్చిన ఆర్టీసీ ఉద్యోగులను పోలీసులు తిప్పి పంపించారు.



జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వచ్చిన ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ మాజీ ఉద్యోగులు



నీకు నీ దారి ఉంది. నాకు నా దారి ఉంది.
సరైన దారి, కచ్చితమైన దారి, ఒకే ఒక్క దారి
అనేది మాత్రం ఉనికిలో లేదు.

– ఫ్రెడరిక్ నీషే



సాక్షి

గురువారం, 25 జనవరి 2024

# కనువిప్పు కలిగించే కోత!

కెనడాతో మరో తంటా వచ్చి పడింది. సెప్టెంబర్‌లో మొదలయ్యే కొత్త విద్యా సంవత్సరం నుంచి విదేశీ విద్యార్థులకు ఇచ్చే స్టూడెంట్ పర్మిట్లపై రెండేళ్ళ పాటు పరిమితులు విధిస్తున్నట్టు ఆ దేశం సోమవారం ప్రకటించింది. వీసాల సంఖ్య తగ్గిందంటే, కాలేజీ డిగ్రీ కోసం అక్కడకు వెళ్ళే భారతీయ విద్యార్థుల సంఖ్య కూడా తగ్గనుందన్న మాట. ఈ వీసాల కోత అన్ని దేశాలకూ వర్తించేదే అయినా, మనవాళ్ళ విదేశీ విద్యకు కెనడా ఓ ప్రధాన కేంద్రం కావడంతో భారతీయ విద్యార్థి లోకం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కెనడా గడ్డపై ఓ ఖలిస్తానీ తీవ్రవాది హత్య వెనుక భారత్ హస్తం ఉందంటూ ఆ దేశం చేసిన ఆరోపణలతో ఇప్పటికే భారత – కెనడా దౌత్య సంబంధాలు చిక్కుల్లో పడ్డాయి. ఆ కథ కొలిక్కి రాకముందే, విదేశీ స్టూడెంట్ వీసాలకు కెనడా చెక్ పెట్టడం ఇంకో కుదుపు రేపింది.

ఇటీవల కెనడాకు వెళ్ళి చదువుకొంటున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో అతి పెద్ద వర్గాలలో ఒకటి భారతీయ విద్యార్థి వర్గం. 2022లో 2.25 లక్షల పైచిలుకు మంది మన పిల్లలు అక్కడకు చదువులకు వెళ్ళారు. వివరంగా చెప్పాలంటే, ఆ ఏడాది కెనడా ఇచ్చిన మొత్తం స్టడీ పర్మిట్లలో 41 శాతానికి పైగా భారతీయ విద్యార్థులకే దక్కాయి. ఇక, 2023 సెప్టెంబర్ నాటి కెనడా సర్కార్ గణాంకాల ప్రకారం అక్కడ చదువుకు అనుమతి పొందిన అంతర్జాతీయ విద్యార్థుల్లో 40 శాతం మంది భారతీయులే. 12 శాతంతో చైనీయులు రెండో స్థానంలో ఉన్నారు. తీరా ఇప్పుడీ కొత్త నిబంధనలు అలా కెనడాకు వెళ్ళి చదవాలనుకుంటున్న వారికి అశనిపాతమే. వారంతా ఇతర దేశాల వంక చూడాల్సిన పరిస్థితి.

2023లో కెనడా 10 లక్షలకు పైగా స్టడీ పర్మిట్లిచ్చింది. దశాబ్ది క్రితంతో పోలిస్తే ఇది 3 రెట్లు ఎక్కువ. తాజా ప్రతిపాదనతో ఈ ఏడాది ఆ పర్మిట్ల సంఖ్య 3.64 లక్షలకు తగ్గనుంది. అంటే, 35 శాతం కోత పడుతుంది. విదేశీ విద్యార్థుల స్టడీ పర్మిట్లపై పరిమితి ప్రధానంగా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకే వర్తిస్తుంది. గ్రాడ్యుయేట్, మాస్టర్స్ డిగ్రీలు, పీహెచ్‌డీలకు ఇది వర్తించకపోవడం ఊరట. అయితే, పోస్ట్ గ్రాడ్యుయేట్ వర్క్ పర్మిట్లకు షరతులు వర్తిస్తాయి. గతంలో కెనడాలో పీహెచ్‌డీ, మాస్టర్స్ కోర్సులు చేస్తుంటే మూడేళ్ళ వర్క్ పర్మిట్ దక్కేది. ఆ దేశంలో శాశ్వత నివాసం సంపాదించడానికి ఈ పర్మిట్లు దగ్గరి దోవ. ప్రధానంగా పంజాబీలు కెనడాలో చదువుతూనే, లేదంటే తాత్కాలిక ఉద్యోగాల్లో చేరుతూనే జీవిత భాగస్వామిని వీసాపై రప్పిస్తుంటారు. ఇక ఆ వీలుండదు.

స్టడీ పర్మిట్లలో కోతతో విదేశీ విద్యార్థులకే కాదు... కెనడాకూ దెబ్బ తగలనుంది. పెద్దయెత్తున విదేశీ విద్యార్థుల్ని ఆకర్షించడానికి కెనడాలోని పలు విద్యాసంస్థలు తమ ప్రాంగణాలను విస్తరించాయి. తాజా పరిమితితో వాటికి ఎదురుదెబ్బ తగలనుంది. అంతర్జాతీయ విద్యార్థుల వల్ల కెనడా ఆర్థిక వ్యవస్థకు ఏటా 1640 కోట్ల డాలర్ల మేర ఆదాయం వస్తోంది. కోతలతో ఇప్పుడు దానికి గండి పడనుంది. అలాగే, జీవన వ్యయం భరించగలమంటూ ప్రతి విదేశీ విద్యార్థీ 20 వేల కెనడా డాలర్ల విలువైన 'గ్యారెంటీడ్ ఇన్‌వెస్ట్‌మెంట్ సర్టిఫికెట్' (జీఐసీ) తీసుకోవడం తప్పనిసరి. అలా కొత్త విద్యార్థుల వల్ల కెనడా బ్యాంకులు సైతం ఇంతకాలం లాభపడ్డాయి. తాజా నిబంధనలతో వాటికీ నష్టమే. అలాగే, దాదాపు లక్ష ఖాళీలతో కెనడాలో శ్రామికశక్తి కొరత ఉంది. విదేశీ విద్యార్థులు ఆ లోటును కొంత భర్తీ చేస్తూ వచ్చారు. గడచిన 2023లో ఒక్క ఆహారసేవల రంగంలో 11 లక్షల మంది కార్మికులుంటే, వారిలో 4.6 శాతం మంది ఈ అంతర్జాతీయ విద్యార్థులే. ఆ లెక్కలన్నీ ఇక మారిపోతాయి. శ్రామికశక్తి కొరత పెరుగుతుంది. అయినా, కెనడా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నట్టు?

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీసుకున్న ఈ కోత నిర్ణయం వెనుక అనివార్యతలు అనేకం. చదువు పూర్తి చేసుకొని, అక్కడే వర్క్ పర్మిట్లతో జీవనోపాధి సంపాదించడం సులభం గనక విదేశీ విద్యకు కెనడా పాపులర్ గమ్యస్థానం. అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య పెరిగేసరికి, అద్దెకు అపార్ట్‌మెంట్లు దొరకని పరిస్థితి. నిరుడు కెనడా వ్యాప్తంగా అద్దెలు 7.7 శాతం పెరిగాయి. గృహవసతి సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. దాంతో ట్రూడో సర్కారుపై ఒత్తిడి పెరిగింది. విదేశీయుల వలసల్ని అతిగా అనుమతించడమే ఈ సంక్షోభానికి కారణమని కెనడా జాతీయుల భావన. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనుండడంతో ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీకి ఇది లాభించింది. పైగా, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ట్రూడో ఓటమి పాలవుతారని ప్రజాభిప్రాయ సేకరణల మాట. ఈ పరిస్థితుల్లో స్వదేశీయుల్ని సమాధానపరిచి, వలస జీవుల అడ్డుకట్టకై ట్రూడో సర్కార్ ఈ వీసాల కోతను ఆశ్రయించింది. విద్యార్థుల సంఖ్యను వాటంగా చేసుకొని, కొన్ని సంస్థలు కోర్సుల నాణ్యతలో రాజీ పడుతున్న వైనానికి అడ్డుకట్ట వేసేందుకు ఈ చర్య చేపట్టామని కెనడా మాట.

తాజా పరిణామం భారత్‌కు కనువిప్పు. కెనడాలో పలు ప్రైవేట్ సంస్థలు ట్యూషన్ ఫీజులేమో భారీగా వసూలు చేస్తూ, నాణ్యత లేని చదువులు అందిస్తున్నాయి. అయినా భారతీయ విద్యార్థులు కెనడాకో, మరో విదేశానికో వెళ్ళి, ఎంత ఖర్చయినా పెట్టి కోర్సులు చేసి, అక్కడే స్థిరపడాలనుకుంటున్నారంటే తప్పు ఎక్కడున్నట్టు? మన దేశంలో ఉపాధి అవకాశాలు ఏ మేరకు ఉన్నట్టు? ఇది పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన విషయం. 2025 నాటికి భారతీయ కుటుంబాలు పిల్లల విదేశీ చదువులకై ఏటా 7 వేల కోట్ల డాలర్లు ఖర్చుచేస్తాయని అంచనా. చిన్న పట్నాలు, బస్తీల నుంచీ విదేశీ విద్య, నివాసంపై మోజు పెరుగుతుండడం గమనార్హం. నాణ్యమైన ఉన్నత విద్య, ఉపాధి కల్పనలో మన ప్రభుత్వాల వైఫల్యాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఈ వాస్తవాలు గ్రహించి, ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. లేదంటే, అమెరికాలో ఉద్యోగాలకు, కెనడాలో వీసాలకు కోత పడినప్పుడల్లా దిక్కుతోచని మనవాళ్ళు మరో దేశం దిక్కు చూడాల్సిన ఖర్మ తప్పదు!

# దౌత్య సంబంధాల్లో సహనం ముఖ్యం

సందర్భం



శ్యామ్ శరణ్

**మాల్దీవుల్లోని ప్రస్తుత ప్రభుత్వం 'ఇండియా ఔట్' నినాదంతో గెలిచింది. భారత సైన్యాన్ని తమ దేశం నుంచి ఉపసంహరించుకోవాలని కోరింది. దీనికి తోడు లక్షదీవులు వర్సెస్ మాల్దీవుల సోషల్ మీడియా వివాదం చెలరేగింది. ఈ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో భారత్ వైఖరి ఎలా ఉండాలి? సోషల్ మీడియాకు ప్రతిస్పందనగా విదేశాంగ విధానం ఉండకూడదు. అభ్యంతరకరమైన ట్వీట్‌లకు కారణమైన ముగ్గురు మంత్రులను మాల్దీవుల ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయాన్ని మనం విస్మరించకూడదు. అలాగే మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ ఇండియాకు అనుకూలం. ఈ ముఖ్యమైన వర్గాన్ని చీకాకు పెట్టేలా భారతీయ కార్యకలాపాలు ఉండకూడదు. విదేశాంగ విధానం అనేది ఎప్పటికప్పుడు ముగిసిపోయేది కాదు. అది స్థిరంగా కొనసాగాలి.**

2023 నవంబర్‌లో జరిగిన మాల్దీవుల అధ్యక్ష ఎన్నికల్లో పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ నాయకుడు మొహమ్మద్ ముయిజ్జు 'ఇండియా ఔట్' (భారత్ వెళ్లిపో) అనే ప్రజాకర్షక నినాదంతో గెలిచినప్పుడే భారత్–మాల్దీవుల సంబంధాలు మళ్లీ దెబ్బతింటాయని అందరూ భావించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే, తమ దేశం నుంచి భారత రక్షణ సిబ్బందిని ఉపసంహరించుకోవాలని ముయిజ్జు భారత్‌ను కోరారు. మాల్దీవులలోని వెయ్యికి పైగా ద్వీపాలు విస్తారమైన సముద్ర ప్రాంతంలో వ్యాపించి ఉన్నాయి. అక్కడి అతిపెద్ద ప్రత్యేక ఆర్థిక మండలి (ఈఈజెడ్) భద్రత, దీవుల్లో విపత్తు సహాయ కార్యకలాపాలపై నిఘా కోసం భారత్ బహుమతిగా ఇచ్చిన డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్, హెలికాప్టర్లను 75 మంది భారత సైనికులు నడుపుతున్నారు. మాల్దీవులు వ్యవస్థాపక సభ్యదేశంగా ఉన్న 'కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్'లో భాగంగా సముద్ర భద్రతను ప్రోత్సహించడానికి ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగానే దేశంలోని అతిపెద్ద ఆర్థిక మండలిలో భూజలాధ్యయన సర్వేను భారత్ నిర్వహించాల్సి ఉంది. కానీ ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి కూడా కొత్త ప్రభుత్వం నిరాకరించింది. దీనిమీద భారత్ నుంచి ఎలాంటి అధికారిక స్పందన లేదు. కానీ తమ అభ్యర్థనలను భారత్ అంగీకరించిందని ముయిజ్జు చెబుతున్నారు.

జనవరి 8న చైనాలో నాలుగు రోజుల అధికారిక పర్యటనకు ముయిజ్జు వెళ్లారు. అదే సందర్భంలో ఆయన ప్రభుత్వంలోని ముగ్గురు ఉప మంత్రులు సోషల్ మీడియాలో ప్రత్యేకంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ గురించీ, మొత్తంగా భారతీయుల గురించీ అవమానకరమైన వ్యాఖ్యలను పోస్ట్ చేయడంతో ఒక వికారమైన వివాదం చెలరేగింది. ప్రధాని మోదీ ఇటీవల లక్షద్వీప్ దీవులను సందర్శించిన ఫోటోలను పోస్ట్ చేశారు. లక్షద్వీప్‌కు దక్షిణంగా ఉన్న ఈ దీవులు మాల్దీవుల కంటే మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా ఆవిర్భవించగలవని కొందరు సోషల్ మీడియాలో వాదనలు మొదలుపెట్టారు. వాటికి వ్యతిరేకంగానే మాల్దీవుల మంత్రులు ప్రతిస్పందించినట్లు కనబడింది. ఆ తర్వాత మాల్దీవులను బహిష్కరించాలని కొందరు భారతీయ ప్రముఖులు పిలుపునివ్వడంతో సోషల్ మీడియా యుద్ధం చెలరేగింది. కొన్ని సంవత్సరాలుగా, మాల్దీవులను సందర్శించేవారిలో భారతీయుల వాటా అత్యధికం. తాజా పరిణామంతో మాల్దీవులను సందర్శించాలనుకున్న భారతీయులు తమ హోటల్, విమాన బుకింగ్‌లను రద్దు చేసుకున్నారు. ఇది ఆ దేశ పర్యాటక పరిశ్రమను దెబ్బతీసింది. అయితే ఒకటి మర్చిపోకూడదు. కోవిడ్–19 మహమ్మారికి ముందు, ఈ పర్యాటకుల రాకపోకలలో చైనా మొదటి స్థానంలో ఉండేది. అన్ని ప్రయాణ ఆంక్షలను చైనా ఎత్తివేస్తే ఆ స్థానాన్ని తిరిగి ఆ దేశమే పొందే అవకాశం ఉంది.



దుబాయ్‌లో జరిగిన కాప్ సమావేశాల్లో నరేంద్ర మోదీతో మహమ్మద్ ముయిజ్జు

ముయిజ్జు చైనా పర్యటన సందర్భంగా, రెండు దేశాల మధ్య 'సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యాన్ని' ప్రకటించే సంయుక్త పత్రికా ప్రకటన వెలువడింది. గ్లోబల్ సివిలైజేషన్ ఇనిషియేటివ్, గ్లోబల్ సెక్యూరిటీ ఇనిషియేటివ్, గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ (జీడీఐ) అనే మూడు కీలకమైన చైనా ప్రాజెక్టులలో పాల్గొనడానికి మాల్దీవులు సుముఖంగా ఉన్నట్లు ఈ ప్రకటన సూచిస్తోంది. 'గ్రూప్ ఆఫ్ ఫ్రెండ్స్ ఆఫ్ ద జీడీఐ'లో మాల్దీవులు చేరింది. చైనీస్ బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ కింద ప్రాజెక్టులను స్వాగతించింది. మాల్దీవుల ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారానికి ప్రామాణికమైన చైనా మద్దతు ఉంది. మాల్దీవుల అంతర్గత వ్యవహారాలలో ఏదైనా బాహ్య జోక్యాన్ని చైనా వ్యతిరేకిస్తోంది. ఈ విషయంలో పేరు ఎత్తని గురి ఇండియానే అని చెప్పనక్కరలేదు.

అయితే చైనా, మాల్దీవుల ఉమ్మడి ప్రకటనలో రెండు ముఖ్యమైన మినహాయింపులు ఉన్నాయి. 2017లో అప్పటి మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్ బీజింగ్‌లో పర్యటించారు. చైనాకు అత్యంత అనుకూలమైన స్థానాన్ని ఇచ్చేలా, ఇరు దేశాల మధ్య కుదిరిన వివాదాస్పద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద అమలు గురించి ఉమ్మడి ప్రకటనలో ఏ ప్రస్తావనా లేదు. అప్పటినుంచి అది సుప్తచేతనలో ఉంది. దాని పునరుద్ధరణ కోసం మాలేలోని చైనా రాయబారి ఒత్తిడి చేస్తున్నారు. హిందూ మహాసముద్రంలో సముద్ర ట్రాఫిక్‌ను పర్యవేక్షించడానికి తమకు అనుకూలమైన స్థానాన్ని ఇచ్చే పరిశీలనా కేంద్ర ఏర్పాటు కోసం చైనా ప్రతిపాదించిన ప్రాజెక్ట్ గురించి కూడా ఉమ్మడి ప్రకటనలో ప్రస్తావన లేదు. ఇవి సాపేక్షంగా భారత్‌కు సానుకూలాంశాలు. ఈ పరిణామాలను భారత్ గమనించాలి. (దీవుల్లో పరిశోధన కోసం చైనా నౌక చేరుకుందన్న వార్తలు వచ్చాయి. అది ఫిబ్రవరిలో రానుందనీ, కానీ పరిశోధన కోసం మాత్రం కాదనీ మాల్దీవులు చెబుతోంది.)

2023 డిసెంబర్ 7న మారిషస్‌లో జరిగిన కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్‌కు మాల్దీవులు గైర్హాజరవడం ఒక ఎదురుదెబ్బ. భారత్ 2011లో శ్రీలంక, మాల్దీవులతో ఈ త్రైపాక్షిక సముద్ర భద్రతా వేదికను ప్రారంభించింది. సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం, మానవ అక్రమ రవాణా, సైబర్ భద్రతతో కూడిన ఎజెండాపై, ఈ దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడంలో ఈ వేదిక ముఖ్యమైన పాత్ర పోషించింది. 2020లో మారిషస్ ఈ కూటమిలో చేరింది. ఇటీవలి మారిషస్ సమావేశంలోనే, సీషెల్స్, బంగ్లాదేశ్ పరిశీలకులుగా చేరాయి. తర్వాత ఇవి పూర్తి సభ్య దేశాలు కావచ్చు. చైనా మెప్పు కోసం మాల్దీవులు ఈ సమావేశానికి హాజరుకాలేదని అనుకోవచ్చు.

ఈ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో భారత్ వైఖరి ఎలా ఉండాలి? ఒకటి, సోషల్ మీడియాకు ప్రతిస్పందనగా విదేశాంగ విధానం ఉండకూడదు. మాల్దీవుల ప్రభుత్వం అధికారికంగా క్షమాపణ చెప్పనప్పటికీ, అభ్యంతరకరమైన ట్వీట్‌లకు కారణమైన ముగ్గురు మంత్రులను సస్పెండ్ చేయడంతోపాటు, తమ మంత్రుల చర్యలను తీవ్రంగా ఖండించిన విషయాన్ని మనం విస్మరించకూడదు.

రెండు, మాల్దీవులలోని పార్లమెంట్‌లో ఇండియాకు అనుకూలంగా ఉండే మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ ఆధిపత్యం చలాయిస్తోంది, దీని ప్రతినిధులు మోదీ వ్యతిరేక ట్వీట్‌లను తీవ్రంగా ఖండించారు, అధికారికంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పైగా దీర్ఘకాలంగా మాల్దీవులకు భారత్ ఇస్తున్న మద్దతు, సద్భావన గురించి గొప్పగా మాట్లాడాలని డిమాండ్ చేశారు. మాలెలో ఇటీవల జరిగిన మేయర్ ఎన్నికల్లో ఈ పార్టీ సునాయాసంగా విజయం సాధించింది. ముయిజ్జు అధ్యక్షుడు కావడానికి ముందు రాజధాని మేయర్‌గా ఉన్న విషయం తెలిసిందే. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో భారత అనుకూల రాజకీయ శక్తులు విజయం సాధించే అవకాశం ఉంది. భారత్ పట్ల సానుకూల భావాలను కలిగి ఉన్న ఈ బలమైన, ముఖ్యమైన వర్గాన్ని చికాకు పెట్టేలా మన కార్యకలాపాలు ఉండకూడదు. భారత విదేశాంగ మంత్రి ఇటీవలి ప్రకటన, రెండు దేశాల మధ్య బలమైన ప్రజా సంబంధాలను సమర్థించడంలోని ప్రాముఖ్యతను సూచిస్తోంది. అదే సమయంలో, మాల్దీవుల వ్యతిరేక సోషల్ మీడియా వ్యాఖ్యల వరదలకు ఆయన ప్రకటన ఒక ముఖ్యమైన దిద్దుబాటుగా వెలువడింది.

విదేశాంగ విధానం ఎప్పటికప్పుడు ముగిసే ఉపకథలా ఉండకూడదు. పొరుగు దేశాలలోని రాజకీయాలు అనుకూలంగా లేనప్పుడు కూడా స్థిరంగా, బలమైన ఒప్పందలతో కొనసాగాలి. భారత్‌కు మాల్దీవులు వ్యూహాత్మకంగా ముఖ్యమైనది. అక్కడి పరిణామాలపై తన మాటలు, చేతలను భారత్ జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలి. అంతిమంగా సహనమే ఫలితాన్ని ఇస్తుందని మరచి పోకూడదు.

వ్యాసకర్త విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### బలవంతపు స్వేచ్ఛ



చివరిసారి యూఎస్, యూకే 'స్వేచ్ఛా వాణిజ్యాన్ని కాపాడటానికి' యుద్ధానికి వెళ్లింది 'ఓపియమ్ వార్స్' సందర్భంలో! ఎందుకంటే, తమ జనానికి తేరగా నల్లమందు అమ్మడానికి చైనా చక్రవర్తి వారిని అనుమతించలేదు. బలప్రయోగం లేకుండా 'స్వేచ్ఛా' వాణిజ్యం అనేది ఉండదు. గుర్తుంచుకోండి, ఈస్ట్ ఇండియా కంపెనీ కూడా ఇండియాకు ముందు వచ్చింది వ్యాపారుల్లాగే!

– శేఖర్ కపూర్, దర్శకుడు

### మూర్ఖులు పెరిగారు!



నేను ఇంతకుముందు 90 శాతం భారతీయులు, 95 శాతం పాకిస్తానీలు మూర్ఖులు అన్నాను. ఆ 5 శాతం అదనపు మార్కులు పాకిస్తానీలకు ఎందుకు ఇచ్చానంటే, పాకిస్తాన్‌ను వాళ్లు ఇస్లామిక్ రాజ్యంగా ప్రకటించుకున్నారు కాబట్టి! ఇప్పుడు వాస్తవంలో ఇండియా కూడా హిందూ రాజ్యం అయింది కాబట్టి, భారతీయులకు కూడా పాకిస్తానీయులకు ఇచ్చిన శాతమే ఇస్తాను.

– మార్కండేయ ఖట్జూ, మాజీ న్యాయమూర్తి

### జీవితంలో ముఖ్యమైనవి



బాగా బతకడానికి భౌతిక వస్తువులను పోగేసుకోవడమే సరిపోదు. ఎందుకంటే జీవితం మనకు ఉన్న వస్తువుల మీదే ఆధారపడివుండదు. దేవుడితోనూ, ఇతరులతోనూ, తక్కువ కలిగినవారితోనూ మంచి సంబంధాలు ఉండటం మీద జీవితం ఆధారపడి ఉంటుంది.

– పోప్ ఫ్రాన్సిస్, క్రైస్తవ మతగురువు

### మునిగే 'ఇండియా'



ఇది ఇంతకు ముందు ఎన్నోసార్లు చెప్పాను. మళ్లీ చెబుతాను. ఇండియా కూటమి ఒక విఫలయత్నం. అది ఎప్పుడో మునిగిపోయింది. ఇదెలా ఉంటుందంటే: ఆపరేషన్ సక్సెస్, కానీ పేషెంట్ పోయాడు.

– సుహేల్ సేత్, నటుడు

### నమ్మలేని మనిషి



ట్రంప్ (అమెరికా మాజీ అధ్యక్షుడు) నోరు మూసుకుని ఉండలేడు. ఉండగలడా? అవన్నీ పక్కనపెట్టినా, జాతీయ రహస్యాలకు సంబంధించిన విషయాల్లో ఆయన నమ్మదగిన మనిషి కాడు.

– స్టీఫెన్ కింగ్, రచయిత

ఇన్ బాక్స్

## ప్రజాస్వామ్యానికి ఊతం

ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆయువుపట్టు. మనదేశంలో స్థానిక సంస్థల నుండి అసెంబ్లీ, లోక్ సభ, రాజ్యసభ, రాష్ట్రపతి ఎన్నికల వరకూ... ఓటరు ఎవరైనా, ఓటే కీలకం. అయితే ఏ స్థాయి ఎన్నికలైనా నేడు అత్యధికులు ప్రలోభాలకు లొంగిపోయి ఓటు వేయడం, కొందరు అసలు ఓటు హక్కును వినియోగించుకోక పోవడం కనిపిస్తోంది. నిజాయితీగా రాష్ట్ర, దేశ భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని మంచి, చెడు ఆలోచించి ఓటు వేసే వారి సంఖ్య నానాటికి తగ్గిపోతోంది. దీనివల్ల నిజాయితీపరులూ, నిజంగా ప్రజాసేవ చేద్దామనుకునే వారూ రాజకీయాల్లోకి రావడం లేదు.

ఎన్నికల రోజున ఓటరు సౌకర్యార్థం ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినా... నగరాలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు చాలామంది చదువుకున్న వారు, మేధావులు ముందుకు రావడం లేదు. అందుకు హైదరాబాద్ నగరంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలే నిదర్శనం. కారణం ఏదైనా ఓటు హక్కు వినియోగించుకోకపోవడం ప్రజాస్వామ్య హననమే కాదు, బాధ్యతారాహిత్యం కూడా. వీరి వల్ల గెలుపు, ఓటములు తారుమారవుతాయి. ఇప్పటికే మద్యం, డబ్బు గెలుపు ఓటమిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. పోలింగ్‌కు రాని వారి ఓట్లను మరొకరు వేసుకుంటున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఓటర్‌కు మరింత బాధ్యత ఉంది. ఓటు వజ్రాయుధం. ప్రజాస్వామ్య పరిపాలనకు పునాది. ప్రముఖ కవి కాళోజి 'అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు. ఏ పాటి వాడో చూడు. ఎన్నుకుంటే వెలగ బెట్టడం కాదు. ఇప్పటిదాకా ఏం చేశాడో చూడు' అన్నారు. కాబట్టి ఓటరు అభ్యర్థుల గుణగణాలనూ, చరిత్రనూ పరిగణనలోకి తీసుకొని ఓటు వెయ్యాలి. రాష్ట్రం, దేశ భవిష్యత్తు గురించి సీరియస్‌గా ఆలోచించాల్సిన తరుణం ఆసన్నమైంది. ప్రతి ఒక్క ఓటరు తన ఓటు ప్రాధాన్యతను గుర్తించాలి. ఓటు హక్కు ఉంటేనే చాలదు. సక్రమంగా వినియోగించుకుంటేనే రాష్ట్రాన్ని, దేశాన్ని రక్షించుకోగలం.

– డాక్టర్ టి. సేవకుమార్ । 75697 02090
(నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

# యూనివర్సిటీలకు ఇకనైనా ఊపిరులూదండి!

అభిప్రాయం



నెల్లి సత్య

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడకపోతే ఇక్కడి సకల జనుల అభివృద్ధి సాధ్యం కాదని ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నడిచింది. ప్రభుత్వ విశ్వ విద్యాలయాల విద్యార్థులూ, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందీ జేఏసీలుగా ఏర్పడి ప్రత్యేక తెలంగాణ వాదాన్ని భుజానికి ఎత్తుకున్నారు. నాడు ఉద్యమ పార్టీగా టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) అధినేత కేసీఆర్ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ స్థాయిలో ఇక్కడి విశ్వ విద్యాలయాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. తద్వారా బలహీన సామాజిక వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందిస్తామన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం తొలిసారిగా అధికారం చేపట్టిన టీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమ కాలంలో ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించింది. పైగా గత ఉమ్మడి ప్రభుత్వాలు ఇచ్చిన నిధుల కంటే తక్కువ నిధులు కేటాయించింది. 2014– 15 ఆర్థిక సంవత్సరంలో 10.57 శాతం, 2023–24 లో 6.57 శాతం కేటాయించిన నిధులను చూస్తే ఈ సంగతి అర్థమవుతుంది.

అంతేకాకుండా టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయలేదు. మౌలిక సదుపాయాలు కల్పించకపోగా... ప్రైవేటు యూనివర్సిటీలకు దీటుగా కోర్స్ ఫీజులను అమాంతం పెంచి బలహీన సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థుల నైపుణ్యాలు, సామర్థ్యాలు పెంచుకోవడానికి అవకాశం లేకుండా చేసింది. తమ సొంత పార్టీకి చెందిన పలువురు బడా నేతలకు ప్రైవేటు యూనివర్సిటీలు స్థాపించుకోవడానికి అనుమతులు ఇచ్చింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల అభివృద్ధి గురించి కనీసం ప్రస్తావించలేదు. గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా నాటి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని విశ్వవిద్యాలయాల విద్యార్థులు, ప్రొఫెసర్లు నిశితంగా పరిశీలించారు. ప్రభుత్వ మార్పుతోనైనా విశ్వవిద్యాలయాల అభివృద్ధి జరుగుతుందని వారంతా భావించారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. పౌరులు నాణ్యమైన జీవితం గడపడానికీ, దేశం ఆర్థిక పుష్టిని సాధించడానికీ, జరిగిన అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకూ అందడానికీ నాణ్యమైన ఉన్నత విద్య పాత్ర ఎంతో ఉంది. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించాలి. ప్రభుత్వాలు ఉన్నత విద్య పైన పెట్టే పెట్టుబడి వృథాగా భావించకూడదు. సామాజిక పెట్టుబడిగా పరిగణిస్తే అది దీర్ఘ ప్రయోజనాలు అందించి రాష్ట్రం స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయడానికి తోడ్పడుతుంది. ఏం చర్యలు తీసుకోవడం ద్వారా నిర్వీర్యమైన ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను మళ్లీ అభివృద్ధి చేయవచ్చు అనే అంశాలపై నూతన ప్రభుత్వం దృష్టి కేంద్రీ కరించాలి.



గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో తమ అనుమతి లేకుండా నియామకాలు జరపకూడదని జీవో తెచ్చింది. దీని కారణంగా 2013 సంవత్సరం నుండి ఇప్పటివరకు ఎటువంటి నియామకాలు జరగలేదు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని నూతన ప్రభుత్వం ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా తొలుత ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను యూజీసీ నియమాలకు లోబడి భర్తీ చేయాలి. పూర్తిస్థాయిలో ప్రొఫెసర్లను నియమిస్తే విశ్వవిద్యాలయాలకు అనేక పరిశోధన ప్రాజెక్టులు వస్తాయి.

ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులలో ఆరు శాతం నిధులను కేవలం ఉన్నత విద్య పైనే ఖర్చు చేయాలి. రాబోవు ఆర్థిక సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీకి రూ. 1,000 కోట్లు, మిగతా యూనివర్సిటీలకు రూ. 500 కోట్ల చొప్పున బడ్జెట్‌ను కేటాయించాలి. గ్రంథాలయాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, రీసెర్చ్ ల్యాబ్‌లు, సైన్స్ లాబ్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

యూజీసీ నుండి ఫెలోషిప్ అర్హత సాధించని పరిశోధక విద్యార్థులకు సైతం నెలకు రూ. 25 వేల చొప్పున, పీజీ విద్యార్థులకు రూ. 5000 చొప్పున ఆర్థిక సహకారం అందించాలి. నూతన హాస్టళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ... విద్యార్థులకు ఉచిత మెస్ సౌకర్యం కల్పించి మంచి ఆహారం అందించాలి. అలాగే మెరుగైన వైద్య సేవలను అందించాలి.

విశ్వవిద్యాలయాల్లో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశ పెట్టాలి. ఇదే సమయంలో సామాజిక శాస్త్రాల ప్రాధాన్యతను విస్మరించ కూడదు. అలాగే విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, రీసెర్చ్ స్కిల్స్, స్టడీ స్కిల్స్, మెమొరీ స్కిల్స్, ప్రజెంటేషన్ స్కిల్స్, కాన్ఫిడెన్స్ స్కిల్స్ వంటివి పెంపొందించడానికి ప్రత్యేక నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలి.


గత బీఆర్ఎస్ ప్రభుత్వం విశ్వవిద్యాలయాల అభివృద్ధికై ఒక్క సమీక్షా సమావేశం నిర్వహించక పోవడం గమనార్హం. ఈ నూతన ప్రభుత్వం అయినా ఆరు నెలలకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహించి సమస్యలను గుర్తించి వాటికి పరి ష్కారం చూపాలి. గతంలో మాదిరిగా కాకుండా వైస్ ఛాన్స్ లర్ నియామకాల్లో అలసత్వం వహించకూడదు. ప్రజాస్వామ్యం యూనివర్సిటీల్లో పరిఢవిల్ల చేయడానికి విద్యార్థి సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలి.

గత ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లోని అన్ని కోర్సు ఫీజులను అమాంతంగా పెంచింది. దీంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. కావున నూతన ప్రభుత్వం ఫీజులను తగ్గించడంతో పాటు ట్యూషన్ ఫీజులను సకాలంలో చెల్లించాలి. ప్రభుత్వ సహకారం లేకుండా ఏ విశ్వ విద్యాలయాలూ ప్రగతిని సాధించవన్న విషయం గుర్తించి నూతన ప్రభుత్వం తగిన నిధులు సమకూర్చాలి.

వ్యాసకర్త ఉస్మానియా యూనివర్సిటీ ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి । 95503 95232

## సత్యవాక్పాలనం

పుణ్యమే పుణ్యం చేసుకున్నవారిని కాపాడుతుంది. కనుకనే చేసుకున్న పుణ్యం ప్రాణదాత అనబడుతుంది. ఎన్ని విధాలుగానైతే ధర్మాచరణాన్ని పాటించే అవకాశం ఉంటుందో అన్ని విధాలుగానూ పాటించడం వలన ఏమీ నష్టం జరగదు, మాట పడాల్సిన పరిస్థితి రాదు. తాను ప్రమాదంలో పడతానని గ్రహించి కూడా ధర్మాచరణాన్ని కొనసాగించేవాడు ధర్మాత్ములలో ఉత్తముడు. ధర్మాచరణంలో ప్రమాదకరమైన పరిస్థితులు తలెత్తడమే ధర్మాత్ముల పాలిటి విపత్కర పరిస్థితి అవుతుంది కాని మరొకటి కాదు. సూర్యుడు, చంద్రుడు, వాయువు, అగ్ని, అంతరిక్షము, భూమి, నీరు, హృదయం, యమధర్మరాజు, పగలు, రాత్రి, ఇరు సంధ్యలు, ధర్మము – ఈ అన్నీ కూడా మనిషి ప్రతి నిత్యం ఆచరించే పాప పుణ్య వ్యవహారాలను గురించి తెలిసినవిగా ఉంటాయి/ఉంటారు అని గ్రహించాలి.



జ్యోతిర్మయం

అసత్యానికి ఎప్పుడూ దూరంగా ఉంటూ జీవనం సాగించే సాధు పురుషుల దృష్టిలో, ధర్మం ఒక్కటే మానవకోటికి మంచిని చేసేదిగా ఉంటుంది. ధర్మం ఎప్పుడూ ఎవరికీ దుఃఖాన్ని కలిగించేదిగా ఉండదు. పాపకర్మాసక్తుడై పాపం చేసేవాడు తనను ఎవ్వరూ చూడడం లేదని అనుకోవడం పరిపాటి. అలా ఆలోచించడం ఎంతో మూర్ఖమైనదని అతడికి తోచదు. సకల దేవతలు, అంతర్యామి పరమాత్మ చూడలేని, చూడని పని అంటూ జగత్తులో ఏదీ ఉండదు. ఒక వ్యక్తి చేసే పనులకు, ఆచరించే విధులకు ఆ వ్యక్తి హృదయంలోనే దాగివుండి వీక్షించే కర్మసాక్షియైన పరమాత్ముడు సంతృప్తుడుగా ఉన్నప్పుడు, ఆ వ్యక్తికి విధివశాత్తు ఏవైనా పాపాలు సంక్రమిస్తే వాటిని సూర్యపుత్రుడైన యమధర్మరాజు నష్టపరుస్తాడు లేక పోగొడతాడు అని పూర్వులు చెప్పిన మాట. వెయ్యి యాగాలను చేయగా సమకూరిన ఫలాన్ని త్రాసులో ఒకవైపు, సత్యవాక్పాలనతో సమ కూరిన ఫలాన్ని మరొక వైపు ఉంచి తూస్తే, సత్యవాక్పాలన వలన సమకూరిన ఫలమే బరువైనదిగా తేలుతుందన్నది కూడా పూర్వులు చెప్పిన విలువైన మాటలలో ఒకటి.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** పౌర్ణమి రా.10.31 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** పునర్వసు ఉ.8.09 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** సా.4.45 నుండి 6.25 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.20 నుండి 11.08 వరకు, తదుపరి ప.2.51 నుండి 3.39 వరకు, **అమృత ఘడియలు:** రా.3.02 నుండి 4.45 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.48.

## క్లుప్తంగా...

### తొలి రోజు జేఈఈ ప్రశాంతం

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్) మొదటి దశ పరీక్షలు బుధవారం దేశవ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. తొలి రోజు బీఆర్క్ విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ ఏడాది జేఈఈ మెయిన్స్‌కు 12.3 లక్షల మంది దరఖాస్తు చేశారు. వీరిలో బీఆర్క్ రాసే విద్యార్థులు తక్కువగా ఉంటారు. జేఈఈ మెయిన్స్ కోసం రాష్ట్రంలో 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని చోట్లా సీసీ కెమెరాల పర్యవేక్షణ చేపట్టారు. ప్రతీ ఏటా పరీక్ష కేంద్రాల నిర్వహణ సీబీఎస్ఈకి అప్పగించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, ఈసారి థర్డ్ పార్టీకి అప్పగించింది. కంప్యూటర్ ఆధారితంగా జరిగే పరీక్ష కావడంతో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

### నకిలీ పాస్‌పోర్ట్‌ల కేసులో ఏఎస్సై రిమాండ్

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో నకిలీ పాస్‌పోర్టుల కేసులో సూత్రధారిగా అనుమానిస్తున్న ప్రస్తుత ఎస్బీ ఏఎస్సై రాహూఫ్‌ను సీఐడీ అధికారులు హైదరాబాద్‌లో రిమాండ్ చేశారు. కోరుట్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి పాస్‌పోర్టు జారీలో రాహూఫ్ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించారు. ఈనెల 19న కోరుట్లలో నకిలీ పాస్‌పోర్టు ఏజెంట్ల ఇళ్లపై సీఐడీ అధికారులు తనిఖీలు చేసి కొన్ని విలువైన డాక్యుమెంట్లతోపాటు, పాస్‌పోర్టులు సీజ్ చేసి తీసుకెళ్లారు. విచారణ సందర్భంగా సీఐడీ అధికారులకు రాహూఫ్ నిర్లక్ష్యం బయటపడినట్లు తేలింది. దీంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

### బ్రిటిష్ హైకమిషనర్‌తో సీఎం రేవంత్ భేటీ



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను లండన్‌లోని థేమ్స్ రివర్ ప్రాజెక్టు తరహాలో చేపట్టాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్రిటిష్ హై కమిషనర్ అలెక్స్ ఎల్లిస్‌కు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం సచివాలయంలో బ్రిటిష్ హై కమిషనర్ అలెక్స్ ఎల్లిస్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల తన లండన్ పర్యటనలో అక్కడ థేమ్స్ నది నిర్వహణ, రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధి చేసిన తీరును ప్రత్యేకంగా అధ్యయనం చేసినట్లు చెప్పారు. అదే మోడల్‌లో హైదరాబాద్‌లో మూసీనదిని పునరుజ్జీవింపజేసేందుకు చేస్తున్న ప్రణాళికలను, ప్రాజెక్టుకు సంబంధించిన అవుట్‌లైన్, థేమ్స్ నది తరహాలో అభివృద్ధి, తదితర అంశాలను బ్రిటిష్ హైకమిషనర్‌తో చర్చించారు. మూసీ నది ఒడ్డున అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నదీ సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు.

# గవర్నర్‌తో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క బుధవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. 75వ గణతంత్ర వేడుకలకు హాజరుకావాలని గవర్నర్‌ను వారు సాదరంగా ఆహ్వానించారు. అలాగే ముఖ్యమంత్రి ప్రపంచ ఆర్థిక వేదికలో పాల్గొని అక్కడ భారీఎత్తున పెట్టుబడులను ఆకర్షించిన విషయాలను గవర్నర్‌కు ఈ సందర్భంగా వివరించినట్లు సమాచారం. అలాగే లండన్ పర్యటన, అక్కడి ప్రతినిధులతో జరిపిన చర్చల సారాంశాన్ని కూడా రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా గవర్నర్ దృష్టికి తీసుకుని వచ్చినట్లు తెలిసింది. ఈ సమావేశంలోనే టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం అంశాన్ని కూడా ముఖ్యమంత్రి గవర్నర్‌తో ప్రస్తావించినట్లు చెబుతున్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం త్వరగా జరిగితే ఉద్యోగ నోటిఫికేషన్లతోపాటు, ఇదివరకే నిర్వహించిన పరీక్షల ఫలితాల వెల్లడికి వీలవుతుందని తెలిపినట్లు తెలిసింది.



గవర్నర్ తమిళిసైతో ముచ్చటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

# కంప్యూటర్ ఇంజనీరింగ్ సీట్ల పెంపునకు బ్రేక్!

- సంప్రదాయ కోర్సులకు డిమాండ్ తగ్గడంతో ఈ నిర్ణయం?
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ఏఐసీటీఈ
- ఇకపై నాణ్యమైన కాలేజీలకే అనుమతులివ్వాలని తీర్మానం
- ప్రొఫెషనల్స్‌తోనే బోధన చేయాలంటూ సూచనలు
- సరైన ఫ్యాకల్టీ లేకుండా అనుమతులివ్వొద్దని నిర్ణయం





సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది కంప్యూటర్ ఇంజనీరింగ్ కోర్సులు పెంచేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) సుముఖంగా లేదు. ఈ కోర్సుల పెంపు వల్ల సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సులకు డిమాండ్ తగ్గుతోందని అన్ని రాష్ట్రాలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో కొత్తగా కంప్యూటర్ ఇంజనీరింగ్ సీట్ల పెంపుపై ఆంక్షలు విధించే అంశాన్ని ఏఐసీటీఈ పరిశీలిస్తోందని ఆ విద్యా మండలి వర్గాలు తెలిపాయి. అయితే, అన్ని కాలేజీల్లో సీట్ల పెంపును అడ్డుకోబోమని, నాణ్యత లేని, ఫ్యాకల్టీ సరిగా లేని కాలేజీల విషయంలోనే పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని ఏఐసీటీఈ ఇటీవల జాతీయ మండళ్ళ సమావేశంలో స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఈసారి డిమాండ్ లేని కోర్సులకు బదులు డిమాండ్ ఉన్న కోర్సులతో సీట్లు మార్పిడి చేసుకునే విధానానికి అనుమతి లభించే అవకాశం లేదని తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలపై త్వరలో నిర్ణయాన్ని వెల్లడించే అవకాశం ఉంది.

**భారీగా పెరిగిన సీట్లు...!**

తెలంగాణ వ్యాప్తంగా 1.10 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉంటే 58 శాతం కంప్యూటర్ సైన్స్ ఇతర కంప్యూటర్ అనుబంధ కోర్సుల్లోనే ఎక్కువగా సీట్లున్నాయి. ఈ ఏడాది వందకుపైగా కాలేజీలు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్స్ బ్రాంచీల్లో డిమాండ్ లేదని, వీటిని తగ్గించి కంప్యూటర్ సంబంధిత కోర్సుల్లో సీట్లు పెంచాలని అనుబంధ గుర్తింపు ఇచ్చే యూనివర్శిటీలకు దరఖాస్తులు చేశాయి. దీంతో వీటిని తగ్గించి, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ వంటి బ్రాంచీల్లో సీట్ల పెంపునకు అనుమతించాయి. ఈ ఏడాది కొత్తగా కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో 7,635 సీట్లు మంజూరయ్యాయి. డిమాండ్ లేని కోర్సులను రద్దు చేసుకోవడం వల్ల మరో 6,390 సీట్లు అదనంగా మార్పిడి రూపంలో పెరిగాయి. ఈ విధంగా 14,565 సీట్లు కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ విభాగాల్లో అదనంగా చోటు చేసుకున్నాయి.

**ఫ్యాకల్టీ ఎక్కడ..?**

కొత్తగా వచ్చిన కంప్యూటర్ సైన్స్ కోర్సులను బోధించేందుకు నైపుణ్యం ఉన్న అధ్యాపకుల కొరత తీవ్ర స్థాయిలో ఉన్నట్టు అఖిల భారత సాంకేతిక విద్యామండలి గుర్తించింది. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి బ్రాంచీల్లో బోధకులు అవసరమైన మేర ఉన్నారు. కానీ కొత్తగా వచ్చిన కంప్యూటర్ కోర్సులను బోధించే అనుభవజ్ఞుల కొరత రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీలను వేధిస్తోంది. సరైన ఫ్యాకల్టీ లేకపోవడంతో సీఎస్ఈ బ్రాంచీ బోధించే వారినే కొత్త కోర్సులకు వాడుతున్నారు. అయితే వారికి అవసరమైన శిక్షణ కూడా ఇవ్వకపోవడంతో కొత్త కోర్సుల్లో బోధన నాణ్యత లోపిస్తోందని కాలేజీ అధ్యాపక సంఘాలు, విద్యావేత్తల నుంచి వర్సిటీలకు ఫిర్యాదులు వస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏఐసీటీఈ కొన్ని సూచనలు చేసింది. కంప్యూటర్ నేపథ్యంతో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న వారి చేత కొత్త కోర్సులకు పాఠాలు చెప్పించాలని సూచించింది. ఇది ఎంత వరకూ అమలు అవుతుందనే దానిపై వచ్చే నెలలో ఏఐసీటీఈ అధికారులు అధ్యయనం చేయనున్నారు.

**అందరూ సాఫ్ట్‌వేర్ రంగానికే.. అందుకే అధ్యాపకుల కొరత**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ విభాగాల్లో కంప్యూటర్ కోర్సులు చేసిన వాళ్లు అధ్యాపకులుగా పనిచేయడానికి ముందుకు రావడం లేదు. వీళ్ళంతా సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. ఈ కారణంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) బోధించే అధ్యాపకులున్న కాలేజీల్లో అదనపు కొత్త సబ్జెక్టులనైనా ప్రొఫెషనల్స్‌తో బోధించేందుకు ప్రయత్నించాలని వర్సిటీలు సూచిస్తున్నాయి. ఎంఎస్, ఇతర మాస్టర్ డిగ్రీలు చేసి కనీసం ఐదేళ్ళు సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారి చేత బోధన సమంజసమని యూనివర్సిటీలు భావిస్తున్నాయి.

# నార్మల్ పాలకమండలి రద్దు

సాక్షి, యాదాద్రి: నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (నార్మల్) పాలకవర్గం రద్దయ్యింది. చైర్మన్‌తో సహా 12 మంది బోర్డు డైరెక్టర్లు పదవులు కోల్పోయారు. గత సంవత్సరం డిసెంబర్‌లో పాలకవర్గానికి అనుకూలంగా ఇచ్చిన స్టేను హైకోర్టు ఎత్తివేసి, ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. 2023 సెప్టెంబర్ 30కి ముందు నార్మల్ లో ఖాళీ అయిన మూడు డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతోనే పాలకవర్గం రద్దయ్యింది. మాక్స్ చట్టం ప్రకారం నార్మల్ బైలాను అతిక్రమించారని పాల ఉత్పత్తిదారుల సంఘాల చైర్మన్లు అక్టోబర్ 4న రంగారెడ్డి జిల్లా సహకారశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన రంగారెడ్డి జిల్లా డీసీఓ.. మాక్స్ చట్టం ప్రకారం ఉన్న నార్మల్ బైలాను ఉల్లంఘించారని నివేదికలో తేల్చారు. అయితే, ఖాళీ స్థానాలను భర్తీ చేయడానికి పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకొని ఎన్నికల అధికారిగా రిటైర్డ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ హన్మంతరావును సెప్టెంబర్ 1న నియమించారు. ఎన్నికల షెడ్యూల్‌ను కూడా విడుదల చేసిన అనంతరం సెప్టెంబర్ 27న జరగాల్సిన ఎన్నికను పాలకమండలి వాయిదా వేసింది. అయితే, ఎన్నికలు నిర్వహించడంలో విఫలమైనందున నార్మల్ చైర్మన్, డైరెక్టర్లపై అనర్హత వేటు వేస్తూ జిల్లా సహకార అధికారి (డీసీఓ) ధాత్రిదేవి ఆదేశాలు జారీచేశారు. అయితే, తమ పాలకవర్గాన్ని డీసీఓ రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ నా ర్మల్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు స్టే ఇచ్చింది. దీంతో పాలకవర్గానికి వ్యతిరేకంగా ఉన్న పాల ఉత్పత్తిదారుల సంఘాల చైర్మన్లు స్టే ఎత్తివేయాలని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై బుధవారం విచారించిన హైకోర్టు.. గతంలో ఇచ్చిన స్టేను కొట్టివేసింది. ఇప్పుడు నార్మల్ నూతన పాలక వర్గానికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. హైకోర్టు ఆదేశాలపై నార్మల్ ఎండీ కృష్ణను వివరణ కోరగా.. ఉత్తర్వుల కాపీ తనకు అందలేదని చెప్పారు.







# నాన్నా.. ఉరేసుకుని చనిపోతున్నా..

- కుటుంబ కలహాలతో ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య
- సూర్యాపేటలో ఘటన

పెన్‌పహాడ్: 'నాన్నా.. బాధలు భరించలేకపోతున్నా.. అందుకే ఉరేసుకుని చనిపోతున్నా'అని తండ్రికి ఫోన్‌లో చెప్పి ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లాలో ఈ విషాదకర ఘటన జరిగింది. పెన్‌పహాడ్ మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన అర్రూరి జానకిరాములు, జానకమ్మ దంపతుల కుమారుడు సైదులు (41) 2009లో ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ఆయనకు నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన పార్వతితో వివాహం జరిగింది. వీరికి హైదరాబాద్‌లో బీటెక్ సెకండియర్ చదువుతున్న సాయి భవన్, మహబూబ్‌నగర్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన సాయిపూజిత సంతానం. సైదులు ప్రస్తుతం సూర్యాపేటలో ఉద్యోగం చేస్తూ అక్కడే అంజనాపురి కాలనీలో భార్యతో కలసి ఉంటున్నాడు.



సైదులు

**పది రోజుల క్రితం గొడవ**

కొంతకాలంగా సైదులు కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పది రోజుల క్రితం గొడవ తారస్థాయికి చేరడంతో పార్వతి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన సైదులు బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో స్వగ్రామంలోని పొలంవద్దనుంచి తండ్రికి ఫోన్ చేసి ఉరేసుకుని చనిపోతున్నానని చెప్పాడు. జానకిరాములు ఉదయం గ్రామంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా చెట్టుకు ఉరేసుకుని వేలాడుతున్న కుమారుడు కనిపించాడు. సమీపంలోని రైతులు వచ్చి సైదులును కిందికి దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, ఎస్ఐ వెంకన్నగౌడ్ ఇతర పోలీస్ సిబ్బంది పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.











## దక్షిణ భారత ప్రముఖ్‌గా రాచూరి రాజశేఖర్



అత్తాపూర్: అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అయోధ్య రామ రాజ్య ప్రశాసన్ దక్షిణ భారత ప్రముఖ్‌గా రాచూరి రాజశేఖర్‌ను నియమించారు. దక్షిణ భారత్‌లోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, అండమాన్ నికోబార్, పాండిచ్చేరి, లక్షద్వీప్ రాష్ట్రాలకు ప్రముఖ్‌గా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాచూరి రాజశేఖర్ మాట్లాడుతూ... రామ రాజ్య ప్రశాసన్ అయోధ్య వారు తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ మహోత్తరమైన బాధ్యతను తన్ మన్ ధన్‌తో నిర్వహిస్తానన్నారు. రామ రాజ్య ప్రశాసన్ జాతీయ ప్రశాసక్ భాస్కర్ సింగ్‌కు రాజశేఖర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియామక పత్రం కాపీని కేంద్ర ప్రభుత్వం హోంశాఖ, రాష్ట్ర ప్రభుత్వం హోంశాఖ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపించిందన్నారు.

## సింగరేణికి అటవీభూమి మైనింగ్ లీజు

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: మంచిర్యాల జిల్లా జైపూర్‌మండలం శ్రీరాంపూర్ ఏరియాలో శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్-2 విస్తరణ ప్రాజెక్ట్ కోసం మంచిర్యాల ఫారెస్ట్ డివిజన్‌లోని ఇంద్రాణి రిజర్వ్ ఫారెస్ట్‌లోని 162.45 హెక్టార్ల అటవీ భూమిని మైనింగ్ లీజ్ కింద కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మెసెర్స్ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు అటవీయేతర అవసరాల నిమిత్తం ఈ భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మళ్లించిన అటవీభూమికి సంబంధించిన లీగల్ స్టేటస్ మార్చవద్దని, యూజర్ ఏజెన్సీ అవసరమైన అటవీయేతర భూమిని అందించాకే అటవీ భూమిని హ్యాండోవర్ చేయాలని, ఆదిలాబాద్ జిల్లాలోని 324.9 హెక్టార్ల డీగ్రేడెడ్ ఫారెస్ట్ ల్యాండ్‌లో అటవీశాఖ ప్రత్యా మ్నాయ అటవీకరణ చర్యలు (కంపెన్సెటరీ అఫారెస్టేషన్) చేపట్టాలని, కేంద్రం నుంచి నోడల్ ఏజెన్సీ ఆయా మార్గదర్శకాలకు తగ్గట్టుగా స్టేజ్-2 (ఫైనల్)ఆమోదం పొందేందుకు చర్యలు చేపట్టాలని పాటించాల్సిన నిబంధనల్లో స్పష్టం చేశారు. బుధవారం ఈ మేరకు అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి ఎ.వాణీప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు.

## ఫూలే విగ్రహం ఏర్పాటుపై 28న రౌండ్ టేబుల్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఆవరణలో ఫూలే విగ్రహం ఏర్పాటు చేయాలని ఈనెల 28న మాసబ్ ట్యాంక్‌లోని ఖాజా మాన్షన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నటు భారత్ జా గృతి తెలిపింది. భారత్ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనాల్సిందిగా కోరుతూ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు ఇతర రాజకీయ పార్టీల నాయకులను జాగృతి నేతలు ఆహ్వానాన్ని అందించారు.

# నేవీ రాడార్ స్టేషన్ కోసం అటవీ భూములు

- సీఎం రేవంత్‌రెడ్డితో నౌకాదళ అధికారుల భేటీ
- 1,174 హెక్టార్ల బదిలీ ఒప్పందంపై అధికారుల సంతకాలు
- వికారాబాద్ మండలంలో ఏర్పాటు కానున్న కేంద్రం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వికారాబాద్ మండలం పూ డూరు సమీపంలోని దామగూడెం అటవీ ప్రాంతంలో దేశంలోనే రెండో వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ (రాడార్) స్టేషన్ ఏ ర్పాటు ఖరారయ్యింది. బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని తూర్పు నౌకాదళ కమోడోర్ కార్తీక్ శంకర్, సర్కిల్ డీఈవో రోహిత్ భూపతి, కెప్టెన్ సందీప్ దాస్ కలి శారు. వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్ ఏర్పాటు కోసం అట వీ భూముల బదిలీ ఒప్పందంపై వికారాబాద్ డీఎఫ్‌వో, నా వల్ కమాండ్ ఏజెన్సీ అధికారులు సంతకాలు చేశారు. దామ గూడెం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న 1,174 హెక్టార్ల అటవీ భూమిని నేవీకి అప్పగించేందుకు ఈ ఒప్పందం కుదిరింది.

**దేశంలోనే రెండోది**

భారత నావికాదళం తెలంగాణను కీలక స్థావరంగా ఎంచుకుంది. దేశంలోనే రెండో వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్‌ను వికారాబాద్ జిల్లాలో నెలకొల్పుతోంది. నౌకలు, జలాంతర్గాములతో సంభాషించేందుకు నావికా దళం వీఎల్ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్‌ను ఉపయోగిస్తుంది. దామగూడెం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసే స్టేష న్ దేశంలో రెండోది కాగా.. తమిళ నాడులోని తిరునల్వేలిలో ఉన్న ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ రాడార్ స్టేషన్ మొదటిది. రాడార్ స్టేషన్ ఏర్పాటుకు తెలంగాణ అనువైన ప్రాంతంగా విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ ఎప్పుడో గుర్తించింది. 2010 నుంచే రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. పర్యావ రణ అనుమతులు, క్లియరెన్సలన్నీ వచ్చినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో భూముల కేటాయింపు ముందుకు సాగలేదు. వాస్తవానికి 2014లోనే నేవీ ప్రతిపాదనలకు కేంద్ర అటవీ పర్యావరణ శాఖ ఆమోదం తెలిపింది. అటవీ భూమి అప్పగించేందుకు రూ.133.54 కోట్ల కాంపా నిధులు, భూసంరక్షణ చర్యలకు చేపట్టే పనులకు రూ.18.56 కోట్లు కూడా నేవీ చెల్లించింది. అయితే ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని దామగూడెం ఫారెస్ట్ ప్రొటెక్షన్ సంస్థ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రతిపాదించిన అటవీ ప్రాంతంలో ఒక ఆలయం ఉండటంతో దానికి ఇబ్బంది తలెత్తకుండా చూసేందుకు నేవీ అంగీకరించింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం కూడా నౌకాదళ అధికారులు సీఎంతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ దిశగా ముందడుగు పడింది.

**2027లో పూర్తి**

దామగూడెంలో నేవీ స్టేషన్‌తో పాటు ఏర్పడే టౌన్‌షిప్‌లో స్కూళ్లు, హాస్పిటళ్లు, బ్యాంకులు, మార్కెట్లు ఉంటాయి. దాదాపు 600 మంది నావికా దళంతో పాటు ఇతర సాధారణ పౌరులుంటారు. దాదాపు 2,500 నుంచి 3,000 మంది ఈ టౌన్‌షిప్‌లో నివసిస్తారు. విస్తృతంగా మొక్కలు నాటి పెంచడం ద్వారా ఈ ప్రాంతంలో జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు తగిన చర్యలు చేపడతారు. ప్రాజెక్టులో భాగంగా దామగూడెం రిజర్వ్ ఫారెస్ట్ చుట్టూ దాదాపు 27 కి.మీ రోడ్డు నిర్మిస్తారు. 2027లో ఈ కొత్త వీఎల్ఎఫ్ సెంటర్ ఏర్పాటు పూర్తి కానుంది.

# వేల ఏళ్ల పురాతనమైన వినాశకర వైరస్‌ల విజృంభణ!

**ఆర్కిటిక్ మంచు కరగడంతో బయటికొస్తున్న పురాతన వైరస్‌లు**

**వాషింగ్టన్:** రాజులు, సంపన్నులు దాచిన గుప్తనిధులు, లంకెబిందెలు వందల ఏళ్లకు ఇంకెవరికో దొరికితే సంబరమే. కానీ అందుకు భిన్నంగా జరిగితే?. అలాంటి ఉపద్రవమే ముంచుకు రావొచ్చని జీవశాస్త్రవేత్తలు మానవాళిని హెచ్చరిస్తున్నారు. 48,500 సంవత్సరాలపాటు మంచుమయ ఆర్కిటిక్ ఖండంలో మంచు ఫలకాల కింద కూరుకుపోయిన వినాశకర వైరస్‌లు పర్యావరణ మార్పులు, భూతాపం కారణంగా మంచు కరిగి బయటికొస్తున్నాయని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఇన్ని వేల సంవత్సరాలు గడిచినా ఆ వైరస్‌లకు ఇప్పటికీ ఇంకొక జీవికి సోకే సాంక్రమణ శక్తులు ఉండొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. రష్యాలోని సైబీరియా ప్రాంతంలో యకూచి అలాస్ సరస్సులో తవ్వితీసిన నమూనాల్లో పురాతన వ్యాధికారక వైరస్‌లను ఇటీవల జీవశాస్త్రవేత్తల బృందం కనుగొంది. వాటిలో కొన్ని రకాలకు జాంబీ(దెయ్యం)వైరస్‌లుగా వర్గీకరించారు. నిద్రాణ స్థితిలో ఉన్నప్పటికీ ఇంకో జీవికి సంక్రమించే సత్తా ఇంకా వీటికి ఉందో లేదో పరీక్షిస్తున్నట్లు ఎయిక్స్-మార్సెల్లీ విశ్వవిద్యాలయంలో జన్యు శాస్త్రవేత్త జీన్ మైఖేల్ క్లావెరీ చెప్పారు. ''ఆర్కిటిక్ ఖండం ఉపరితలంలో 20 శాతం భూభాగం శాశ్వతంగా మంచుతో కప్పబడి ఉంది. అత్యంత చల్లని, ఆక్సిజన్‌రహిత, ఘనీభవించిన ఈ ప్రదేశంలో పెరుగును పడేస్తే అలా పాడవ్వకుండా అలాగే ఉంటుంది. ఒక 50వేల సంవత్సరాల తర్వాత సైతం తినేయొచ్చు' అని క్లావెరీ అన్నారు. నెదర్లాండ్స్‌లోని రోటర్డామ్ ఎరాస్‌మస్ మెడికల్ సెంటర్‌లోని వైరాలజీ శాస్త్రవేత్త మేరియాన్ కూప్‌మెన్స్ మరికొన్ని వివరాలు చెప్పారు. '' ఈ మంచు ఫలకాల కింది వైరస్‌లు బయటికొచ్చి వ్యాప్తి చెందితే ఎలాంటి రోగాలొస్తాయో ఇప్పుడే చెప్పలేం. అయితే 2014లో సైబీరియాలో మేం ఇదే తరహా వైరస్‌లను పరీక్షించగా వాటికి ఏకకణ జీవులకు సోకే సామర్థ్యం ఉందని తేలింది. 2015లోనూ ఇదే తరహా పరీక్షలు చేశాం. ల్యాబ్‌లో అభివృద్ధిచేసిన జీవులకూ ఈ వైరస్‌లు సోకాయి. ఆర్కిటిక్ ప్రాంతంలో మానవసంచారం పెరగనంతకాలం వీటితో ప్రమాదం ఏమీ లేదు. శతాబ్దాల క్రితం లక్షలాది మందిని పొట్టనబెట్టుకున్న పురాతన పోలియో వ్యాధికారక వైరస్‌లకు ఇప్పటికీ ఆ సంక్రమణ శక్తి ఉండొచ్చు. మనుషుల రాకపోకలతో అంటువ్యాధులను వ్యాపింపజేసే వైరస్‌లు ఆర్కిటిక్ ప్రాంతం దాకా వ్యాపిస్తే అవి, ఇవీ అన్ని కలసి కొత్తరకం ఊహించని వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాం'' అని మేరియాన్ కూప్‌మెన్స్ విశ్లేషించారు.

## మమతకు త్రుటిలో తప్పిన ప్రమాదం

**రోడ్డు ప్రమాదంలో తలకు స్వల్ప గాయం**

**బర్ధమాన్(పశ్చిమబెంగాల్):** అధికారిక పర్యటన ముగించుకుని తిరుగుపయనమైన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ త్రుటిలో రోడ్డు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో తలకు చిన్న గాయమైంది. వేరే వాహనంలో ఆమెను కోల్‌కతాకు తరలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మమత బుధవారం పశ్చిమబెంగాల్‌లోని పుర్బా బర్ధమాన్ పట్టణంలో పరిపాలనా సంబంధ సమీక్ష సమావేశంలో పాల్గొని కోల్‌కతాకు పయనమయ్యారు. కాన్వాయ్ కారు ముందు సీటులో కూర్చున్నారు. సీఎం కాన్వాయ్‌లోకి హఠాత్తుగా గుర్తు తెలియని వాహనం అడ్డుగా రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో మమత ముందు అద్దానికి గుద్దుకున్నారు. దీంతో తలకు స్వల్ప గాయమైంది. వెంటనే ఆమెను వేరే వాహనంలో తరలించామని, ప్రమాదమేమీ లేదని అధికారులు తెలిపారు.

## ఫిబ్రవరి 16న భారత్ బంద్

**వాణిజ్య, రవాణా రంగాలూ కలిసి రావాలన్న రాకేశ్ తికాయత్**

**నోయిడా:** రైతు సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ఫిబ్రవరి 16వ తేదీన భారత్ బంద్‌ను పాటించనున్నట్లు రైతు సంఘాలు ప్రకటించాయి. పంటలకు కనీస మద్దతు ధర సంబంధ చట్టం అమలుసహా రైతాంగ కీలక సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త బంద్ పాటించాలని భారతీయ కిసాన్ యూనియన్(బీకేయూ) జాతీయ అధికార ప్రతినిధి రాకేశ్ తికాయత్ పిలుపునిచ్చారు. మంగళవారం ముజఫర్‌నగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. '' సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం)సహా దేశంలోని అన్ని రైతు సంఘాలు ఆ రోజు భారత్ బంద్‌లో పాల్గొంటాయి. ఆ రోజు రైతులు తమ పొలం పనులకు వెళ్లకండి. ఒక్క రోజు పనులకు సమ్మె పాటించండి. పొలాల్లో అమావాస్య రోజున రైతులు పనులకు వెళ్లరు. అలాగే ఫిబ్రవరి 16 కూడా రైతులకు అమావాస్యే. వర్తకసంఘాలు, రవాణా సంస్థలు ఆరోజు వ్యాపార కార్యకలాపాలు నిలిపేయాలని కోరుకుంటున్నా. దుకాణాలను మూసేయండి. రైతులు, కార్మికులకు మద్దతుగా నిలబడండి'' అని తికాయత్ విజ్ఞప్తిచేశారు.

## సౌదీలో తొలి మద్యం దుకాణం

**ముస్లిమేతర దౌత్యాధికారులకు మాత్రమే**

**రియాద్:** మద్యపాన నిషేధాన్ని పాటించే సౌదీ అరేబియాలో మొట్టమొదటిసారిగా ఆల్కాహాల్ విక్రయ కేంద్రం తెరుచుకోనుంది. ముస్లిమేతర దౌత్యవేత్తల వినియోగం కోసం ఈ మద్యం స్టోర్‌ను తెరవనున్నారు. సంబంధిత మొబైల్ యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న మద్యం ప్రియులు మాత్రమే అక్కడ మద్యం కొనుగోలుచేసేందుకు అర్హులు. సౌదీ అరేబియా విదేశాంగ శాఖ దీనిని అనుమతులు ఇస్తుంది. నెలవారీ కోటా పరిమితి ప్రకారమే వినియోగదారులకు మద్యాన్ని విక్రయిస్తారు. పర్యాటకం, వాణిజ్యం ఊపందుకునేందుకు వీలుగా రియాద్ నగరంలో మద్యం అమ్మకాలు పెరగాలన్న సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆదేశాల మేరకే ఈ స్టోర్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. రియాద్‌లో వివిధ దేశాల ఎంబసీలు, రాయబార కార్యాలయాలకు నిలయమైన ప్రాంతంలో ఈ స్టోర్‌ను మరి కొద్ది వారాల్లో ప్రారంభించనున్నారు.

## యువత 'కర్పూరి' బాటన సాగాలి: మోదీ

**న్యూఢిల్లీ:** ఈసారి గణతంత్ర పరేడ్ మహిళా శక్తికి అద్దం పట్టడం ద్వారా ప్రత్యేకతను చాటనుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఆయన బుధవారం ముచ్చటించారు. ''బిహార్ మాజీ సీఎం దివంగత కర్పూరీ ఠాకూర్ జీవితం గురించి తెలుసుకోండి. ఆయన ఆచరించి చూపిన మానవీయ విలువలను పుణికిపుచ్చుకోండి. ఆయన ఆదర్శాలను జీవితంలో భాగంగా మలచుకోండి. తద్వారా మీ వ్యక్తిత్వం ఆకాశమంత ఎదుగుతుంది'' అని యువతకు సూచించారు. దేశం ముందనే భావనతో సాగాలని పేర్కొన్నారు. దుర్భర దారిద్ర్యంలో జన్మించినా మొక్కవోని కృషి, పట్టుదలతో ఠాకూర్ సీఎం స్థాయికి ఎదిగారని మోదీ చెప్పారు.

# ఇండియా కూటమికి బీటలు

## బెంగాల్లో ఒంటరి పోరు: మమత
### కాంగ్రెస్‌తో పొత్తుండదని ప్రకటన

- రాహుల్ జోడో యాత్రకూ దూరం
- పంజాబ్‌లోనూ ఒంటరి పోరే: ఆప్
- 'ఇండియా' కూటమికి జంట షాకులు
- విపక్షాలకిది చావుదెబ్బే: బీజేపీ

**కోల్‌కతా/చండీగఢ్:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మోదీ సారథ్యంలోని అధికార బీజేపీ కూటమికి గట్టి పోటీ ఇవ్వాలన్న విపక్షాల ప్రయత్నాలకు ఆదిలోని హంసపాదు! కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష 'ఇండియా' కూటమికి భాగస్వామ్య పార్టీలు తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ బుధవారం రెండు భారీ షాకులిచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని తృణమూల్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించింది. పంజాబ్‌లోనూ తమది ఒంటరి పోరేనని ఆప్ నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర బెంగాల్లోకి ప్రవేశించడానికి ఒక రోజు ముందు జరిగిన ఈ పరిణామంతో ఆ పార్టీ ఒక్కసారిగా కంగుతిన్నది. వెంటనే నష్ట నివారణ చర్యలకు రంగంలోకి దిగింది. మమత లేని విపక్ష కూటమిని ఊహించలేమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. తృణమూల్‌తో పొత్తు చర్చలింకా సాగుతున్నాయని, బెంగాల్లో కలిసే పోటీ చేస్తామని ఆశాభావం వెలిబుచ్చారు. కానీ ఆ వ్యాఖ్యలను మమత నిర్ద్వంద్వంగా ఖండించారు. పొత్తుపై కాంగ్రెస్‌తో ఎలాంటి చర్చలూ జరగడం లేదని స్పష్టం చేశారు. ఈలోపే, సీట్ల కోసం తృణమూల్‌ను వేడుకోబోమంటూ కాంగ్రెస్ అగ్ర నేత, బెంగాల్ పీసీసీ చీఫ్ అధీర్ రంజన్ చౌదరి చేసిన వ్యాఖ్యలు మరింతగా మంటలు రేపాయి. 28 విపక్ష పార్టీలతో కూడిన ఇండియా కూటమికి కీలక సమయంలో బీటలు పడుతుండటం కాంగ్రెస్‌ను కుంగదీసే పరిణామమేనని అంటున్నారు. బెంగాల్లో కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తూ ఉండబోదని మీడియాతో మమత కుండబద్దలు కొట్టారు. ఆ పార్టీ మొండి వైఖరి వల్లే ఒంటరి పోరు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. సీట్లు సర్దుబాటుపై తన ప్రతిపాదనలను కాంగ్రెస్ పరిశీలించను కూడా లేదని ఆమె ఆరోపించారు. అంతేగాక బెంగాల్లో క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా కాంగ్రెస్ ఆచరణసాధ్యం కాని డిమాండ్లు తమ ముందుంచినట్టు తృణమూల్ వర్గాలు మండిపడ్డాయి.

**ఆది నుంచీ అంతంతే...**

విపక్ష ఇండియా కూటమికి మమత దూరంగానే మెలుగుతూ వస్తున్నారు. ఇటీవలి వర్చువల్ భేటీకి కూడా డుమ్మా కొట్టారు. బెంగాల్లో ఆగర్భ శత్రువులైన తృణమూల్, లెఫ్ట్ ఫ్రంట్ రెండూ ఇండియా కూటమి భాగస్వాములే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 42 స్థానాలకు గాను తృణమూల్ 22 సీట్లు నెగ్గగా బీజేపీ ఏకంగా 18 స్థానాలు సొంతం చేసుకుంది. కాంగ్రెస్ కేవలం 2 సీట్లతో సరిపెట్టుకుంది. ఈసారి పొత్తులో భాగంగా అవే రెండు సీట్లు కాంగ్రెస్‌కు ఇస్తామని మమత ప్రతిపాదించడంతో కాంగ్రెస్ అవాక్కైనట్టు చెబుతున్నారు. అన్ని తక్కువ స్థానాలతో సరిపెట్టుకునేందుకు ససేమిరా అనడంతో చిర్రెత్తుకొచ్చిన దీదీ మొత్తానికే అడ్డం తిరిగారని సమాచారం. పొత్తులో భాగంగా లెఫ్ట్ ఫ్రంట్‌కు కూడా కొన్ని సీట్లు వదులుకోవాల్సి రావడం కూడా ఆమెకు రుచించలేదని తృణమూల్ వర్గాలు వివరించాయి. బెంగాల్లో 2001, 2011 అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2009 లోక్‌సభ ఎన్నికల్లో కూడా తృణమూల్, కాంగ్రెస్ జట్టుగా పోటీ చేశాయి.

## పంజాబ్‌లో ఒంటరి పోరే
### సీఎం భగవంత్ మాన్ వెల్లడి



పంజాబ్‌లో మొత్తం 13 సీట్లలోనూ ఆప్ ఒంటరిగానే పోటీ చేస్తుందని పార్టీ నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పొత్తుండబోదని స్పష్టం చేశారు. నిజానికి లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ, పంజాబ్, హరియాణా, గోవా, గుజరాత్‌ల్లో పొత్తు దిశగా కాంగ్రెస్, ఆప్ మధ్య చర్చలింకా జరుగుతూనే ఉన్నాయి. పైగా త్వరలో జరగనున్న చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాన్ ప్రకటన కాంగ్రెస్‌లో కలకలం రేపింది. ఆ పార్టీతో పొత్తు ప్రతిపాదనను పంజాబ్ ఆప్ నేతలంతా వ్యతిరేకిస్తున్నారని మాన్ మీడియకు స్పష్టం చేశారు. మొత్తం 13 లోక్‌సభ స్థానాలకూ ఆప్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇప్పటికే చురుగ్గా సాగుతోందని తెలిపారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లో 13 స్థానాలకు గాను కాంగ్రెస్ 8 నెగ్గింది. అకాలీదళ్, బీజేపీ చెరో రెండు, ఆప్ ఒక స్థానంలో గెలిచాయి.

## కూటమిపై ఎవరికీ పెత్తనముండదు
### మమత నర్మగర్భ వ్యాఖ్యలు



బెంగాల్లో పొత్తు లేకపోయినా జాతీయ స్థాయిలో మాత్రం విపక్ష ఇండియా కూటమికి తృణమూల్ కట్టుబడి ఉంటుందని మమత ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం విశేషం. ''కావాలంటే కాంగ్రెస్‌ను దేశవ్యాప్తంగా 300 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయమనండి. మిగతా 243 స్థానాల్లో ప్రాంతీయ పార్టీలు బరిలో దిగుతాయి. కానీ బెంగాల్లో మాత్రం కాంగ్రెస్ వేలు పెడతానంటే ఒప్పుకునే ప్రసక్తే లేదు'' అంటూ ఆమె కుండబద్దలు కొట్టారు. జాతీయ స్థాయిలో విపక్షాల వ్యూహం ఎలా ఉండాలో కూడా లోక్‌సభ ఎన్నికల తర్వాతే నిర్ణయించుకుంటామని చెప్పుకొచ్చారు. ''బీజేపీని సమష్టిగా ఎదుర్కొనే విషయంలో ప్రాంతీయ పార్టీలన్నీ ఒక్క తాటిపై ఉంటాయి. దాన్ని ఓడించేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలూ చేస్తాం'' అని స్పష్టం చేశారు. అయితే, విపక్ష కూటమి ఏ ఒక్క పార్టీకో చెందబోదంటూ కాంగ్రెస్‌పై నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ యాత్ర శుక్రవారం బెంగాల్లోకి ప్రవేశించనున్నా కనీసం మర్యాద కోసమన్నా దానిపై కాంగ్రెస్ తనకు సమాచారం కూడా ఇవ్వలేదని దీదీ ఆరోపించారు. మమత ప్రకటన బహుశా ఇండియా కూటమి వ్యూహంలో భాగమై ఉండొచ్చని మరో భాగస్వామ్య పార్టీ ఎన్సీపీ (శరద్ పవార్) అభిప్రాయపడింది!

### పెళ్లికి ముందే విడాకులు: బీజేపీ

మమత ప్రకటనను విపక్ష ఇండియా కూటమికి చావుదెబ్బగా బీజేపీ అభివర్ణించింది. ''విపక్షాలది కేవలం కాగితపు కూటమేనని మరోసారి రుజువైంది. వాటి రాజకీయ వివాహం పూర్తిగా జరగక ముందే విడాకుల దాకా వెళ్లింది'' అంటూ ఎద్దేవా చేసింది. మమత ప్రకటన ఆమెలో నిరాశా నిస్పృహలకు కూడా అద్దం పట్టిందని పేర్కొంది.



బుధవారం అసోంలోని బొంబైగావ్‌లో ఓ చిన్నారితో రాహుల్ ముచ్చట్లు

## పాతిక కేసులు పెట్టుకోండి: రాహుల్

**బార్పేట(అస్సాం):** అస్సాంలో హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ తనపై మోపిన కేసులకు భయపడేది లేదని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. నాగాలాండ్ నుంచి అస్సాంలోని గువాహటిలోకి భారత్ జోడో న్యాయ్ యాత్ర అడుగుపెట్టకుండా పోలీసులు అడ్డుకున్నపుడు జరిగిన ఘర్షణలకు రాహుల్ కారకుడంటూ హిమంత సర్కార్ కేసులు పెట్టడం తెల్సిందే. అస్సాంలో ఏడు రోజుల యాత్ర బర్‌పేటా జిల్లా కేంద్రంలో బుధవారం ప్రారంభించిన సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన తొలి బహిరంగ సభలో సీఎంపై రాహుల్ విమర్శలు ఎక్కుపెట్టారు. ''కేసులు పెట్టి నన్ను బయపెట్టొచ్చన్న ఐడియా హిమంతకు ఎందుకు వచ్చిందో నాకైతే తెలీదు. మీరు(హిమంత, పోలీసులు) ఎన్ని కేసులు పెడతారో పెట్టండి. మరో పాతిక తప్పుడు కేసులు బనాయించండి. నేను అస్సలు భయపడను. బీజేపీ-ఆర్ఎస్ఎస్ నన్ను భయపెట్టలేవు'' అని అన్నారు. హిమంతను అతిపెద్ద అవినీతి సీఎంగా అభివర్ణించారు. '' మీరు ఆయనతో మాట్లాడుతుంటే ఆలోపు మీ భూమి కొట్టేస్తారు. మీరు వక్కపలుకులు నమిలినంత తేలిగ్గా ఆయన సుపారీ బిజినెస్ కానిచ్చేస్తారు. మీ జేబులో డబ్బు నొక్కేస్తారు. ఏకంగా కజిరంగా నేషనల్ పార్క్ స్థలాలనే సీఎం ఆక్రమించారు. సీఎంతో జాగ్రత్త' అని జనాన్ని అప్రమత్తం చేశారు.

**ఎన్నికలయ్యాక లోపలేస్తాం: సీఎం**

మంగళవారం నాటి ఘర్షణలకు సంబంధించిన కేసులో రాహుల్‌ను లోక్‌సభ ఎన్నికల తర్వాత అరెస్ట్ చేస్తామని సీఎం హిమంత చెప్పారు.

# కొనసాగుతున్న భక్తుల వరద

**అయోధ్యకు లక్షలాదిగా రాక**
- నియంత్రణకు సర్కారు చర్యలు
- బస్సుల రాకపోకలపై నిషేధం

**అయోధ్య/లఖ్‌నవూ:** అయోధ్యకు భక్తుల వరద కొనసాగుతూనే ఉంది. బుధవారం కూడా మధ్యాహ్న సమయానికే దాదాపు 3 లక్షల మంది బాలక్ రామ్ దర్శనం చేసుకున్నట్టు శ్రీరామ జన్మభూమి ట్రస్టు వర్గాలు తెలిపాయి. మంగళవారం తొలి రోజు 5 లక్షల మందికి పైగా దర్శనాలు చేసుకున్న విషయం తెలిసిందే. బుధవారం కూడా తెల్లవారు జాము నుంచే భక్తుల సందడి మొదలైంది. వణికిస్తున్న చలిని కూడా లెక్కచేయకుండా క్యూ లైన్లలో భారీగా బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. వారికి తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. మరోవైపు, అయోధ్యకు దారితీసే హైవేలు, ప్రధాన రహదారులన్నీ వాహనాలతో కిటకిటలాడుతున్నాయి. రానున్న రెండు మూడు రోజుల్లో భక్తుల ప్రవాహం మరింత పెరిగేలా ఉండటంతో ఉత్తరప్రదేశ్ సర్కారు రంగంలోకి దిగింది. భక్తుల సంఖ్యను నియంత్రించేందుకు పలు చర్యలు చేపడుతోంది. వాటిలో భాగంగా అయోధ్యకు యూపీ రోడ్డు రవాణా సంస్థ బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపేసింది. నగరానికి ప్రైవేటు బస్సుల రాకపోకలపైనా నిషేధం విధించారు. వీఐపీలు అయోధ్య సందర్శనను వీలైనంత కాలం వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

**మంత్రులూ, ఫిబ్రవరిలో వెళ్లొద్దు: మోదీ**

భక్తులు పోటెత్తుతున్న నేపథ్యంలో ఫిబ్రవరిలో అయోధ్య సందర్శన యోచన మానుకోవాల్సిందిగా కేంద్ర మంత్రులను ప్రధాని మోదీ కోరినట్టు సమాచారం. బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీ ఇందుకు వేదికైంది. ఇప్పటికిప్పుడు వారు అయోధ్యలో పర్యటిస్తే ప్రొటోకాల్స్ తదితరాలతో భారీగా వస్తున్న సాధారణ భక్తులకు ఇబ్బందికరంగా మారవచ్చని అభిప్రాయపడ్డారు. అయోధ్య రామ మందిర ప్రారంభం, రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠపై భక్తుల ఫీడ్‌బ్యాక్ గురించి మంత్రులను అడిగి తెలుసుకున్నారు.

### గర్భాలయంలోకి వానరం

**హనుమ ఆశీర్వాదమే: ట్రస్టు**

అయోధ్య రామాలయంలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం ఆరు గంటల వేళ ఓ వానరం దక్షిణ ద్వారం గుండా గర్భాలయంలోకి ప్రవేశించింది. లోపల కలియదిరిగింది. రామల్ లల్లా ఉత్సవ విగ్రహం చెంతకు వెళ్లింది. విగ్రహాన్ని పడేస్తుందేమోనని లోనికొచ్చిన భద్రతా సిబ్బందిని చూస్తూ నింపాదిగా తూర్పు ద్వారం గుండా బయటికి వెళ్లింది. బారులు తీరిన భక్తుల కేసి చూస్తూ వెళ్లిపోయింది. దీనికి సంబంధించిన వీడియోను క్షేత్ర ట్రస్టు ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఆ వానరం తీరు అచ్చం మనిషినే తలపించిందని భద్రతా సిబ్బంది గుర్తు చేసుకున్నారు. బహుశా హనుమంతుడే బాలక్ రామ్ దర్శనార్థం వచ్చినట్టుందని వారు అభిప్రాయపడ్డారు.

### అయోధ్యలో హెలికాప్టర్ దర్శనాలు

**సాక్షి, న్యూఢిల్లీ:** అయోధ్య సందర్శనార్థం యూపీలో పలు నగరాల నుంచి హెలికాప్టర్ సర్వీసులను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గోరఖ్‌పూర్, వారణాసి, లక్నో, మథుర, ఆగ్రా, ప్రయాగ్‌రాజ్ నుంచి ఈ సేవలుంటాయి. ఆయా నగరాల నుంచి వచ్చే హెలికాప్టర్ల ల్యాండింగ్ కోసం అయోధ్యలో సరయూ నదీ తీరంలో నూతన హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. అయోధ్య, హనుమాన్ గఢి, సరయూ నదీ ప్రాంతాల విహంగ వీక్షణంకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ ఏరియల్ టూర్‌కు ఒక్కొక్కరికి రూ.3,539 వసూలు చేస్తారు. ఏరియల్ టూర్ ఒకేసారి ఐదుగురు చూడొచ్చు.



బిహార్ దివంగత సీఎం కర్పూరి ఠాకూర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం పోస్టల్ స్టాంపు విడుదల చేస్తున్న అమిత్ షా

## నిరుపేదలకు గౌరవం: అమిత్ షా

**న్యూఢిల్లీ:** బిహార్ దివంగత సీఎం కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడం దేశంలోని కోట్లాది మంది నిరుపేదలు, వెనకబడ్డ వర్గాలు, దళితులకు నిజంగా గొప్ప గౌరవమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కొనియాడారు. అయోధ్యలో రామ్ లల్లా విగ్రహ ప్రతిష్ఠాపన ద్వారా వందలాది ఏళ్ల నిరీక్షణకు తెర దించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆ మర్నాడే ఈ నిర్ణయం తీసుకోవడం నిజంగా అభినందనీయమన్నారు. బుధవారం ఇక్కడ ఠాకూర్ శతజయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. కర్పూరి స్ఫూర్తితో అన్ని వర్గాలనూ సమాదరిస్తూ మోదీ ప్రభుత్వం సాగుతోందన్నారు. ముఖ్యంగా ఓబీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. కేంద్ర మంత్రివర్గంలో 27 మంది ఓబీసీలేనన్నారు.

## చైనాలో అగ్ని ప్రమాదం.. 39 మంది బలి

**బీజింగ్/నాన్‌చాంగ్:** తూర్పు చైనాలోని జియాంగ్జీ ప్రావిన్స్‌లో బుధవారం ఒక దుకాణసముదాయంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. గ్జిన్‌యూ నగరంలోని ఈ భవన సముదాయంలో ఇంకా కొందరు చిక్కుకున్నారని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారిక గ్జిన్‌హువా వార్తాసంస్థ తెలిపింది. ఈ ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు.

## సహచరులపైకి సైనికుని కాల్పులు

**ఆరుగురిని గాయపరిచి ఆత్మహత్య**

**ఇంఫాల్:** అసోం రైఫిల్స్‌కు చెందిన సైనికుడు మణిపూర్‌లో సహచర సైనికులపైకి కాల్పులకు తెగబడ్డాడు. ఆరుగురిని గాయపరిచి తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఈ విషాద ఘటన సజిక్ తంపక్ ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. మణిపూర్‌లో కొనసాగుతున్న జాతుల హింసతో దీనికి సంబంధం లేదన్నారు. ''గాయపడ్డ వారు ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉంది'' అని తెలిపారు.

## రష్యాలో విమానం కూలి 74 మంది మృతి

**65 మంది ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలున్నారు: రష్యా**

**ఖైదీల్లేరు... క్షిపణులున్నాయి: ఉక్రెయిన్**

**మాస్కో:** రష్యాలో బెల్గొరోడ్ రీజియన్‌లో బుధవారం సైనిక విమానం కుప్పకూలింది. ఉక్రెయిన్‌తో యుద్ధ ఖైదీల మార్పిడి కోసం ఆ దేశ సైనికులను తీసుకెళ్తుండగా దాడి జరిగిందని రష్యా ఆరోపించింది. ''65 మంది ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలు, ఆరుగురు విమాన సిబ్బంది, ముగ్గురు సహాయకులు దుర్మరణం పాలయ్యారు. సొంత సైనికులనే ఉక్రెయిన్ పొట్టనబెట్టుకుంది'' అని ఆరోపించింది. విమానంలో యుద్ధ ఖైదీల్లేరని, తమపై దాడికి క్షిపణులను తరలిస్తున్నందుకే కూల్చేశామని ఉక్రెయిన్ పేర్కొంది.

**యుద్ధానికి 700 రోజులు:** ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి 700 రోజులు పూర్తయింది. ఉక్రెయిన్ దాడుల్లో రష్యా ఎన్నో సైనిక విమానాలను కోల్పోయింది. విపరీతమైన చలి కారణంగా ప్రస్తుతం వైమానిక దాడులకే రెండు దేశాలు ప్రాధాన్యతనిస్తున్నాయి. రష్యా క్షిపణి దాడులపై దృష్టి పెట్టడంతో గగనతల రక్షణ వ్యవస్థను పటిష్టపరుచుకుంటామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఉక్రెయిన్‌కు సీ కింగ్ ఎంకే41 బహుళ ప్రయోజన యుద్ధ హెలికాప్టర్లను పంపుతున్నట్లు జర్మనీ బుధవారం ప్రకటించింది.

# జన నాయకుడు మోదీ

**కేంద్ర కేబినెట్ ప్రశంసలు**
- అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠాపనతో నూతన శకానికి నాంది పలికారు
- జాతి శతాబ్దాల కలను సాకారం చేశారు
- ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం

**న్యూఢిల్లీ:** అయోధ్యలో రామాలయ ప్రారంభ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించినందుకు ప్రధాని నరేంద్ర మోదీపై కేంద్ర కేబినెట్ ప్రశంసల వర్షం కురిపించింది. ఆ సందర్భంగా దేశ ప్రజలు మోదీపై కనబరచిన ప్రేమ, ఆప్యాయతలు ఆయన నిజమైన జన నాయకుడని మరోసారి నిరూపించాయని పేర్కొంది. ''రామ మందిరం కోసం ప్రజలంతా కలసికట్టుగా ఉద్యమించిన తీరు కొత్త తరానికి తెర తీసింది. ఇదంతా మోదీ దార్శనికతతోనే సాధ్యపడింది'' అని పేర్కొంది. భరత జాతి శతాబ్దాల కలను సాకారం చేసినందుకు మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ కేబినెట్ ఈ సందర్భంగా తీర్మానం చేసింది. తీర్మాన ప్రతిని బుధవారం జరిగిన కేబినెట్ భేటీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చదివి విన్పించారు. ''1947లో దేశానికి భౌతికంగా మాత్రమే స్వాతంత్ర్యం వచ్చింది. దాని ఆత్మకు మాత్రం ఇన్నేళ్ల తర్వాత 2024 జనవరి 22న రామ్ లల్లా విగ్ర ప్రతిష్ఠాపన ద్వారా ప్రాణప్రతిష్ఠ జరిగింది. ప్రజలు కనబరిచిన ప్రేమాభిమానాల ద్వారా మీరు జన నాయకునిగా సుప్రతిష్ఠితులయ్యారు. రామ మందిర ప్రతిష్ఠాపన ద్వారా కొత్త తరానికి తెర తీసిన దార్శనికుడయ్యారు'' అంటూ మోదీపై తీర్మానం ప్రశంసలు కురిపించింది. ''ప్రజల్లో ఇంతటి ఐక్యత గతంలో దేశంలో ఎమర్జెన్సీ విధించిన సందర్భంగా కన్పించింది. అది ఒక నియంతను ఎదిరించేందుకు జరిగిన ఉద్యమం. ఇదేమో దేశంలో నూతన శకానికి అయోధ్య రాముని సాక్షిగా నాంది పలికిన చరిత్రాత్మక క్షణాలకు సాక్షిగా నిలిచిన ఐక్యత'' అని పేర్కొంది. ఈ సందర్భంగా కేబినెట్ భేటీలో ఆసాంతం భావోద్వేగాలు ముప్పిరిగొన్నాయని ఒక మంత్రి తెలిపారు. రాముని ప్రాణప్రతిష్ఠకు సాక్షిగా నిలిచిన మంత్రివర్గంలో భాగస్వాములుగా ఉండటం గర్వకారణమని కేబినెట్ సభ్యులంతా అభిప్రాయపడ్డట్టు చెప్పారు. ఇది కొన్ని జన్మలకు ఒకసారి మాత్రమే లభించే అరుదైన అవకాశమన్నారు.

**ఆ ప్రాజెక్టులకు రూ.8,500 కోట్లు**

రసాయనాల ఉత్పత్తిని దేశీయంగా పెంచడం ద్వారా వాటి దిగుమతిని తగ్గించుకునే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ.8,500 కోట్ల ఆర్థిక సాయం అందజేయాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో బుధవారం జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశం ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. అలాగే కోల్ ఇండియా, గెయిల్ భాగస్వామ్యంలో రూ.13,052 కోట్ల కోల్-ఎస్ఎన్‌జీ (సింథటిక్ నేచురల్ గ్యాస్), సీఐఎల్, బీహెచ్ఈఎల్ భాగస్వామ్యంలో రూ.11,782 కోట్ల కోల్-అమ్మోనియం నైట్రేట్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కూడా ఆమోదం తెలిపింది.

## ప్రైమరీలో ట్రంప్‌కు మరో గెలుపు

**న్యూ హ్యాంప్‌షైర్ రాష్ట్ర ప్రైమరీలోనూ నిక్కీ హేలీకి చుక్కెదురు**



ట్రంప్



నిక్కీ హేలీ

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం జరుగుతున్న ప్రైమరీల్లో డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఇప్పటికే అయోవా ప్రైమరీలో గెల్చిన ఆయన బుధవారం న్యూ హ్యాంప్‌షైర్ ప్రైమరీలోనూ నెగ్గారు. అయితే భారతీయ అమెరికన్ నాయకురాలు నిక్కీ హేలీ ఆయనకు గట్టిపోటీ ఇచ్చారు. ట్రంప్‌కు 55 శాతానికి పైగా ఓట్లు రాగా ఆమె 44 శాతం సాధించారు. న్యూ హ్యాంప్‌షైర్ ప్రైమరీని మూడుసార్లు గెలిచిన తొలి రిపబ్లికన్ ప్రైమరీ అభ్యర్థిగా ట్రంప్ చరిత్ర సృష్టించారు.

**ట్రంప్‌కిస్తే గెలుపు బైడెన్‌దే: హేలీ**

తాజా ఫలితాలపై నిక్కీ హేలీ మాట్లాడారు. 'హ్యాంప్‌షైర్‌లో గెల్చిన ట్రంప్‌కు శుభాకాంక్షలు. అయినా ఇంకా డజన్ల కొద్దీ రాష్ట్రాల ప్రైమరీ ఎన్నికలు జరగాల్సే ఉంది. పార్టీ ఓటర్ల అంతిమ తీర్పు వెలువడటానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. ఈ పోటీలో నేను చిట్టచివరిదాకా పోరా డతా. రేస్‌లో కొనసాగుతా. ఈ పోరు మొదలైనప్పుడు రేసులో మొత్తం 14 మంది ఉండేవాళ్లం. నాకు రెండు శాతం ఓట్లు వచ్చేవి. ఇప్పుడు ట్రంప్‌కు గట్టి పోటీ ఇస్తున్నది నేను మాత్రమే' అని హేలీ ప్రసంగించారు. ''ట్రంప్‌కు రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిత్వం దక్కాలని డెమొక్రాట్లు కోరుకుంటున్నారు. ట్రంప్‌ను అయి తే తేలిగ్గా ఓడించవచ్చని వారి ఆశ. నిజంగా ట్రంప్‌కు అభ్యర్థిత్వం దక్కి తే బైడెన్, కమలా హ్యారిస్‌ల విజయం తథ్యం'' అని హేలీ అన్నారు. మరోవైపు, ''ఈ రోజు హేలీకి కాళరాత్రి. అయినా తానే గెల్చినట్లు ప్రసంగాలు దంచేస్తోంది'' అని ట్రంప్ ఎద్దేవా చేశారు. సౌత్ కరోలినాలో డెమొక్రటిక్ పార్టీ ప్రైమరీలో అధ్యక్షుడు బైడెన్ నెగ్గారు.

సాక్షి
కరీంనగర్
గురువారం । 25 । జనవరి । 2024





## క్వింటాల్ పత్తి ధర రూ.6,800

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.6,800 పలికింది.97 వాహనాల్లో 847 క్వింటాళ్ల పత్తిని తెచ్చారు. మోడల్ ధర రూ.6,700, కనిష్ట ధర రూ.6,100 పలికింది.



## జేఈఈ మెయిన్స్ ప్రశాంతం

జిల్లాలోని తిమ్మాపూర్ పరిధిలోని వాగేశ్వరి కళాశాలలో జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. 8లో▸


గరిష్టం/కనిష్టం
30.0/19.0

## వాతావరణం

జిల్లాలో ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలి తీవ్రత ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

# భూ కబ్జాలపై ఉక్కుపాదం

- మొన్న తోటరాములు, నిన్న జంగిలి సాగర్ అరెస్ట్
- బలవంతపు డబ్బుల వసూళ్ల కేసులో అదుపులోకి
- మరో నలుగురు కార్పొరేటర్ల అరెస్టుకు రంగం సిద్ధం
- భూ ఆక్రమణలపై నగరంలో 100 దాటిన ఫిర్యాదులు
- పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు!



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

కరీంనగర్ పేరుకు స్మార్ట్‌సిటీ. ఈ సుందర నగరపాలకసంస్థకు ప్రాతినిధ్యం వహిస్తున్న పలువురు కార్పొరేటర్లపై చాలాకాలంగా భూ కబ్జాలు, బెదిరింపులు, బలవంతపు వసూళ్ల ఫిర్యాదులు ఉన్నాయి. ఆరోపణలు వచ్చినవారిలో చాలామంది సామాన్యులపై దాడులు, బెదిరింపులు దాటి ఏకంగా కట్టుకున్న ఇళ్లను నేలమట్టం చేసిన సంఘటనలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వంలో పోలీసులు భూ మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్నారు. కబ్జాలకు పాల్పడింది ఎవరైనా సరే.. చట్టం ముందు సమానులే అన్న ధోరణితో ముందుకుసాగుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం ప్రజాదర్బార్‌కు కరీంనగర్ భూ బాధితులు బారులు తీరడంతో వారి సమస్యలు పరిష్కరించాలన్న ప్రభుత్వం ఆదేశాలతో పోలీసులు రంగంలోకి దిగారు. వరుసగా కార్పొరేటర్లను అరెస్టు చేస్తుండడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. తమపై ఎన్నిరకాలుగా ఒత్తిళ్లు వస్తున్నా పక్కా ఆధారాలతో అరెస్టు చేయడం, రిమాండ్‌కు తరలించడం, కస్టడీకి తీసుకోవడం చేస్తున్నారు. నిందితులు దేశం విడిచిపోకుండా పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకునే ఆలోచనలో ఉన్నారని తెలిసింది. పోలీసుల దూకుడు చూసి భూ బాధితులు ఫిర్యాదు చేసేందుకు ముందుకొస్తున్నారు. సీపీ అభిషేక్ మహంతి టీంకు కృతజ్ఞతలు చెబుతున్నారు.

**అన్ని విభాగాల సమన్వయం**

నగరంలో కొందరు కార్పొరేటర్లు తమ పరిధిలో ఎక్కడ ఇళ్లు కట్టుకున్నా రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఇవ్వకుంటే బెదిరిస్తున్నారు. అయినా వినకుంటే నిర్మాణంలో ఉన్న ఇండ్లను కూల్చేస్తున్నారు. ఈ విషయమై బాధితుల నుంచి ఫిర్యాదులు పెరిగిపోతుండడంతో కమిషనరేట్ పరిధిలో సీపీ అభిషేక్ మహంతి ఎకనమిక్ అఫెన్స్ వింగ్ (ఈవోడబ్ల్యూ) విభాగాన్ని ఏర్పాటు చేశారు. దీన్నే 'సిట్' అని పిలుస్తున్నారు. ఆర్థిక నేరాల కేసులో కీలకమైన డాక్యుమెంట్లు, సాక్ష్యాలు సేకరిస్తూ దర్యాప్తు అధికారులకు సాయపడుతున్నారు. ఇక టాస్క్‌ఫోర్స్ అధికారులు నిందితులను పట్టుకుంటున్నారు. ఇలా డిపార్ట్‌మెంటులోని అన్ని విభాగాలు ఆర్థిక నేరగాళ్ల భరతం పట్టే పనిలో నిమగ్నమయ్యాయి.

**మొన్న రాములు.. నేడు సాగర్.. రేపు?**

మొన్న సింగరేణిని విశ్రాంత కార్మికుడు రాజిరెడ్డి ఫిర్యాదుతో కార్పొరేటర్ తోటరాములను అరెస్టు చేసిన పోలీసులు, బుధవారం మరో కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను అరెస్టు చేశారు. లింగారెడ్డి అనే ఉపాధ్యాయుడు తమ వద్ద జంగిలి సాగర్ బలవంతంగా రూ.10 లక్షల వసూలు చేశాడని, అందుకు సంబంధించిన ఆధారాలను పోలీసులకు అందించారు. నాలుగురోజులుగా సాగర్ కోసం హైదరాబాద్, కరీంనగర్, రామడుగు మండలంలో విపరీతంగా గాలించారు. పోలీసులు నీడలా వెంటాడటం, అన్ని వైపులా ఒత్తిడి పెరగడంతో బుధవారం తనే స్వయంగా పోలీసుల ఎదుట నిలబడాల్సి వచ్చింది. అదేసమయంలో మరో నలుగురు కార్పొరేటర్లపైనా కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. తాను అడిగినంత ఇవ్వనివారి ఇళ్లను కూలుస్తాడన్న పేరున్న కార్పొరేటర్, భూములు మాయం చేస్తారన్న ముగ్గురు కార్పొరేటర్లు పోలీసుల జాబితాలో ఉన్నారని సమాచారం. బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఇప్పటికే ఆధారాల సేకరణను 'ఎకనమిక్ అఫెన్స్ వింగ్' ముమ్మరం చేసింది.



పోలీసుల అదుపులో కార్పొరేటర్ జంగిలి సాగర్

**ముగిసిన ఇద్దరి కస్టడీ**

కరీంనగర్‌క్రైం: అరెస్టయిన కార్పొరేటర్ తోటరాములు, చీటి రామారావును వన్‌టౌన్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. వారిళ్లలో సోదాలు చేశారు. కీలక దస్త్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కస్టడీ ముగిసిన అనంతరం వారిజైలుకు తరలించారు.

## నాటి రూరల్ పోలీసుల అలసత్వమే!

కరీంనగర్ కమిషనరేట్‌లో రూరల్ పోలీసులపై వచ్చిన విమర్శలు అన్నీ ఇన్నీ కావు. అసలు వారు సరిగా డ్యూటీ చేసి ఉంటే.. ఈ రోజు ఈ పరిస్థితి వచ్చి ఉండేదే కాదని నగరవాసులు బాహాటంగా మండిపడుతున్నారు. ముఖ్యంగా సీఐ ర్యాంకు ఆఫీసర్ల అరాచకాలు ఎంత చెప్పినా తక్కువే. తమ భూములు కబ్జాలు అయ్యాయని ఫిర్యాదు చేసేందుకు వెళితే.. బాధితులనే వేధించిన 'విజ్ఞు'లైన అధికారులకు లెక్కేలేదు. రూ.కోట్ల విలువైన ఇంటిని కొట్టేసేందుకు నిందితులతో కుమ్మక్కై, ఏకంగా నకిలీ (డబుల్) ఎఫ్ఐఆర్‌లు సృష్టించిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఆ అరాచక 'తులా'భారంలోనూ అన్యాయమే గెలవడంతో బాధితుడు ప్రాణభయంతో నగరం విడిచి పారిపోయాడు. ఓ భూవివాదంలో రూరల్ లిమిట్స్‌లో పనిచేసిన మరో ఎస్సై తన టౌన్ 'ఎల్ల'లు దాటి ఏకంగా టూటౌన్ లిమిట్స్‌లోకి ప్రవేశించి అక్రమంగా అరెస్టు చేశాడు. వారిని తన స్టేషన్‌లో గంటలపాటు నిర్బంధించి, బూతుపురాణం చదివాడు. చివరికి రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల జోక్యంతో విడిచిపెట్టాడు. తాను అడిగినంత డబ్బులు ఇవ్వలేదని నిర్మాణంలో ఉన్న మూడు ఇళ్లను కూల్చిన ఘటనలో నిందితుడైన కార్పొరేటర్‌ను అరెస్టు చేయకుండా గత సీపీ సత్యనారాయణపై తీవ్ర ఒత్తిడి వచ్చింది. మనస్తాపానికి గురైన ఆయన బదిలీ చేయించుకుని వెళ్లిపోయారు. ఈ విషయాలన్నీ అప్పటి డీజీపీ కార్యాలయానికి చేరినా చర్యలు తీసుకోకపోవడంతో భూ బకాసురులు మరింత చెలరేగిపోయారు.

## ఎన్ని కుట్రలు చేసినా ప్రభుత్వం స్థిరం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్ కార్పొరేషన్: ఎవరెన్ని కుట్రలు చేసినా తమ ప్రభుత్వం స్థిరంగా ఉంటుందని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. బుధవారం ధర్మపురి వెళ్తున్న క్రమంలో కరీంనగర్‌లో ఆగిన శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. తమ 64 మంది ఎమ్మెల్యేలంతా లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. తాము ఎవరో కూర్చోబెడితే కూర్చోలేదని, ప్రజలు ఎన్నుకొన్న ప్రజా ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. దావోస్ పర్యటనపై బీఆర్ఎస్ నాయకుల విమర్శలు అర్థరహితమన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు ప్రజల శ్రేయస్సు కోసం కొన్ని పాత కార్యక్రమాలు కొనసాగిస్తాయన్నారు. అలాగని రాత్రికి రాత్రి తామే అభివృద్ధి చేశామని చెప్పుకోవడం అవివేకమన్నారు. కరీంనగర్‌లో ఐటీ టవర్ నిర్మించినా, అనుకున్న మేర సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఎందుకు రావడం లేదనేది దానిపై అధ్యయనం చేస్తామన్నారు. హెచ్‌సీఎల్ లాంటి ప్రముఖ కంపెనీలను తీసుకువచ్చి ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకొంటుందన్నారు. మేడిగడ్డ నాణ్యత విషయంలో ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే కాకుండా అందుకు సంబంధించిన నివేదికను కూడా ప్రభుత్వం రూపొందిస్తోందని అన్నారు.

### నేడు జమ్మికుంట కౌన్సిల్ మీటింగ్

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై నేడు అవిశ్వాస సమావేశం జరగనుంది. ఉదయం 10గంటలకు జరగబోయే సమావేశానికి కమిషనర్ బి. శ్రీనివాస్ ఏర్పాట్లు చేశారు.కాగా సమావేశంలో బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా కౌన్సిలర్లు ఓటు వేయకుండా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విప్‌జారీ చేశారు. ఆ పత్రాన్ని బుధవారం కలెక్టర్ పమేలా సత్పతికి అందించారు.

## న్యూస్‌రీల్

### బాలికలు చట్టాల గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్

విద్యానగర్(కరీంనగర్): బాలికలు మన దేశ రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేశ్ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బుధవారం కరీంనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సొసైటీలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాధితులకు న్యాయపరమైన సాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, వసతి గృహ నిర్వాహకులు సరిత పాల్గొన్నారు.

### పర్యావరణపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న శ్రీరంగప్రసాద్

కరీంనగర్‌రూరల్: విద్యార్థి దశలోనే పర్యావరణపై అవగాహన కల్పించినట్లయితే ప్రయోజనం ఉంటుందని శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శ్రీరంగప్రసాద్ అన్నారు. కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణ– పర్యవేక్షణ పద్ధతులపై నిర్వహిస్తున్న కార్యక్రమం ముగింపు వేడుకలకు బుధవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ రక్షణపై జాతీయసదస్సు నిర్వహించి అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. విశిష్టఅతిథిగా హాజరైన ఇన్‌చార్జి ఆర్‌సీవో, డీసీవో కె.శ్రీనివాస్‌రెడ్డి జాతీయ సదస్సు నిర్వహణ అభినందనీయం అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసరు దేవులపల్లి బి.రామాచారి డిస్కవరీ ఆఫ్ న్యూ కాటలైటిక్ రియాక్షన్స్ ఫర్ సస్టేనబుల్ ఫ్యూచర్‌పై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ రాజగోపాల్ సుబ్రహ్మణ్యం ఎన్విరాన్మెంటల్ స్ట్రెస్సెస్, గ్రీన్ కెమిస్ట్రీ, మెటబోలిక్ క్రాస్ టాక్ ఇన్ ప్లాంట్స్, ఆల్గే బాక్టీరియాపై వివరించారు. ఎస్‌యూ ఆచార్యులు జయంతి టెక్నిక్స్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ప్రొటెక్షన్, కేయూ ఆచార్యులు సుజాత మృత్తిక కాంటమినంట్స్, సోర్సస్, ఎఫెక్ట్, అప్రొచెస్ ఫర్ రెమిడియేషన్‌పై వివరించారు. ప్రిన్సిపాల్ జి.సమత, సదస్సు కన్వీనర్ ఎస్.సుష్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గీతారాణి, కో–కన్వీనర్ స్వప్న, స్వాతి, మనీషా పాల్గొన్నారు.

### ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

సాక్షి స్పందన

కరీంనగర్ అర్బన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందనున్నాయి. ఈ నెల 20న 'సాక్షి'లో 'ప్రశంసా ఉన్నట్టా.. లేనట్టా' శీర్షికన కథనం వెలువడిన విషయం విదితమే. ఈ క్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి స్పందించి ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఆయాశాఖల నుంచి ఉత్తమ ఉద్యోగుల జాబితాను పంపాలని ఆదేశించగా బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌కు చేరినట్లు సమాచారం. అటెండర్ నుంచి ఆయా విభాగాల గెజిటెడ్ అధికారుల వరకు విభాగాల వారిగా జాబి తాను అందించగా 200లకు పైగా పేర్లను పంపినట్లు సమాచారం. కలెక్టర్ పరిశీలించి తుది జాబితాను ఖరారు చేయనున్నారు. శుక్రవారం పోలీస్ పరేడ్ మైదానంలో ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

### నేడు 14వ జాతీయ ఓటరు దినోత్సవం

కరీంనగర్ అర్బన్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలనే ఉద్దేశంతో అన్ని దినోత్సవాల మాదిరి ఓటరు దినోత్సవం 2011 జనవరి 25 నుంచి నిర్వహిస్తున్నారు. ఓటు ప్రాముఖ్యత తెలిసేలా జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా, బూత్‌స్థాయిలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించనుండగా ప్రతిఒక్కరు ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించారు. వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, థర్డ్ జెండర్లు, అట్టడుగు వర్గాలకు చెందిన వ్యక్తులను ప్రోత్సహించనుండగా పోలింగ్ బూత్‌లలో నిర్వహించే కార్యక్రమాలలో కొత్త ఓటరుగా నమోదైన వారికి ఎపిక్ కార్డులను అందించడంతో పాటు వారిని సత్కరించనున్నారు.

## బాలిక చదువు.. ఊరికి వెలుగు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు, వివిధశాఖల అధికారులు

- ఆడపిల్లలు సామాజిక మాధ్యమాలకు బానిస కావద్దు
- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్/కరీంనగర్‌అర్బన్: బాలికలను చదివిస్తే ఆ కుటుంబానికే కాదు.. ఆ ఊరే బాగుపడుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. ప్రస్తుతం బాలికలకు విద్యారంగంలో సమాన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సామాజిక మాధ్యమాల ప్రభావానికి గురికావొద్దని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ రక్షణ,విద్యా, వైద్య, క్రీడారంగాల్లో ఆడపిల్లలు ముందంజలో ఉన్నారని తెలిపారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మాట్లాడుతూ ఆ పిల్లలకు ప్రస్తుతం ఎన్నో అవకాశాలు ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి, విద్యార్థులకు బహుమతులు అందించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీఈవో జనార్దన్, డీసీడీవో కృపారాణి, సీడీపీవోలు సబితా, కస్తూరి, డీసీపీవో శాంత, సఖీ లక్ష్మి పాల్గొన్నారు.

**ఇక ఆన్‌లైన్‌లోనే ఇసుక**

ఇక మన ఇసుక వాహనం ద్వారానే ఇసుక రవాణాకు అనుమతులుంటాయని కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి డీఎల్ఎస్‌సీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లేదా ప్రవేటు నిర్మాణాలకు 'మన ఇసుక వాహనం 'ద్వారా మాత్రమే అనుమతులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటీపీ ఆధారంగా ఇసుకను తవ్వడానికి అనుమతి ఇవ్వడం జరుగుతుందని, నిర్దేశించిన క్వారీల ద్వారా మాత్రమే ఇసుకను తీసుకోవాలని సూచించారు. మన ఇసుక వాహనం ద్వారా ఇసుకను తరలించడానికి 2030 వాహనాలు నమోదు చేసుకున్నాయని తెలిపారు. అక్రమ రవాణా జరిపే వాహనాలకు ఆన్‌లైన్ ద్వారా చాలాన్‌లను జనరేట్ చేసేలా చూడాలని సూచించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

**దత్తత చట్టబద్ధంగా తీసుకోవాలి**

దత్తత చట్టబద్ధంగా తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్‌హాల్‌లో శిశుగృహాలో ఉన్న నాలుగు నెలల బాబును మహిళా శిశు సంక్షేమ ద్వారా దత్తత పొందిన తల్లిదండ్రులకు సంబంధింత పత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ చట్ట ప్రకారం దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు.

**ఫిబ్రవరి 12న నులిపురుగుల దినోత్సవం**

కరీంనగర్‌టౌన్: 1నుంచి 19ఏళ్ల పిల్లల్లో నులిపురుగులను నివారించేందుకు ఫిబ్రవరి 12న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు గల 3,47,523 మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను అందించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 924, ప్రైవేట్ జూనియర్ కళాశాలలో 64, అంగన్వాడి కేంద్రాలు 777 మొత్తం 1,765 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డీఎంహెచ్‌వో లలితాదేవి, డీఆర్‌డీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

తిమ్మాపూర్/విద్యానగర్: కరీంనగర్‌లోని ఆర్టీసీ టూ డిపోలో బుధవారం డ్రైవర్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ వన్,టూ డిపోలో ప్రమాద రహిత సర్వీస్ ఉన్న డ్రైవర్లను రీజినల్ మేనేజర్ సుచరిత ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిలుగా ఎంవీఐలు నాగలక్ష్మి, శ్రీనివాసులు హాజరై మాట్లాడుతూ.. రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా డ్రైవర్స్‌డే నిర్వహించినట్లు తెలిపారు. డ్రైవర్లకు రోడ్డు భద్రత నియామాలపై సూచనలు చేశారు. విధి నిర్వహణలో మద్యం సేవించొద్దని, సెల్‌ఫోన్ వినియోగించొద్దని తెలిపారు. కరీంనగర్ వన్, టూ డిపోల మేనేజర్లు ఎల్.మల్లేశం, వి.మల్లయ్య, సూపర్ వైజర్లు శ్రీనివాస్, వరహరి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లను సన్మానిస్తున్న అధికారులు

## కుంగిపోవద్దు.. భవిష్యత్ మనదే

- బీజేపీ, కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- కక్ష సాధింపు చర్యలను ఎదుర్కొందాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే గంగుల, వినోద్ పిలుపు



మాట్లాడుతున్న కేటీఆర్



కాంగ్రెస్‌వి 420 హామీలు అంటూ నినదిస్తున్న బీఆర్ఎస్ మహిళా నేతలు

కరీంనగర్: ఓటమితో కుంగిపోవద్దని, రానున్న రోజులు మనవేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టి రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేసేందుకు కార్యకర్తలు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. బుధవారం రేకుర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కరీంనగర్‌పార్లమెంటరీ నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యమ నేత కేసీఆర్ సీఎంగా తెలంగాణను అగ్రగామిగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ప్రజలు సానుభూతితోనే కాంగ్రెస్ పార్టీని గెలిపించారని, అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నైజాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని సూచించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు కొద్ది ఓట్ల తేడాతోనే ఆదరించారని, ఆరు నెలల్లోనే వారి పరిపాలనపై అసహనం నెలకొననున్నదని జోస్యం చెప్పారు. సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్, బీజేపీల వైఖరిని ఎండగట్టి రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు అండగా నిలిచేలా ప్రజానీకాన్ని మలుచుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోషల్ మీడియాను నమ్ముకుని పదవి సాధించారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ పట్టుదలతో పని చేయాలని సూచించారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించే దిశగా సోషల్ మీడియా వారియర్స్ సిద్ధంగా ఉండాలని సూచించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. తన గొంతులో ప్రాణమున్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. సోషల్ మీడియా రాష్ట్ర ప్రతినిధులు క్రిశాంక్, సతీశ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు సోషల్ మీడియాపై స్క్రీనింగ్ ద్వారా శిక్షణ ఇచ్చారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వొడితెల సతీశ్‌బాబు, కోరుకంటి చందర్, పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, మేయర్ వై.సునీల్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, రవీందర్‌సింగ్, పార్టీ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, జీవీ.రామక్రిష్ణారావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- సీపీ అభిషేక్ మహంతి



కరీంనగర్‌క్రైం: పోలీసుస్టేషన్లలో నమోదైన కేసులు త్వరగా పరిష్కరించాలని, పెండింగ్‌కు గల కారణాలు తెలుసుకుని త్వరితగతిన వాటిని దర్యాప్తు జరిపి ముగించాలని సీపీ అభిషేక్ మహంతి సూచించారు. బుధవారం కరీంనగర్‌లోని టౌన్ ఏసీపీ కార్యాలయంలో కరీంనగర్ టౌన్ సబ్ డివిజన్‌స్థాయి నేరసమీక్ష నిర్వహించారు. పోలీసుస్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఎస్‌హెచ్‌వోలు పిటిషన్ మేనేజ్‌మెంట్ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసుల్లో వీలైనంత త్వరగా సాక్ష్యాధారాలు సేకరించి, పూర్తి చేయాలని సూచించారు.క్రిమినల్ కేసులతోపాటు, ఆర్థికనేరాలు, భూ తగాదాలు, భూ ఆక్రమణ,పెండింగ్ వారెంట్ల అమలుతో పాటు వివిధ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఏసీపీలు నరేందర్, విజయ్‌కుమార్, సీఐలు ఇన్స్పెక్టర్లు సరిలాల్, వెంకటేశ్, శ్రీనివాస్, శ్రీలత, ఎస్సైలు పాల్గొన్నారు.

## 28న ఎస్సారార్‌లో బీజేపీ కార్యకర్తల సమ్మేళనం

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాక
- విజయవంతం చేయాలని ఎంపీ బండి సంజయ్ పిలుపు

కరీంనగర్‌టౌన్: ఈనెల 28న ఎస్సారార్ కళాశాల మైదానంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వేలాది మంది కార్యకర్తలతో సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యే ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఒక్కో పోలింగ్ బూత్ నుంచి 20మంది కార్యకర్తలను ఆహ్వానిస్తున్నామని, పార్లమెంట్‌వ్యాప్తంగా వేలాది మంది హాజరు కాబోతున్నారని తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం కరీంనగర్‌లోని అశోక్‌నగర్ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద కరీంనగర్‌టౌన్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. అమిత్ షా రాక సందర్భంగా కార్యకర్తల సమ్మేళనానికి చేయాల్సిన ఏర్పాట్లు, రవాణ, ఇతరత్రా సదుపాయాల కల్పనపై చర్చించారు. అమిత్ షా రాక సందర్భంగా నగరాన్ని కాషాయమయం చేయాలని సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గపరిధిలో 2 వేలకు పైగా పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ఒక్కోబూత్ నుంచి 20 మంది చొప్పున 40వేల మంది క్రియాశీల కార్యకర్తలను ఈ సమ్మేళనానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ 28న నిర్ణీత సమాయానికి సమ్మేళనానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్ కుమార్

### ఐదు నుంచి 'బండి'యాత్ర

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పార్లమెంట్ పరిధిలో ప్రచార యాత్ర చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 5 నుంచి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకోసం త్వరలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించనున్నారు. ఈనెల 28న ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగే పార్లమెంట్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలోనే యాత్రపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో మూడు పర్యాయాలు పాదయాత్ర నిర్వహించి పార్టీకి ఊపు తెచ్చిన విషయం విదితమే. అదే తరహాలో పార్లమెంట్ పరిధిలోనూ ప్రచార యాత్రతో ప్రజల మద్దతు కూడగట్టనున్నట్లు తెలుస్తోంది.

## క్లుప్తంగా

### జాతీయ సెమినార్‌కు ఉపాధ్యాయుడికి ఆహ్వానం


గంగాధర్

జగిత్యాల: నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఢిల్లీవారు ఏటా జనవరి 29 నుంచి 31 వరకు జాతీయస్థాయిలో స్కూల్ లీడర్‌షిప్ సెమినార్ నిర్వహిస్తుంటారు. ఈసారి సెమినార్‌కు కోరుట్లలో ఎంపీపీఎస్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అడ్లగట్ల గంగాధర్‌కు ఆహ్వానం అందింది. సంబంధిత ఉత్తర్వుల కాపీని డీఈవో జగన్మోహన్‌రెడ్డి ఆయనకు అందజేశారు. గంగాధర్ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు గణితంలో మెళకువలు నేర్పించేందుకు కృషి చేస్తున్నారు. సెక్టోరల్ అధికారులు కొక్కుల రాజేశ్, ఏడీ శివకృష్ణ, పీఆర్టీయూ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు ఆయనను బుధవారం అభినందించారు.

### తాళం వేసిన ఇళ్లలో చోరీ


పగులగొట్టిన బీరువా

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని దేశాయిపేట గ్రామంలో తాళం వేసిన రెండిళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఫిరంగి దేవలక్ష్మి బుధవారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి అదే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి, బీరువాను పగులగొట్టి, 4 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే, జక్కుల బాలయ్య కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి, బయటకు వెళ్లగా దొంగలు పడి, రూ.4 వేలు ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

### విద్యుత్ మోటార్లు..

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాల్వకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లలో 5 మంగళవారం రాత్రి చోరీకి గురయ్యారని రైతులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం 9, మల్లివానిపల్లిలో 5 మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. వరి నాట్లు వేసే సమయానికి ఇలా జరగడంతో ఇబ్బంది పడుతున్నామని అన్నారు. పోలీసులు రాత్రివేళ గస్తీ తిరగకపోవడం వల్లే వరుస దొంగతనాలు జరుగుతున్నాయని ఆరోపించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దుండగులను పట్టుకొని, కఠినంగా శిక్షించాలని కోరారు.

### ఆవులను తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం: ఆవులను తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. హెడ్ కానిస్టేబుల్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీనివాస్ బుధవారం తెల్లవారుజామున గస్తీ తిరుగుతున్నారు. ఆ సమయంలో కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌కు చెందిన ఎండీ.ఇమ్రాన్ రాజీవ్‌నగర్‌లోని కబేలా వద్ద నుంచి ఆవులు, దూడలను తరలిస్తూ కనిపించాడు. అతన్ని ఆపి, విచారించగా పశువుల మాంసం విక్రయించడం తన కుల వృత్తి అని తెలిపాడు. దీంతో ఇమ్రాన్‌ను అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.



# అయ్యో బిడ్డలారా.. ఎంత పనాయే!

- సంక్రాంతి వేళ కరెంట్‌షాక్‌తో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో బాధితులు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబసభ్యులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ట్రాన్స్‌కో అధికారులు


సాత్విక్


ప్రశాంత్

కోరుట్ల: ఆ ఇద్దరు చిన్నారులవి నిరుపేద కుటుంబాలు.. రేకుల షెడ్లలో నివాసం ఉంటున్నారు. సంక్రాంతి పండుగపూట విద్యుత్ షాక్ ఆ రెండు కుటుంబాలకు పెద్ద కష్టాన్ని తెచ్చిపెట్టింది. గాలిపటం కోసం వెళ్లిన ఇద్దరు పిల్లలకు విద్యుత్ తీగ తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో పూర్ణం ప్రశాంత్(12) కోరుట్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మెల్లిగా కోలుకుంటున్నాడు. మరో బాలుడు తోకల సాత్విక్(12) ముఖంతోపాటు నలభై శాతం మేర ఒళ్లు కాలిపోయి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

**రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు**

పూర్ణం దుర్గాప్రసాద్, తోకల కిష్టయ్య కల్లూర్ రోడ్ -బీమునిదుబ్బ క్రాస్‌రోడ్డు సమీపంలో తమ కుటుంబాలతో పక్కపక్కనే రేకుల షెడ్లలో అద్దెకు ఉంటున్నారు. దుర్గాప్రసాద్-లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దవాడు ప్రశాంత్. కిష్టయ్య-జయశ్రీ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, సాత్విక్ చిన్నవాడు. పక్కపక్కనే ఉంటుండటంతో ప్రశాంత్, సాత్విక్‌లు స్నేహితులయ్యారు. దుర్గాప్రసాద్ ఇదివరకు పత్తి విక్రయించడం చేసేవాడు. ఆరోగ్యం దెబ్బతినడంతో ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. కిష్టయ్య రెండేళ్ల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అతని భార్య జయశ్రీ బీడీలు చుడుతోంది. ఈ రెండు కుటుంబాలూ రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో ఉన్నాయి. విద్యుదాఘాతం వీరిపై పెనుభారం మోపింది. పిల్లలకు వైద్యం చేయించేందుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

**హైటెన్షన్ వైర్ల కిందే నివాసాలు**

30 ఏళ్ల క్రితం కోరుట్ల-మెట్‌పల్లి రోడ్డు వెంట ఉన్న 11/33 కేవీ నుంచి కోరుట్ల కల్లూర్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కరెంట్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన హైటెన్షన్ వైర్లు తగలడం వల్లే ప్రశాంత్, సాత్విక్ గాయపడ్డారు. మొదట్లో ఇక్కడ జనావాసాలు లేకున్నా ప్రస్తుతం ఈ వైర్ల కింద వందలాది ఇళ్లు నిర్మించుకున్నారు. విద్యుత్ లైన్‌ను మార్చాలని స్థానికులు మొత్తుకుంటున్నా నిధుల లేమి సాకుతో ఎవరూ పట్టించుకోలేదు. విద్యుత్ హైటెన్షన్ వైర్లు తగిలి గతంలోనూ కొంత మంది గాయపడిన సందర్భాలున్నాయి.

**బాధితులకు ట్రాన్స్‌కో పరిహారమేది?**

ఇప్పటివరకు విద్యుత్‌షాక్‌తో చనిపోయిన వారికి తప్ప గాయపడిన వారికి ట్రాన్స్‌కో నుంచి ఎలాంటి ఆర్థికసాయం అందలేదు. అందిస్తే బాధితులకు ఎంతో కొంత ఊరట దక్కుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్యుత్ షాక్‌కు గురైన ఇద్దరు పిల్లల్లో సాత్విక్ చికిత్సకు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో ఇప్పటికే రూ.2.50 లక్షలు ఖర్చయింది. ఇంకా కొన్ని రోజులు అక్కడే ఉండాల్సి ఉంటుంది. ఇక, తమ వద్ద డబ్బుల్లేవని, దాతలు ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కోరుతున్నారు. స్థానికంగా చికిత్స పొందుతున్న ప్రశాంత్‌కు ఇప్పటికే సుమారు రూ.75 వేల వరకు ఖర్చు చేశారు.

**ఎవరూ ఆరా తీయలే..**

నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడితే ప్రజాప్రతినిధులు, ట్రాన్స్‌కో అధికారులు ఎవరూ వారి పరిస్థితి ఎలా ఉందని ఆరా తీయకపోవడం గమనార్హం. ఎన్నికల సమయంలో అనారోగ్యంతో, ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోతే పరామర్శల పేరిట వారి ఇళ్లకు వెళ్లే నాయకులు వీరిని పట్టించుకోకపోవడం విచారకరం. కాంగ్రెస్ కోరుట్ల పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ తనవంతుగా రూ.5 వేల చొప్పున బాధితులకు సాయం అందించారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో నుంచి బాధితులకు పరిహారం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

సాత్విక్‌కు సాయం చేయాలనుకునే దాతలు 98486 30010 ఫోన్ నంబర్‌కు ఫోన్‌పే చేయాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

## తెలంగాణ ఉద్యమంలో గాలన్నది కీలక పాత్ర

- మాజీ మంత్రి కేటీఆర్


మాజీ ఎమ్మెల్యే శోభక్కతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

సైదాపూర్(హుస్నాబాద్): చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభక్క భర్త గాలన్న ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బుధవారం పరామర్శించారు. ఆయన మృతి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గాలన్న తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కేటీఆర్ అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు. గాలన్న కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. హనుమకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, సర్పంచ్ బొడిగె పద్మజ, మాజీ సర్పంచ్ చంద్రయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

## మొదటిరోజు జేఈఈ మెయిన్స్ ప్రశాంతం


పరీక్షా కేంద్రంలో క్యూలైన్‌లో విద్యార్థులు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని వాగేశ్వరి అయాన్ డిజిటల్ సెంటర్‌లో జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు డిజిటల్ సెంటర్‌ను ఎంపిక చేశామని, ఈ నెల 27 నుంచి కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సిటీ కో-ఆర్డినేటర్ లలిత కుమార్ తెలిపారు. కరోనా నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల మధ్య భౌతిక దూరం ఉండేలా చర్యలు తీసుకున్నారు. కేవలం మధ్యాహ్నం షిఫ్టులో 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 422 మంది విద్యార్థులకు గానూ 382 మంది హాజరయ్యారు. విజయ్‌కుమార్, తిరుపతి రెడ్డి అబ్జర్వర్లుగా వ్యవహరించారు. మొదటిరోజు ప్రశాంతంగా ముగిసిందని, ఫిబ్రవరి 1వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. ఎల్‌ఎండీ ఎస్సై చేరాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## చికిత్స పొందుతూ గిరిజన రైతు మృతి

- సోదరుడితో భూ వివాదం కారణంగా ఆత్మహత్యాయత్నం
- న్యాయం చేయాలని కుటుంబసభ్యుల ఆందోళన


నాజం (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సోదరుడే తన భూమిని కాజేయడంతో మనస్తాపానికి గురైన ఓ గిరిజన రైతు క్రిమిసంహారక మందు తాగగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. తమకు న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. వారి వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగుండారం పరిధి పోచమ్మతండాకు చెందిన బానోతు నాజం(42) బతుకుదెరువు కోసం ఆరేళ్లపాటు గల్ఫ్ వెళ్లాడు. అక్కడినుంచి పంపించిన డబ్బులతో ఆయన సోదరుడు గణేశ్ రెండెకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసి, తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ క్రమంలో ఏడాది క్రితం స్వగ్రామం వచ్చిన నాజం ఆ భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని గణేశ్‌ని అడిగాడు. దీనికి అతను నిరాకరించడంతో 8 నెలల క్రితం కుల పెద్దలను ఆశ్రయించాడు. ఈ విషయంలో వారు కూడా న్యాయం చేయలేదు. భూమి ఆయన పేరిట లేకపోవడంతో రైతుబంధు డబ్బులు కూడా రావడం లేదు. తనకు ఇక భూమి దక్కదని మనస్తాపానికి గురై, గత గురువారం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు దవాఖానా ఎదుట ఆందోళనకు దిగారు. భూ వివాదం వల్లే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని, ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య జ్యోతి వేడుకుంది. తమకు న్యాయం చేసేవరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించవద్దని కోరింది. నాజంకు కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పెద్ద మనుషులు జోక్యం చేసుకొని, పరిహారంపై చర్చలు జరుపుతున్నారు.

## రవాణాశాఖ కానిస్టేబుల్స్ అసోసియేషన్ అధ్యక్షురాలి ఎన్నిక


కల్యాణిశ్రీని అభినందిస్తున్న అధికారులు

కోరుట్ల: తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ బాసర జోన్-2 అధ్యక్షురాలిగా జగిత్యాల రవాణా శాఖ కార్యాలయంలో పని చేస్తున్న కె.కల్యాణిశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం డ్రైవింగ్ ట్రాక్‌లో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. జనరల్ సెక్రటరీగా బాపన్న, కోశాధికారిగా ప్రేమ్‌కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రదీప్ తెలిపారు. జగిత్యాల రవాణా శాఖ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. డీటీవో వంశీధర్, ఎంవీఐ రంజిత్ తదితరులున్నారు.

## నువ్వు విత్తన శుద్ధి


విత్తనశుద్ధి చేస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

రుద్రంగి(వేములవాడ): పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం(ఆర్‌ఏడబ్ల్యూఈపీ)లో భాగంగా బుధవారం మానాలలో నువ్వు విత్తన శుద్ధి చేసి, విత్తారు. నువ్వులలో తొలిదశలో ఆశించే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవడానికి విత్తనశుద్ధి ఉపయోగ పడుతుందన్నారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు వేముల అఖిల, మెరుగు సింధూజ, గాలి అమూల్య, చిలుకుల సుష్మప్రియాంక, వ్యవసాయ విస్తరణాధికారి విజయ్, రైతులు పాల నర్సు, గంగు, గణేష్, బానోత్ రాజు, కుర్తిలాల్, అజ్మీర రవీందర్ పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య


మల్లారెడ్డి (ఫైల్)

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని లక్ష్మాజిపల్లికి చెందిన నల్ల మల్లారెడ్డి(37) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డికి రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. కానీ, పెళ్లయిన మూడోరోజే భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతను తన తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల తండ్రి మృతిచెందాడు. దీనికితోడు కొన్ని రోజులుగా మల్లారెడ్డి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది, బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుని తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## పట్టుకున్న వాహనాలకు 30న వేలం


సీపీ రెమారాజేశ్వరి

గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు పట్టుకున్న వాహనాలకు ఈ నెల 30న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీపీ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని ఠాణాల పరిధిలో 81 వాహనాలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బెల్లంపల్లి సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో వేలం నిర్వహిస్తామని, రావాలనుకునేవారు ఆధార్‌కార్డు, ఇతర ఏదైనా కేంద్ర, రాష్ట్ర గుర్తింపు కార్డుతో రావాలని సూచించారు.

## చంపుతామని బెదిరించిన ఇద్దరికి ఏడాది జైలు

ధర్మారం(ధర్మపురి): మండలంలోని చామనపల్లికి చెందిన తాళ్ల దేవరాజును చంపుతామని బెదిరించిన కేసులో తాళ్ల శంకరయ్య, అనిల్‌లకు నందిమేడారం జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి రాణి ఏడాది జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. 2 జూలై 2014న దేవరాజు ఇంట్లోకి చామనపల్లికే చెందిన శంకరయ్య, అనిల్, కనకమ్మ అక్రమంగా ప్రవేశించి, పిండి గిర్ని ధ్వంసం చేశారు. అంతేకాకుండా అతన్ని చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై హరీశ్ వారిపై కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురిలో కనకమ్మ చనిపోయింది. ప్రస్తుత ఎస్సై సత్యనారాయణ, కోర్టు కానిస్టేబుల్ సంతోష్ బుధవారం కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. జడ్జి కేసు పూర్వాపరాలను పరిశీలించి, శంకరయ్య, అనిల్‌లకు శిక్ష విధించారు.

## చీటింగ్ కేసులో ఒకరికి రెండేళ్లు..

సిరిసిల్ల క్రైం: భూమి అమ్ముతానని మోసం చేసిన ఒకరికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణానికి చెందిన ఎల్లగొండ రాజేందర్, సామల పోశెట్టి భూ క్రయవిక్రయాలు చేస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రాంతంలో భూమి ఉందని, విక్రయిస్తామని సిరిసిల్లకు చెందిన తడుక సత్యనారాయణ వద్ద 2010లో రూ.4 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. మిగతా సొమ్ము చెల్లించి, భూమి రిజిస్ట్రేషన్ చేసుకుంటానని ఆయన చెప్పినా వారు స్పందించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా జడ్జి కేసు పూర్వాపరాలను పరిశీలించి, రాజేందర్‌కు జైలుశిక్ష, జరిమానా విధించారు.

## విద్యారణ్యపురిలో అగ్ని ప్రమాదం

కరీంనగర్ క్రైం: నగరంలోని విద్యారణ్యపురిలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఫైర్ అధికారుల వివరాల ప్రకారం.. విద్యారణ్యపురిలోని వెంకటేశ్ ఇంట్లో బుధవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో గ్యాస్ సిలిండర్ లీకైంది. మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి, మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశామని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు.

## గుడిసెవాసులపై కేసులు ఎత్తివేయాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి


మాట్లాడుతున్న లక్ష్మి

కరీంనగర్: గుడిసెవాసులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగిత్యాలలో 5 నెలలుగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరుపేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, అది గతంలో ఎవరికీ కేటాయించింది కాదన్నారు. అరెస్టు చేసిన 9 మందిని తక్షణమే విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో ప్రజాసంఘాలను ఐక్యం చేసి, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణ జ్యోతి మాట్లాడుతూ.. అక్రమ కేసులను ఎత్తివేసి, పేదలకు 200 గజాల ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐద్వా రాష్ట్ర బృందం జైలు వద్దకు వెళ్లి, అరెస్టయిన వారిని పరామర్శించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.ఆశాలత, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, జగిత్యాల జిల్లా కార్యదర్శి వెలిగొండ పద్మ తదితరులున్నారు.

# చిరుత కాదు.. హైనా!


మేడిపల్లి శివారు భూమిలో పాదముద్రలు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని మేడిపల్లి శివారులో చిరుత సంచారంపై అటవీ శాఖ అధికారులు స్పష్టత ఇచ్చారు. మెట్‌పల్లి-అమ్మక్కపేట మధ్య రైల్వే గేటు వద్ద మంగళవారం రాత్రి చిరుత సంచరించినట్లు సోషల్ మీడియాలో ఓ ఫొటో వైరల్ అయిందన్నారు. కానీ, అది చిరుత కాదని తేల్చిచెప్పారు. బుధవారం మేడిపల్లికి చెందిన పీసు భూమయ్య అనే రైతు వ్యవసాయ భూమిలో పాదముద్రలను గుర్తించిన అధికారులు అవి హైనా పాదముద్రల మాదిరిగా ఉన్నాయని పేర్కొన్నారు. సమీప ప్రాంత ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన పత్తి


మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది


దగ్ధమైన సామగ్రిని పరిశీలిస్తున్న ఆర్‌ఐ తిరుపతి

వేములవాడ అర్బన్: వేలాడుతున్న విద్యుత్ తీగలు పత్తి లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌కు తగిలి షార్ట్‌సర్క్యూట్ జరిగింది. వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రెడ్డి కాలనీలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మంటలు చెలరేగడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. వారు ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ఉన్న సుమారు 5 క్వింటాళ్ల పత్తి కాలిపోయినట్లు రైతు ఇన్నారెడ్డి తెలిపారు.

**వెంకటేశ్వరపల్లిలోని ఇంట్లో సామగ్రి..**

జమ్మికుంట(హుజూరాబాద్): షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. బాధితుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన రాముడుగు సంపత్‌రావు బుధవారం తన పొలం వద్దకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి, మంటలు లేచాయి. లోపల వస్తువులన్నీ కాలిపోయాయి. రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. సంఘటన స్థలాన్ని ఆర్‌ఐ తిరుపతి పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సర్పంచ్ కుమార్, గ్రామస్తులు కోరారు.

# గంజాయి చాక్లెట్ల విక్రేత అరెస్టు


చాక్లెట్లు, అన్సారీని చూపుతున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని బండారికుంట ప్రాంతంలో యువకులకు గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న అర్సలన్ అన్సారీని అరెస్టు చేసినట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు. పట్టణంలోని అమర్‌నగర్‌లో గల ఓ వెల్డింగ్ షాపులో పని చేస్తున్న వ్యక్తి గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నాడంటూ అందిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి బుధవారం ఆకస్మికంగా దాడి చేశామన్నారు. అన్సారీని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి 51 చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయికి బానిసైన అతను తక్కువ సమయంలో సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆశతో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం పెద్దపల్లికి పలు జిల్లాల నుంచి వచ్చే యువతకు వాటిని విక్రయించవచ్చన్న ఆలోచనతో కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడని అన్నారు. తదుపరి విచారణ కోసం యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు వివరాలు అందించినట్లు తెలిపారు. పెద్దపల్లికి రైలు మార్గం ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా సులువుగా చేస్తున్నారని పేర్కొన్నారు. గంజాయి విక్రయిస్తూ ఇదివరకు పలువురు పట్టుబడ్డారు. యువతను మత్తుకు బానిసలుగా చేసేందుకు తక్కువ ధరకే కొంచెం గంజాయిని చాక్లెట్లు, సిగరెట్లు, పాకెట్ల రూపంలో అంటగడుతున్నట్లు తెలుస్తోంది. అయితే, విక్రయిస్తున్న వారంతా గంజాయి సేవించే వారేనని పోలీసులు చెబుతుండటం గమనార్హం.

# 'శ్రీ చైతన్య'లో అలరించిన ఫ్రెషర్స్ డే


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని మహాత్మానగర్ శ్రీచైతన్య ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్ డే ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మసీ పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ లక్ష్యాలకు అనుగుణంగా మెళకువలు నేర్చుకొని, గమ్యాన్ని చేరుకోవాలన్నారు. టెక్నాలజీ ద్వారా డ్రగ్స్, ఫార్మసీ రంగానికి సంబంధించిన నైపుణ్యం పెంపొందించుకొని, సమాజానికి అవసరమైన మందులు తయారీలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంనరసింహారెడ్డి, అధ్యాపకులు రాంప్రసాద్, ధనుంజయ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏబీడీ స్టోర్ పేరిట మోసం

- ప్రచారమంటూ సైబర్ నేరగాళ్ల వల
- లబోదిబోమంటున్న బాధితులు

సిరిసిల్లక్రైం: తమ సరుకుల వివరాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో ప్రతీ నెల సొమ్ము ఇస్తామని చెప్పిన ఏబీడీ స్టోర్ నిర్వాహకులు ముందుగా చెప్పిన విధంగా డబ్బులు ఇవ్వడం లేదని జిల్లా కేంద్రంలో బాధితులు లబోదిబోమంటున్నారు. ముందుగా ఏబీడీలో ప్రచారం చేయడానికి కనీసంగా రూ.600 చెల్లించాలని, తర్వాత ఒక సరుకు గురించి మూడు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే నెలకు వేలల్లో జీతం ఇస్తామని ఆన్‌లైన్‌లో కొందరు వలవేశారు. ఇంటిలో ఉంటూ పనిచేయడం సులభమని నమ్మిన పలువురు మహిళలు వారికి తెలిసిన వారిని ఈ ప్రచారంలో భాగస్వాములను చేశారు. గత ఆరు నెలలుగా వేలాది మంది రూ.600 చెల్లించి ఏబీడీ స్టోర్ పేరిట ఉన్న ప్రకటనలను ప్రచారం చేసినట్లు ఓ బాధితుడు తెలిపారు. ముందు 3 నెలలు ఫోన్‌లో పలువురు వ్యక్తులు రోజూ మాట్లాడారని, తర్వాత మాట్లాడడం బంద్‌చేశారని తెలిపారు. ఇప్పుడు కనీసం ఫోన్‌చేస్తే సమాధానం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఇంట్లో ఉండి పనిచేయడం పేరిట లక్షల రూపాయలను గొలుసు వ్యాపార విధానంలో సైబర్ నేరగాళ్లు లాగేసినట్లు తెలిసింది. దీనిపై కొందరు వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

# ఎల్లారెడ్డిపేటలో గీత కార్మికుడికి గాయాలు


గాయపడిన దేవయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు పుల్లక్ దేవయ్య(65) బుధవారం ఈత చెట్టు పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దేవయ్య ఎడమ చేతికి, కాళ్లకు గాయాలయ్యాయి. వెంటనే స్థానిక గౌడసంఘం ప్రతినిధులు స్పందించి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దేవయ్యకు ఎక్సైజ్ అధికారులు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. గౌడ సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్, నాగుల ప్రదీప్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి తదితరులు పరామర్శించారు.

## క్లుప్తంగా

### కరీంనగర్ జిల్లాలో కలపాలని సీఎంకు లేఖ

కరీంనగర్: పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలు, హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం, బెజ్జంకి మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపాలని కోరుతూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ పంపినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

### జాతీయ జెండాకు అడ్డు తొలగించాలి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతీయ జెండాకు అడ్డుగా హోర్డింగ్ ఏర్పాటు చేయడం సరికాదని కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్ సోహన్‌సింగ్ అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ స్వరూపరాణిని కలిసి వినతి పత్రం అందజేశారు. హోర్డింగ్ జాతీయ జెండా కనబడకుండా ఏర్పాటు చేశారని, చర్యలు తీసుకోవాలన్నారు.

### జీవో నెంబర్ 55ను వెనక్కి తీసుకోవాలి

కరీంనగర్‌సిటీ: జయశంకర్ వ్యవసాయ, హార్టికల్చర్ యూనివర్సిటీ 100 ఎకరాల భూమిని ప్రభుత్వం తిరిగి యూనివర్సిటీకి అప్పగించాలని, జీవో నెంబర్ 55ను తక్షణమే ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు తిప్పారాపు శ్రీజ డిమాండ్ చేశారు. బుధవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వ్యవసాయ, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం 100 ఎకరాల భూమిని ప్రభుత్వం హైకోర్టు భవన్ నిర్మాణానికి కేటాయించడం సరికాదన్నారు. జీవో నెంబర్ 55 పేరుతో ప్రభుత్వ విశ్వవిద్యాలయం భూమిని ప్రభుత్వం లాక్కోవడం దుర్మార్గమని, తక్షణం జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పరిశోధన పెంపొందించేలా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉండాలని అన్నారు. తెలంగాణ వ్యవసాయ, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం విద్యార్థులు, ప్రొఫెసర్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గల సమాజంలో వ్యవసాయం రంగంలో నూతన విధానాలకు ప్రపంచానికి ఉపయోగపడేలా పరిశోధనలను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రుతి, చైతన్య, సౌజన్య, గంగ, పూజిత తదితరులు పాల్గొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్‌క్రైం: కట్టరాంపూర్‌లోని ఓ ఇంట్లో పేకాటాడుతున్న ఐదుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.19,610 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

### అంబేడ్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక


సంపత్

కరీంనగర్‌రూరల్: ఇరుకుల్లలో బుధవారం జరిగిన సమావేశంలో అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొత్తూరి సంపత్, ఉపాధ్యక్షుడిగా దిలీప్, ప్రధాన కార్యదర్శిగా గాలిపల్లి బాబు, సంయుక్త కార్యదర్శిగా కల్లెపల్లి ఆంజనేయులు, కోశాధికారిగా కాశిపాక ఉమేశ్ ఎన్నికయ్యారు.

### పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి

విద్యానగర్(కరీంనగర్): పీఆర్‌టీయూ తెలంగాణ కరీంనగర్ జిల్లా శాఖ ముద్రించిన క్యాలెండర్‌ను బుధవారం జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు డీసీఈబీ కార్యాలయంలో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అట్ల శ్రీనివాస్‌రెడ్డి, డీసీఈబీ సెక్రటరీ స్వదేశ్ కుమార్, పీఆర్‌టీయూ కేతిరి తిరుపతిరెడ్డి, జయేందర్‌రెడ్డి, అశ్ఫాక్ హుస్సేన్, కట్ట వేణుగోపాలచారి, గజ్జెల నల్లగొండయ్య, ఒడ్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణంపై చర్య తీసుకోవాలి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని మంగళవాడలో అక్రమ నిర్మాణం చేపడుతున్న వారిపై, అందుకు సహకరిస్తున్న నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులపై చర్య తీసుకోవాలని స్థానికులు బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో తాము పలుమార్లు మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా చర్యలు లేవని కొడూరి సతీష్ తదితరులు పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణం కొనసాగుతోందని, ఇందుకు పట్టణ ప్రణాళిక విభాగంలో దీర్ఘకాలికంగా ఉన్న అధికారులే కారణమని ఆరోపించారు.




## పేరుకుపోతున్న వాహన స్క్రాప్

నగరంలోని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ కార్యాలయం వెనుక భాగం పార్కింగ్ స్థలంలో పాడైన వాహనాలను కొన్నేళ్లుగా ఉంచుతున్నారు. వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కనీసం స్క్రాప్‌కు తరలించినా స్థలం ఖాళీ కావడంతో పాటు కొంత ఆదాయం సమకూరేదని డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

# సమస్యలు పరిష్కరించాలి


రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో లత

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం డీఎల్‌పీవో లత తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ఇళ్ల మ్యుటేషన్ చేయడం లేదని, పంచాయతీ సిబ్బందికి వేతనాలివ్వలేదనే తదితర ఫిర్యాదుల మేరకు డీఎల్‌పీవో విచారణ నిర్వహించారు. ఫిర్యాదుదారుల నుంచి సమస్యలకు సంబంధించిన వివరాలడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లా తదితరులున్నారు.

# రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి


ఆమీర్‌నగర్‌లో రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న స్థానికులు

కరీంనగర్‌కార్పొరేషన్: తవ్వి వదిలేసిన రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని నగరంలోని 47వ డివిజన్ ఆమీర్‌నగర్ వాసులు డిమాండ్ చేశారు. అధ్వానంగా మారిన రోడ్డు వద్ద బుధవారం స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. తమ కాలనీలో సైడ్ డ్రైన్, రోడ్డు నిర్మాణానికి గతంలో పనులు మొదలుపెట్టారని ఈ సందర్భంగా వారు తెలిపారు. సైడ్ డ్రైన్ నిర్మించి, రోడ్డు నిర్మాణమంటూ నెల రోజుల క్రితం ఉన్న రోడ్డును తవ్వి వదిలేశారన్నారు. దీంతో తాము నరకయాతన అనుభవిస్తున్నామని, రాత్రుల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ స్థానిక కార్పొరేటర్ ద్వారా గతంలో నగరపాలక సంస్థ కమిషనర్‌ను కలిసి విన్నవించామన్నారు. అయినా పనుల్లో పురోగతి లేదని, రోడ్డుపై నడవడం కూడా ఇబ్బందిగానే మారిందని అన్నారు. పని చేసే శక్తి లేనప్పుడు కాంట్రాక్టర్ ఎందుకు టెండర్ వేశారని ప్రశ్నించారు. సైడ్ డ్రైన్ నిర్మించి నెల రోజులు కావస్తున్నా వాటర్ క్యూరింగ్ చేయడం లేదన్నారు. పనులను పర్యవేక్షించాల్సిన ఏఈ, డీఈలు పత్తా లేరని వాపోయారు. తక్షణమే మున్సిపల్ కమిషనర్ స్పందించి త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేయాలని, లేకుంటే కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆమీర్‌నగర్ వాసులు షేక్ అయూబ్, ఫిరోజ్, షేక్ అబ్దుల్లా, ఇర్ఫాన్, డాక్టర్ పోచాలు, అబ్దుల్ ఖుద్దూస్, జాఫర్, అహ్మద్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల నిల్వలపై నిఘా

- కొరతకు చెక్ పెట్టేందుకు కొత్త యాప్
- ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏడీఏ

కరీంనగర్‌రూరల్: రైతుల సాగు అవసరాలకు ఎరువుల కొరత లేకుండా, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎరువుల నిల్వలను కచ్చితంగా తెలుసుకునేందుకు ఫైవ్స్(ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం) పేరిట కొత్త యాప్‌ను ప్రవేశపెట్టింది. వ్యవసాయాధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఈ కొత్త యాప్‌లో పూర్తి వివరాలను నమోదు చేయాలని ఆదేశించింది.

**కచ్చితమైన సమాచారం**

కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం 40 ఎరువుల దుకాణాలున్నాయి. కరీంనగర్‌అర్బన్‌లో 20, కరీంనగర్‌రూరల్‌లో 10, కొత్తపల్లి మండలంలో 10 దుకాణాలున్నాయి. ఎరువుల లెక్కలు పక్కగా ఉండేందుకు ప్రభుత్వం ఫైవ్స్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఏవో, ఏడీఏ వారంలో రెండు పర్యాయాల చొప్పున పది ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలి. స్టాక్ రిజిస్టర్‌లో పేర్కొన్న నిల్వలు, క్షేత్రస్థాయిలో ఉన్న ఎరువుల నిల్వలను లెక్కించాల్సి ఉంటుంది. తనిఖీ వివరాలను యాప్‌లో నమోదు చేయాలి. ఫర్టిలైజర్ కంట్రోలర్ ఆర్డర్ ప్రకారం ఎరువుల దుకాణం నిర్వహణ ఉందా లేదా ఈ తనిఖీల ద్వారా తెలుస్తోంది. వ్యాపారుల వద్ద ఎరువుల నిల్వలపై కచ్చితమైన సమాచారం లభిస్తోంది. రైతులకు అవసరమైన ఎరువులను లెక్క ప్రకారం అందించే వీలుంటుంది. బుధవారం కరీంనగర్ మండలం మొగ్దుంపూర్, నగునూరు, చెర్లభూత్కూర్, చేగుర్తి గ్రామాల్లోని ఐదు ఎరువుల దుకాణాలను ఏడీఏ రణధీర్‌రెడ్డి, ఏవో సత్యం తనిఖీ చేశారు. పీవోఎస్ యంత్రాల ద్వారా విక్రయిస్తున్న ఎరువుల వివరాలను పరిశీలించారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసి బస్తాలను లెక్కించారు.


మొగ్దుంపూర్‌లో ఎరువుల బస్తాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ రణధీర్‌రెడ్డి, ఏవో సత్యం

**నిబంధనల ప్రకారం తనిఖీ**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువుల దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. యాప్ అందుబాటులోకి రావడంతో రైతులకు ఎంతో ప్రయోజనముంటుంది. రైతులకవసరమైన ఎరువులను తెప్పించుకునే అవకాశముంది. ఇప్పటివరకు కరీంనగర్ నియోజకవర్గంలో 25 ఎరువుల దుకాణాలను తనిఖీ చేశాం.

\- రణధీర్‌రెడ్డి, ఏడీఏ, కరీంనగర్

# కాంగ్రెస్‌లోనే కార్యకర్తలకు గుర్తింపు

కరీంనగర్‌కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీలోనే కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత గుర్తింపు లభిస్తుందని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ అన్నారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో బుధవారం నగరంలోని ఇందిరాచౌక్‌లో ఎన్‌ఎస్‌యూఐ బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించింది. విద్యార్థి దశ నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, కాంగ్రెస్ సిద్ధాంతాల పట్ల విశ్వాసం కలిగిన పొన్నం ప్రభాకర్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు లభించిందన్నారు. అలాగే ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఉద్యమించిన వెంకట్‌కు పార్టీ ఎమ్మెల్సీని చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, నాయకులు రాంప్రసాద్, పండుగ సాయి, హరీష్, సనత్, దిలీప్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరాచౌక్ వద్ద ఎన్‌ఎస్‌యూఐ సంబరాలు

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


తిరుపతిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

విద్యానగర్(కరీంనగర్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఇంపాక్ట్ డైరెక్టర్ కుతాడి తిరుపతి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం కరీంనగర్‌లోని మైనారిటీ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలికలు నిజమైన భావిభారత నిర్మాతలని, వారు తలుచుకుంటే సాధించలేనిదంటూ ఏదీ లేదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మౌనిక, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



**మామిడి పూత పూసింది కొమ్మా లేకుండా..**

మామిడి చెట్లకు పూత ఈ సీజన్‌లో విరగపూయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు సంవత్సరాలుగా మామిడి చెట్ల పూత అంతంత మాత్రమే కాగా.. దీనికి తోడు అకాల వర్షాలు, వడగండ్ల వానలతో మామిడి పూత, కాయలు చెట్టు నుంచి రాలి తీవ్రంగా నష్టపోయారు. ఈ సంవత్సరం కాలానికి ముందే మామిడి పూత రావడంతో రైతుల సంతోషానికి హద్దే లేకుండా పోయింది.


\- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

## సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

సప్తగిరికాలనీ: స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతుల వారోత్సవాలు పురస్కరించుకొని ప్రజ్ఞాభారతి కరీంనగర్ వారు నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, రామాయణం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మంకమ్మతోట, భగత్‌నగర్ సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అయోధ్య ఫర్ నేషనల్ ఇంటిగ్రేషన్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో 8వతరగతి చదువుతున్న ఎం.సాన్వి, రామాయణం క్విజ్ పోటీలో 9వతరగతి చదువుతున్న అచ్యుత్ మొదటిస్థానంలో బహుమతులు సాధించారు. భారత అంతరిక్ష మిషన్ 2047 అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీలో 9వతరగతి చదువుతున్న జి.మనస్విని మూడోస్థానంలో నిలిచింది. విద్యార్థులను పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5, 6ల్లో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్‌ను బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ బుధవారం తెలంగాణ చౌక్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఆది మల్లేశం, శ్రీనివాస్, నితిన్, నరేందర్, మారుతి, దేవేందర్, వెంకటేశ్, దినేష్, రమేశ్, కార్తీక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సమయం విలువ తెలుసుకోవాలి


మాట్లాడుతున్న మల్లేశం

కరీంనగర్‌సిటీ: శాతవాహన విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ సంకశాల మల్లేశం హాజరై మాట్లాడారు. ఎంబీఏకు కావలసినటువంటి నైపుణ్యాలతో కూడిన విద్యను అభ్యసించాలని, సృజనాత్మకత కలిగి ఉండాలని, ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, సమయం విలువను అర్థం చేసుకొని తమ కెరీర్‌ను తగ్గట్టుగా మలుచుకోవాలని అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంలో మంచి అవకాశాలు ఉంటాయని అన్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, చైర్‌పర్సన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా విద్యనభ్యసించాలని అన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ.. మంచి నడవడికతో కూడిన విద్యను నేర్చుకోవాలని అన్నారు. ఎంబీఏ అధ్యాపకులు డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ టి.కృష్ణకుమార్, ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

## అందె శ్రీనివాస్‌కు ఓయూ డాక్టరేట్

కరీంనగర్‌సిటీ: ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకుడిగా పని చేసున్న అందె శ్రీనివాస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆటోమేటిక్ బ్రెయిన్ స్ట్రోక్ క్లాసిఫికేషన్ అండ్ డిటెక్షన్ యుసింగ్ ఏఐ బేస్డ్ డేటా మైనింగ్ టెక్నిక్స్ అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ జోసెఫ్ పి.మోసిగంటి పర్యవేక్షణలో ఈ పరిశోధన చేసినట్లు తెలిపారు. డాక్టర్ అందె శ్రీనివాస్ పీహెచ్‌డీ పట్టా పొందిన సందర్భంగా తమ గైడ్ ప్రొఫెసర్ డాక్టర్ జోసెఫ్ పి.మోసిగంటి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వెంకటదాస్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, జి.సి.జి.టి.ఎ. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సురేందర్‌రెడ్డి , స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ అడెపు శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, ప్రమోద్‌కుమార్, డాక్టర్ మల్లారెడ్డి, డాక్టర్ ఎస్.వొ.కుమార్, డాక్టర్ టి.మహేశ్, ఎం.ఆంజనేయులు, అధ్యాపకులు అభినందించారు.

# బీఆర్‌ఎస్ అవినీతి పాలన బహిర్గతం చేయాలి

విద్యానగర్(కరీంనగర్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన అవినీతి పాలనలో భాగంగా ఉన్న భవనాలను కూల్చి వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించి వందల కోట్ల అవినీతికి పాల్పడిందని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ ఆరోపించారు. బుధవారం గెస్ట్ హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ.. కరీంనగర్‌లో అన్ని హంగులతో ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహాన్ని కూల్చి దాని స్థానంలో కోట్లు వెచ్చించి నూతనంగా నిర్మించడమే కాకుండా 50 సంవత్సరాలుగా ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌గా ఉన్న పేరును మార్చి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పేరు వచ్చేలా పేరు మార్చడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌గా మార్చడం సబబేనన్నారు. పశువుల ఆసుపత్రి స్థలంలో కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం కట్టడం కూడా సరికాదని అన్నారు. కట్టిన భవనాన్ని పశుసంవర్ధక శాఖకే అప్పగించాలని డిమాండ్ చేశారు. లోయర్ మానేరు రిజర్వాయర్‌కు 15 కిలోమీటర్ల పొడవు కట్టతో ఉందని, ఈ ప్రాంతాన్ని టూరిస్ట్ స్పాట్‌గా మార్చితే ఆదాయం సమకూరుతుందన్నారు. రూ.750కోట్లు వెచ్చించి రివర్ ఫ్రంట్ పేరుతో అనవసర ప్రాజెక్ట్ నిర్మించడం అనాలోచిత చర్య అని విమర్శించారు. బోయినపల్లి చంద్రయ్య, సిగిరి శ్రీధర్, బాపురెడ్డి, సిగిరి వేణు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో ప్రతిభ


చాతుర్యను అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

కరీంనగర్: కరీంనగర్‌లోని సైన్స్ మ్యూజియంలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల(సీబీఎస్‌ఈ) విద్యార్థిని బి.చాతుర్య(8వతరగతి) మిల్లెట్స్ ఫర్ హెల్త్ అనే అంశంపై మొదటి స్థానం కైవసం చేసుకుంది. చాతుర్య, ఇన్‌చార్జి టీచర్ మమతను చైర్మన్ డా.పి.ఫాతిమారెడ్డి అభినందించారు.

## కర్పూరి ఠాకూర్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): భారతరత్న, బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ శత జయంతి సందర్భంగా బుధవారం కరీంనగర్‌లోని తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సింగిరాల వెంకటస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవుదుర్తి విజయ్‌కుమార్, నాయకులు మేకల చంద్రశేఖర్‌యాదవ్, శ్రీరాముల బాలసురేందర్, సదుర్ల మల్లేషం, రాచకొండ విఠలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**ఉప్పు.. @ కిలో 50**



రక్తపోటు, కిడ్నీలో రాళ్లు, కీళ్ల నొప్పులు, మోకాలి నొప్పులు, హార్ట్ సమస్యలు, షుగర్, కొవ్వు తదితర వ్యాధుల నివారణలో దోహదపడే రాక్ సాల్ట్(కల్లుప్పు), బీపీ, గ్యాస్, డైజేషన్, కీళ్ల నొప్పుల నివారణకు వాడే బ్లాక్ సాల్ట్(నల్ల ఉప్పు)ను కొనుగోలు చేసేందుకు కరీంగనర్‌లో జనం ఎగబడ్డారు. హర్యానా నుంచి అక్కడి వ్యాపారులు తీసుకొచ్చి మార్కెట్ ధర కంటే తక్కువకు కిలో రూ.50కి విక్రయించారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

## గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ బ్లీడింగ్‌ను అరికట్టడానికి 'హేమోస్ప్రే'

ఇండియాలో తొలిసారి ఈ సాంకేతిక తను ఉపయోగించిన ఏఐజీ హాస్పిటల్స్



సాక్షి, హైదరాబాద్: గ్యాస్ట్రోఇంటెస్టైనల్ (జీఐ) రక్తస్రావం ఆపడానికి హేమోస్ప్రే టెక్నాలజీని మనం దేశంలో మొట్టమొదటిసారిగా ఏఐజీ హాస్పిటల్స్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు ఉపయోగించారు. ఈ ప్రత్యేకమైన ఎండోస్కోపిక్ స్ప్రే 10 నిమిషాల కంటే తక్కువ వ్యవధిలోనే అంతర్గత రక్తస్రావాన్ని ఆపి, ప్రమాదస్థితి నుంచి కాపాడుతుందని ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి వెల్లడించారు. ఈ సాంకేతికత గురించి ఆయన మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో ఇది చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. హేమోస్టాసిస్ (రక్తస్రావం ఆపే ప్రక్రియ) కోసం ఖనిజ మిశ్రమం పొడితో తయారుచేసిన ఈ హేమోస్ప్రే బాగా పని చేస్తుం దన్నారు. ఈ స్ప్రే జీర్ణాశయం భద్రత, సమర్థతను పెంచడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పారు. అన్నవాహిక, కడుపులోని జీర్ణాశయాంతర పేగుల్లో రక్తస్రావం తీవ్రమైన రక్త నష్టానికి దారితీస్తుందని, ఈ పరిస్థితికి తమ ఆధునిక టెక్నాలజీ చెక్ పెడుతుందని తెలిపారు. హేమోస్ప్రేను మొదటిసారిగా లివర్ సిర్రోసిస్‌తో బాధపడుతున్న 49 ఏళ్ల మహిళా పేషెంట్‌పై డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ మోహన్ రాంచందాని ప్రయోగించారు.

## బీసీ కులాల పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర విభజన తర్వాత తమ కులాలను ఓబీసీ జాబితా నుంచి తప్పించారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ వాయిదా వేసింది. విభజన అనంతరం తెలంగాణకు చెందిన సుమారు 28 వెనకబడిన కులాలు రిజర్వేషన్ల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నాయంటూ దాఖలైన పలు పిటిషన్లు బుధవారం జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. సుప్రీంకోర్టులో రాష్ట్ర న్యాయవాదుల ప్యానెల్ మారిందని, అదేవిధంగా రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని ఈ నేపథ్యంలో మూడు వారాలు గడువు ఇవ్వాలని తెలంగాణ తరఫు న్యాయవాది ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం మూడు వారాలపాటు విచారణ వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

# అంతరాలపై విద్యాయుద్ధం

## పేదరికానికి నాణ్యమైన విద్యే సరైన మందు - ఇండియా టుడే సదస్సులో ఏపీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: 'పేదరిక నిర్మూలన నాణ్యమైన చదువు ద్వారానే సాధ్యమని నేను నమ్ముతాను. అది ప్రతి ఒక్కరి హక్కు కావాలి. పేద పిల్లలు తెలుగు మీడియంకు పరిమితమైతే, సంపన్నుల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నారు. సంపన్నులకు అందే నాణ్యమైన చదువులు పేద పిల్లలకూ అందాలన్నదే మా లక్ష్యం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో జరుగుతున్న ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమంలో బుధవారం సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన ఓ ప్రశ్నకు ఇలా సమాధానం చెప్పారు. పిల్లలు ఓటర్లు కాదు కాబట్టి వారి గురించి ఎవరూ పట్టించుకోరని, ఇది దురదృష్టకరమని అన్నారు. అయితే పిల్లలు మంచి విద్యావంతులైతేనే, వారికి నాణ్యతతో కూడిన విద్యను అందిస్తేనే.. సమాజంలో దారిద్ర్యం పోతుందని నొక్కి చెప్పారు. పది మంది నిరుపేద విద్యార్థులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమెరికాకు పంపించడమే కాకుండా వైట్‌హౌస్‌కు కూడా తీసుకెళ్లడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న విద్యా సంస్కరణలు, పథకాలు చాలా ఆకర్షిస్తున్నాయని ఈ సందర్భంగా రాజ్‌దీప్ అభినందించారు. రాజ్‌దీప్, సీఎం వైఎస్ జగన్ మధ్య జరిగిన సంభాషణ వివరాలు ఇలా ఉన్నాయి.

**రాజ్‌దీప్ సర్దేశాయ్** : విద్యా రంగంలో ఇంత మంచి చేస్తున్నా, ప్రచారానికి ఎందుకు దూరంగా ఉంటారు?

**సీఎం జగన్:** ఇండియా టుడే జర్నలిస్టులు ఇక్కడి స్కూల్స్ సందర్శించి, అభివృద్ధి పనులు స్వయంగా చూడడం ఎంతో ఆనందంగా ఉంది. అందుకు మీకు అభినందనలు. ఇక్కడ మేము ఏయే పనులు చేశామనేది చెప్పుకోవడం కాకుండా, మీరు స్వయంగా చూడడం నాకెంతో సంతోషం కలిగిస్తోంది.

**రాజ్‌దీప్:** సాధారణంగా అన్ని ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలపై ఎక్కువగా వ్యయం చేయవనే విమర్శలు వినిపిస్తుంటాయి. అందుకు భిన్నంగా మీరు ఈ రెండు రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, వాటిని అభివృద్ధి చేసి చూపించాలనుకుంటున్నారా?

**సీఎం జగన్** : పేదరిక నిర్మూలనకు నాణ్యతతో కూడిన విద్య అనేది కీలకమని నేను గట్టిగా నమ్ముతాను. విద్యా హక్కు అనేది ఇంకా నినాదంగా మిగలకూడదు. నాణ్యతతో కూడిన విద్య అనేది హక్కుగా మారాలి. నిరుపేదలు ఒక చదువుకు పరిమితమైతే, సంపన్నుల పిల్లలు వేరే చదువులు చదువుతున్నారు. నిరుపేద పిల్లలు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవడం, అది కూడా కేవలం తెలుగు మీడియంలోనే చదవడం.. మరోవైపు ధనికులైన పిల్లలు ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో చదవడం సరికాదు. నిరుపేదలు, ధనికుల మధ్య కొనసాగుతున్న ఈ వ్యత్యాసం, తేడా తొలగాలి. ధనికుల మాదిరిగా నిరుపేద పిల్లలు కూడా చదవాలి. వారికి ఆ విధంగా విద్యను అందించాలి. ఆ ఆలోచన నుంచి వచ్చినవే ఈ మార్పులు. మా ప్రభుత్వం ఆ దిశలోనే పని చేస్తోంది. నిరుపేద పిల్లలకు కూడా అత్యుత్తమ నాణ్యతతో కూడిన విద్య, ఇంగ్లిష్ మీడియంలో బోధన కొనసాగాలి.

**రాజ్‌దీప్:** ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధన, మూడో తరగతి నుంచే గ్లోబల్ విద్య, టోఫెల్‌లో శిక్షణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే దీనిపై విమర్శలు వినిపిస్తున్నాయి. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు వంటి నేత కూడా దీనిపై విమర్శలు చేస్తున్నారు.

**సీఎం జగన్:** ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లిష్ మీడియంలోకి మారుస్తున్నారని విమర్శలు చేస్తున్న వారందరినీ నేను ఒక్కటే అడుగుతున్నాను. వారి పిల్లలు, వారి మన వళ్లు, మనవరాళ్లు ఏ మీడియంలో చదువుతున్నారు? వారిని తెలుగు మీడియం స్కూళ్లకే పంపిస్తున్నారా? అదే నా సూటి ప్రశ్న. ఇంగ్లిష్ మీడియం వైపు నా చొరవను ప్రశ్నించే ముందు.. ముందుగా నా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

**రాజ్‌దీప్:** నిజంగా ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం మధ్య ఉన్న గ్యాప్‌ను అంత సులభంగా మార్చగలరా? దానివల్ల పిల్లలు ఇబ్బంది పడే పరిస్థితి రాదా? వెంకయ్యనాయుడు లాంటి వారికి ఇదే మీ సమాధానమా?

**సీఎం జగన్:** గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను ఏకపక్షంగా ఇంగ్లిష్ మీడియంలోకి మార్చడం లేదు. ప్రతి ఒక్కటీ ఒక పద్ధతి ప్రకారం, శాస్త్రీయ విధానంలో సాగుతోంది. ఒక సమగ్ర విధానంలో కొనసాగుతోంది. ప్రతి పుస్తకాన్ని బైలింగ్యువల్.. అంటే ఒక పేజీ ఇంగ్లిష్, పక్క పేజీ తెలుగులో ముద్రిస్తున్నాం. ఇంకా బైజూస్ కంటెంట్‌ను కూడా తీసుకొచ్చాం. ప్రభుత్వ పాఠశాలల్లో అనూహ్య మార్పులు చేస్తున్నాం. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఆరో తరగతి నుంచి, ఆపై తరగతుల్లోని ప్రతి క్లాస్‌రూమ్‌లో ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్) ఏర్పాటు చేస్తున్నాం. ఆ మేరకు 62 వేల తరగతులు ఉండగా, ఇప్పటికే 40 వేల తరగతి గదుల్లో ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేశాం. మిగిలిన తరగతి గదుల్లో వచ్చే నెల చివరి నాటికి ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేసే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఆ విధంగా ఒక ప్రణాళికా బద్ధంగా పాఠశాల విద్యా రంగంలో వినూత్న మార్పుల దిశలో పని చేస్తున్నాం. బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలు, 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, టీచర్లలో నైపుణ్యం, సామర్థ్యం పెంపు, బైజూస్ కంటెంట్, తరగతి గదుల్లో ఐఎఫ్‌పీల ఏర్పాటు.. ఇలా వీటన్నింటి వల్ల ప్రాథమిక విద్యా రంగంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇవన్నీ కాకుండా.. పిల్లలు 8వ తరగతిలోకి వచ్చే సరికి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు ఇస్తున్నాం.

# అవినీతి రూ.500 కోట్లు!

## హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్, మెట్రోరైల్ డైరెక్టర్ శివబాలకృష్ణపై ఏసీబీ దాడులు



సోదాలు చేస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: భవన అనుమతులు, టౌన్‌ప్లానింగ్‌లో అడ్డగోలుగా అవినీతికి పాల్పడి, వందల కోట్లు అక్రమంగా కూడబెట్టిన తిమింగలం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కింది. హైదరాబాద్ నగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) మాజీ డైరెక్టర్, ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌ఎంఎల్) డైరెక్టర్‌గా ఉన్న శివబాలకృష్ణ నివాసం, కార్యాలయాలు, ఆయన బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు బుధవారం విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఆయన తన పదవిని, ఓ సీనియర్ ఐఏఎస్ అధికారితో సన్నిహిత పరిచయాన్ని అడ్డుపెట్టుకుని ఏకంగా రూ.500 కోట్ల వరకు అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టుగా అంచనా వేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువే బహిరంగ మార్కెట్లో రూ.వంద కోట్లకుపైగానే ఉంటుందని చెప్తున్నారు. ఇంకా నిర్ధారించి, విలువ తేల్చాల్సిన ఆస్తులు భారీగానే ఉన్నాయని అంటున్నారు. హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో శివబాలకృష్ణ భారీగా అవినీతికి పాల్పడి, అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టుగా ఫిర్యాదులు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

### 17 చోట్ల ఏకకాలంలో సోదాలు

శివ బాలకృష్ణ హెచ్‌ఎండీఏలో భూమార్పిడి వినియోగం, హైరైజ్ భవనాలకు అనుమతులు, కీలకమైన పట్టణ ప్రణాళిక (టౌన్‌ప్లానింగ్)కు సంబంధించిన పోస్టుల్లో పనిచేశారు. ఈ క్రమంలో ఆయన ఉన్నతాధికారుల అండదండలతో కీలక పోస్టుల్లో ఏళ్లతరబడి పాతుకుపోయి భారీగా అక్రమాలకు, అవినీతికి పాల్పడ్డారన్న సమాచారం మేరకు ఏసీబీ దాడులకు దిగింది. అధికారులు బుధవారం ఉదయం హైదరాబాద్ శివార్లలోని పుప్పాలగూడలో ఉన్న శివబాలకృష్ణ ఇల్లు, కార్యాలయాలు, బంధువుల ఇళ్లు కలసి మొత్తం 17 చోట్ల ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఇంట్లో అయితే ఏకంగా 20 మంది అధికారులు అన్ని మూలలా జల్లెడపట్టినట్టు తెలిసింది. ఈ సందర్భంగా భారీగా స్థిర, చరాస్తులను గుర్తించారు. పెద్ద సంఖ్యలో ప్లాట్లు, ఫ్లాట్లు, బినామీల పేరిట పెట్టిన ఇతర స్థిరాస్తుల డాక్యుమెంట్లు, రూ.40 లక్షల నగదు, భారీగా బంగారు, వజ్రాభరణాలు, వెండి, పదిహేను వరకు ఐఫోన్‌లు, పదుల సంఖ్యలో వాచ్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఆయనకు పెద్ద సంఖ్యలో బ్యాంకు లాకర్లు ఉన్నట్టు సమాచారం. వాటిని తెరిస్తే మరింత భారీగా ఆస్తుల బయటపడవచ్చని ఏసీబీ అధికారులు చెప్తున్నారు. గురువారం కూడా సోదాలు జరిపే అవకాశం ఉందని, తనిఖీలు పూర్తయ్యే సరికి ఆస్తుల బహిరంగ మార్కెట్ విలువ రూ.500 కోట్ల వరకు తేలవచ్చని అంటున్నారు.

### సహకరించని కుటుంబ సభ్యులు, బంధువులు

ఏసీబీ అధికారులు సోదాలు చేసిన సమయంలో శివ బాలకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు ఏమాత్రం సహకరించలేదని అధికారులు అంటున్నారు. బినామీ ఆస్తుల పత్రాలకు సంబంధించి ప్రశ్నిస్తే శివ బాలకృష్ణ సమాధానం ఇవ్వనట్టు తెలిసింది. ఆయన కారును కూడా అధికారులు క్షుణ్నంగా తనిఖీ చేశారు. శివబాలకృష్ణ పెద్ద ఎత్తున పెండింగ్ ఫైల్స్‌ను పురపాలక శాఖ ఉన్నతాధికారి అండదండలతో క్లియర్ చేశారని.. పలు నిర్మాణ సంస్థల యజమానుల నుంచి భారీగా సొమ్ము తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. శివ బాలకృష్ణ వ్యవహారశైలితో నష్టపోయిన కొందరు బిల్డర్లు ఏసీబీకి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఆయనపై ఏసీబీ దాడి నేపథ్యంలో కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో ఆందోళన కనిపిస్తోంది.

### బ్యాంకు లాకర్లను తెరవాల్సి ఉంది

ఆదాయానికి మించి ఆస్తులున్నట్టు ఫిర్యాదులు అందడంతో శివబాలకృష్ణపై దాడులు చేపట్టినట్టు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుధీంద్ర బుధవారం సాయంత్రం వెల్లడించారు. ''బాలకృష్ణ 2018–2023 మధ్య హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌గా కొనసాగారు. మొత్తం 17 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నాం. భారీ ఎత్తున అతి విలువైన భూముల పత్రాలు దొరికాయి. అవన్నీ బినామీల పేరిట కొనుగోలు చేశారు. వాటిని పరిశీలిస్తున్నాం. బాలకృష్ణ ఇంట్లో రూ.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. బుధవారం అర్ధరాత్రి వరకు, అవసరమైతే గురువారం కూడా సోదాలు కొనసాగిస్తాం. ఇంకా బ్యాంకు లాకర్లను పరిశీలించాల్సి ఉంది..''అని ఏసీబీ డీజీ తెలిపారు. శివ బాలకృష్ణపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశామని, గురువారం ఏసీబీ కోర్టు ముందు ప్రవేశపెడతామని తెలిపారు.

### ఓ సీనియర్ ఐఏఎస్ భాగస్వామ్యంపై ఆరా!

శివబాలకృష్ణ ఓ సీనియర్ ఐఏఎస్ అధికారితో సన్నిహితంగా మెలిగారని, ఆయన కనుసన్నల్లో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. సదరు ఐఏఎస్ అధికారికి ఈ అవినీతిలో భాగస్వామ్యంపైనా ఆరా తీస్తున్నట్టు చెప్తున్నారు. పురపాలక శాఖలోని అధికారులు సైతం.. సదరు సీనియర్ ఐఏఎస్ అధికారి లక్ష్యంగా దాడులు జరిగాయని చర్చించుకుంటున్నారు. శివబాలకృష్ణ భారీగా ముడుపులు తీసుకోవడమేకాక, కొందరి నుంచి ఆస్తులను రిజిస్టర్ చేయించుకున్నట్టుగా ఏసీబీ అధికారులకు కచ్చితమైన సమాచారం లభించిందని.. ఈ క్రమంలోనే దాడులు జరిగాయని అంటున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌ను కొత్త సర్కారు ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా నియమించాక ఈ కేసుపై ఫోకస్ పెట్టడం గమనార్హం.

## ఇదేమి రాజ్యం..?

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహిస్తోంది. హైకోర్టుకు భూకేటాయింపు జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం వర్సిటీలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద చేపట్టిన ఆందోళనకు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ హాజరయ్యారు. ఆందోళన విషయం తెలిసిన రాజేంద్రనగర్ పోలీసులు అక్కడికి చేరుకుని, నిరసన తెలుపుతున్నవారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఝాన్సీ పోలీసుల నుంచి తప్పించుకుని ముందుకు పరుగెత్తారు. స్కూటీపై వచ్చిన ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు.. ఝాన్సీ జుట్టుపట్టుకుని లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో ఆమె కిందపడిపోయింది. చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు ఝాన్సీతోపాటు 15 మంది ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు.

### కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలంటూ..

ఆందోళన సమయంలో ఝాన్సీని పోలీసులు జుట్టు పట్టి లాగడం, ఆమె కిందపడిపోవడాన్ని అక్కడే ఉన్న కొందరు విద్యార్థులు వీడియో తీశారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న బీజేపీ, ఏబీవీపీ నాయకులు.. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఝాన్సీని పరామర్శించారు. దురుసుగా ప్రవర్తించిన మహిళా కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం డీజీపీని, హైదరాబాద్ సీపీని కలసి దీనిపై వినతిపత్రం అందిస్తామని వెల్లడించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి నేతలపై పోలీసులు దుశ్చర్యలకు పాల్పడడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

# ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్ల పాత్ర కీలకం

- ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్



మాట్లాడుతున్న ఆర్‌ఎం సోలోమన్

ఆదిలాబాద్: ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ బస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన డ్రైవర్స్‌డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బస్టాండ్ ప్రాంగణంలో డ్రైవర్లు, ఆర్టీసీ అధికారులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్‌ఎం మాట్లాడుతూ డ్రైవర్లు సంస్థకు వెన్నెముకలాంటివారన్నారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేర్చడంలో ముఖ్యభూమిక పోషిస్తారన్నారు. ఇంధనాన్ని పొదుపు చేస్తూ పరోక్షంగా సంస్థ ఆదాయాన్ని అర్జించేలా శ్రమిస్తారని కొనియాడారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తూ ప్రమాదాల నివారణకు పాటుపడుతున్నారన్నారు. ఆర్టీసీ డ్రైవర్ల సంక్షేమం కోసం సంస్థ అన్నివిధాలుగా కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు రోజాపూలు అందజేశారు. డ్రైవర్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డిప్యూటీ ఆర్‌ఎం ప్రణీత్, డీఎం కల్పన, ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

## చిరుతపులి కోసం గాలింపు



గాలింపు చేపడుతున్న అధికారులు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో పదిరోజుల క్రితం చిరుతపులి, ఐదురోజుల క్రితం కల్లూర్ వ్యవసాయ పంట పొలాల్లో నాలుగు చిరుతపులి పిల్లల సంచారం కలకలం రేపింది. దీంతో రైతులు పంట పొలాలకు వెళ్లాలంటేనే భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి బుధవారం పెంచికల్‌పాడ్–కల్లూర్ శివారు ప్రాంతాల్లో చిరుతపులి, పిల్లల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఐదు సీసీ కెమెరాలు బిగించారు. అప్పటికీ చిరుత, పిల్లలు చిక్కక పోతే జన్నారం నుంచి ప్రత్యేక బృందాలను తెప్పించి గాలింపు చర్యలు చేపడతామని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఎఫ్ఆర్వో రాథోడ్ రమేశ్, ఎఫ్ఎస్వో శ్రీనివాస్, డీఆర్వో రేష్మ, ఎఫ్‌బీవో స్రవంతి, అనుపమ, మీనా, హరిలత, ముస్తాక్, ఫైజల్ తదితరులున్నారు.

## గురుకులంలో ఏసీబీ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ముధోల్: నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో బుధవారం ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలు ఆరోపణల నేపథ్యంలో వీరు తనిఖీ చేసినట్లు సమాచారం. కళాశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టిక, ఇటీవల కొనుగోలు చేసిన ఫర్నిచర్, సరుకులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. తనిఖీల్లో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐలు సునీల్‌గౌడ్, జాన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ ఎస్పీకి రిమ్స్‌లో చికిత్స



ఎస్పీకి చికిత్స అందిస్తున్న వైద్యుడు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలంకు గొంతునొప్పి ఉండడంతో బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు. ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ, దేవిదాస్, చంద్రశేఖర్ ఎస్పీకి వైద్య పరీక్షలు నిర్వహించారు. చికిత్స నిమిత్తం ఎస్పీ రిమ్స్‌లో 45 నిమిషాల పాటు గడిపారు. సాధారణ వ్యక్తిగా ఆస్పత్రికి వచ్చి వైద్యసేవలు పొందడం పట్ల పలువురు చర్చించుకున్నారు.

### రిమ్స్‌కు ఏడుగురు సీనియర్ రెసిడెంట్లు

ఆదిలాబాద్‌టౌన్: రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)కు ఏడుగురు సీనియర్ రెసిడెంట్లను డీఎంఈ కేటాయించినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. ఏడుగురిలో ఇద్దరు బుధవారం విధుల్లో చేరినట్లు ఆయన పేర్కొన్నారు. అనస్తీషియా, జనరల్ సర్జన్‌కు సంబంధించిన డాక్టర్లు విధుల్లో చేరారని, మిగితా వారు గురువారం విధుల్లో చేరనున్నట్లు తెలిపారు.

## కొనసాగుతున్న మెస్రం వంశీయుల పాదయాత్ర



లేండిఝరిలో భోజనం చేస్తున్న వంశీయులు

జైనూర్(ఆసిఫాబాద్): ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా పూజలకు గంగాజలం కోసం బయలుదేరిన మెస్రం వంశీయుల పాదయాత్ర కొనసాగుతోంది. నార్నూర్ మండలం మీదుగా బుధవారం జైనూర్ మండలం లేండిఝరికు చేరుకుంది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నుంచి ఈ నెల 21న పాదయాత్ర ప్రారంభమైంది. బుధవారం రాత్రి గౌరి గ్రామంలో మెస్రం వంశీయులు బస చేసి గురువారం సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల మీదుగా హస్తినమడుగుకు చేరుకోనున్నారు. కార్యక్రమంలో మెస్రం వంశీయుల ప్రధాన పూజారి(కటోడ) మెస్రం కోసు, కోత్వాల్ మెస్రం తిరుపతి, దాదారావు, ఎంపీపీ కుమ్ర తిరుమల, గ్రామ పటేల్ మెస్రం బాదిరావు, భీంరావు, పాలక్‌రావు, తానాజీ, జంగు, రూప్‌దేవ్, అంబాజీరావు, కాశీరాం, దౌలత్‌రావు ఉన్నారు.

## విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం.. బాత్రూంలో స్తంభం



ఆదిలాబాద్ పట్టణంలోని దివ్యాంగుల కాలనీకి చెందిన మహావీర్ సింగ్ ప్లాట్‌లో విద్యుత్ స్తంభానికి సపోర్ట్ స్తంభం ఏర్పాటు చేశారు. ఇంటిని నిర్మించుకునే సమయంలో సపోర్టు స్తంభాన్ని తొలగించాలని సదరు వ్యక్తి పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. కానీ పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో స్తంభాన్ని అలాగే ఉంచి ఇంటిని నిర్మించుకున్నాడు. ఆ స్తంభం బాత్రూంలో ఉండాల్సి రావడంతో షాక్ కొడుతుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

# ధర్మపురి టెంపుల్ సిటీకి సహకరిస్తాం

- మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ
- నృసింహుని దేవస్థానంలో ప్రేమిక వరద పరిపాలన సభ



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు శ్రీధర్‌బాబు, సురేఖ, ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలో సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలోని శేషప్ప కళావేదిక వద్ద ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రేమిక వరద పరిపాలన సభ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చివరి ఘట్టమైన మహా పూర్ణాహుతిని బుధవారం ఘనంగా జరిపారు. మంత్రులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విప్ లక్ష్మణ్‌కుమార్ ధర్మపురిలో నెలకొన్న పలు సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ధర్మపురిని టెంపుల్ సిటీగా మార్చాలని, సంస్కృతాంధ్ర కళాశాలలో అధ్యాపకులు సంఖ్య పెంచాలని, వేద పాఠశాల, శాశ్వత మంచినీటి కోసం వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ .. ధర్మపురిలో దేవస్థానంలో విప్ లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం నిర్వహించిన వేద పారాయణం, హోమంలో తమను భాగస్వాములను చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ఇక్కడి సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ధర్మపురి లక్ష్మీనృసింహుడు తమ ఇంటి దైవమని, టెంపుల్ సిటీగా మార్చడానికి సహకరిస్తామన్నారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ.. దైవ కార్యక్రమాలను సమయానుకూలంగా నిర్వహించాలని, ఎంత పెద్దవారైనా ఎదురుచూడాల్సిన అవసరం లేదన్నారు. ఈ మహాపూర్ణాహుతి కార్యక్రమానికి కేవలం భక్తులుగా మాత్రమే వచ్చామని తెలిపారు. ధర్మపురిలో భక్తుల సంఖ్యను పెంచేందుకు ఆలయ చరిత్రపై డాక్యుమెంటరీ తీసి, ప్రసారం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా దేవాలయ స్థలం ఇరుకుగా ఉన్నందున విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని, వేద పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



చొప్పదండిలో మంత్రి శ్రీధర్‌బాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే సత్యం

### 'తెలుగు భాషా సాహిత్యాలు' ఆవిష్కరణ

ధర్మపురికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గొల్లపెల్లి గణేశ్ రచించిన అంతర్జాలంలో తెలుగు భాషా సాహిత్యాలు అనే పుస్తకాన్ని మంత్రులు ఆవిష్కరించారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఉపయోగపడేలా ఇంటర్నెట్‌లోని వెబ్‌సైట్లు, బ్లాగులు, సామాజిక మాధ్యమాల్లో తెలుగు భాషా సాహిత్య అభివృద్ధిని పుస్తక రూపంలో తీసుకురావడంపై రచయితను అభినందించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రెనవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, దేవస్థానం ఈవో శ్రీనివాస్, ధర్మపురి పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామి, వేద పండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ నేతలది రాక్షసానందం

చొప్పదండి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల నుంచే బీఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేస్తూ రాక్షసానందం పొందుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. ధర్మపురి నియోజకవర్గ పర్యటనకు వెళ్తున్న ఆయనకు చొప్పదండిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నెల రోజులుగా ప్రభుత్వం జనరంజక పాలన అందిస్తుంటే పదేళ్లు అధికారంలో ఉండి, హామీల అమలులో విఫలమైన బీఆర్‌ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ముద్దం తిరుపతిగౌడ్, ఉప్పుల అంజనీప్రసాద్, మునిగాల చందు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆదాయం రూ.1.46 కోట్లు



వేములవాడ: రాజన్నకు ఏడు రోజుల్లో హుండీల ద్వారా రూ.1.46 కోట్ల ఆదాయంతోపాటు బంగారం 54 గ్రాములు, వెండి 9 కిలోలు సమకూరినట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఓపెన్ స్లాబ్‌లో కట్టుదిట్టమైన భద్రత నడుమ బుధవారం హుండీల లెక్కింపు చేపట్టారు. సమ్మక్క జాతర సమీపిస్తుండటంతో భక్తులు అధిక సంఖ్యలో వేములవాడకు తరలివస్తున్నారు. కార్యక్రమంలో ఏఈవోలు నవీన్, శ్రీనివాస్, జయకుమారి, భ్రమరాంబికా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూస్‌మేకర్




జార్ఖండ్‌లో తన పదమూడేళ్ల కుమార్తెపై ముగ్గురు కుర్రాళ్లు దారుణంగా లైంగిక దాడి చేశారు. ఆమెను చంపడానికి చూశారు. ఆ అమ్మాయి కుంగిపోయింది. కాని తనకు జరిగిన అన్యాయంపై పోరాడాలనుకుంది. నిరుపేద గ్రామీణ తండ్రి అందుకు సిద్ధమయ్యాడు. ఊరు ఊరంతా వారికి వ్యతిరేకమైనా ఆ తండ్రీ కూతుళ్లు న్యాయం కోసం పోరాడారు. 'బాధితులు పోరాడాల్సిందే'ననే పిలుపునిస్తూ ఈ ఉదంతాన్ని 'టు కిల్ ఏ టైగర్' పేరుతో డాక్యుమెంటరీగా తీసింది నిషా పహూజా. 2024 సంవత్సరానికి ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది 'టు కిల్ ఏ టైగర్'.

'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీలో ఓ దృశ్యం

# ఆస్కార్ బరిలో న్యాయ పోరాటం

'ఈసారి ఇటువైపు వస్తే నిన్ను చంపినా చంపుతాం' అని నిషా పహూజాతో జార్ఖండ్‌లోని ఆ గ్రామస్తులు అన్నారు. ఆరేళ్ల క్రితం జార్ఖండ్‌లోని ఒక గ్రామంలో 13 ఏళ్ల అమ్మాయిపై ముగ్గురు యువకులు లైంగిక దాడి చేశారు. దారుణంగా కొట్టారు. ఆ ఘటన తర్వాత అమ్మాయి, అమ్మాయి తండ్రి న్యాయ పోరాటానికి సంకల్పించారు. అక్కడి నుంచి ఆ గ్రామవాసులు తండ్రీ కూతుళ్లపై ఎలాంటి వొత్తిడి తెచ్చారు, అయినా సరే న్యాయం కోసం ఆ తండ్రీకూతుళ్లు ఎలా నిలబడ్డారు అని తెలిపే సంక్షిప్త చిత్రమే నిషా పహూజా దర్శకత్వం వహించిన 'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీ. గత సంవత్సరం మన దేశం నుంచి 'ది ఎలిఫెంట్ విష్పరర్స్' డాక్యుమెంటరీ ఆస్కార్ పొందింది. రేపు మార్చి 10, 2024న జరగనున్న ఆస్కార్ వేడుకలో 'టు కిల్ ఏ టైగర్' కూడా గెలిస్తే అది చాలా పెద్ద విశేషమే అవుతుంది.



నిషా పహూజా

### బాధితులు పోరాడాల్సిందే

'భారతదేశంలో ప్రతి 20 నిమిషాలకు ఒక రేప్ నమోదు అవుతోంది. నమోదు కానివి ఎన్ని ఉన్నాయో లెక్క తెలియదు. నేరం నమోదు అయ్యాక కూడా కేవలం 30 శాతం కేసుల్లోనే నిందితులకు శిక్షలు పడుతున్నాయి. లైంగిక దాడులను ఎదుర్కొన్నవారు న్యాయం కోసం పోరాడినప్పుడే పెత్తందారీ స్వభావ ప్రతిఫలాలైన లైంగిక దాడులు తగ్గుతాయి' అంటుంది నిషా పహూజా. ఛత్తీస్‌గఢ్‌లోని 13 ఏళ్ల అమ్మాయి (ఇప్పుడు 19 సంవత్సరాలు) న్యాయ పోరాటాన్ని నిషా 2022లో డాక్యుమెంటరీగా తీసింది. అత్యాచార ఘటన జరిగిందని గ్రామస్తులు అంగీకరించినా తమ ఊరి కుర్రాళ్లపై కేసు నడవడం ఇష్టపడటం లేదు. అంతేకాదు ఇలా తమ ఊరు పరువు బజారున పడటం కూడా ఇష్టపడటం లేదు. దాంతో డాక్యుమెంటరీ యూనిట్‌ని బెదిరించారు. బాలికపై జరిగిన అత్యాచారాన్ని 'అదో ఆకతాయి చర్య' అని కొందరు అంటే 'ఆ ముగ్గురిలో ఎవరో ఒక కుర్రాణ్ణి అమ్మాయి పెళ్లి చేసుకుంటే సరి' అని మరికొందరు భావిస్తున్నారు. కాని బాధితురాలు మాత్రం 'చితికిపోయిన నా కలలను ఎవరు తిరిగి తెచ్చిస్తారు' అని ప్రశ్నిస్తోంది.

### స్త్రీ సమస్యలే ఆమె ఇతివృత్తాలు

55 ఏళ్ల నిషా పహూజా తన నాలుగేళ్ల వయసులో ఢిల్లీ నుంచి కెనడా వలస వెళ్లింది. అక్కడే యూనివర్సిటీ ఆఫ్ టొరంటోలో ఆంగ్ల సాహిత్యం చదివింది. సీబీసీ (కెనడియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్)లో రీసెర్చర్‌గా పని చేసి జాన్ వాకర్, అలీ కజిమి వంటి కెనడియన్ ఫిల్మ్ మేకర్స్ వద్ద డాక్యుమెంటరీ నిర్మాణ మెళకువలు గ్రహించింది. ఆపై తనే సొంతంగా డాక్యుమెంటరీలు తీయడం మొదలు పెట్టింది. భారతదేశంతో సంబంధాలు తెంచుకోకుండా తరచూ వచ్చి వెళ్లే నిషా ఇక్కడి స్త్రీల సమస్యలకే ఎక్కువ డాక్యుమెంటరీ రూపం ఇచ్చింది. 2002లో 'బాలీవుడ్ బౌండ్' పేరిట డాక్యుమెంటరీ తీసింది. నలుగురు భారతీయ కెనడియన్ వ్యక్తులు ముంబై మహానగరానికి వచ్చి బాలీవుడ్‌లో తమ అదృష్టాన్ని ఎలా పరీక్షించుకున్నారనేది అందులో మూలాంశం. 2012లో నిషా తీసిన 'ది వరల్డ్ బిఫోర్ హర్' డాక్యుమెంటరీ అంతర్జాతీయ ఖ్యాతి పొందింది. మిస్ ఇండియా కావాలని కలలు కనే భారతీయ యువతుల సంఘర్షణాయుతమైన తతంగాన్ని చూపుతూ ఈ చిత్రం తెరకెక్కింది. ప్రతిష్ఠాత్మక ఎమ్మీ పురస్కారాల్లో 'ఔట్‌స్టాండింగ్ కవరేజ్ ఆఫ్ ఎ కరెంట్ న్యూస్ స్టోరీ' విభాగంలో పురస్కారం అందుకుంది. 2022లో నిషా తీసిన డాక్యుమెంటరీయే 'టు కిల్ ఎ టైగర్'. 90 నిమిషాల ఈ డాక్యుమెంటరీ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. టొరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో కెనడా టాప్–10 చిత్రంగా నిలిచింది. అనంతరం వివిధ వేదికలపై 19 పురస్కారాలు కైవసం చేసుకుంది. ఆస్కార్ గెలుచుకుంటే అదో విశిష్ట పురస్కారం అవుతుంది.

రెనీ జాయ్ ఢిల్లీలో కార్పొరేట్ అడ్వకేట్. రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్‌లాండ్‌కు వైస్‌ప్రెసిడెంట్. జీవితం నేర్పిన పాఠాలతో అలేఖ్ ఫౌండేషన్ పేరుతో పేద మహిళలు, పిల్లలకు ఉచితంగా వృత్తి విద్యాకోర్సులు నేర్పించి, వారి కాళ్లపై వారు నిలబడేలా సహాయం చేస్తోంది. అవసరమైనప్పుడు వారి కోసం న్యాయపోరాటాలు చేస్తుంది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రచారం చేస్తోంది. ఈ ప్రయాణంలో ఏదీ సవ్యంగా లేదని, ఒడిదొడుకులతో నడిచిన తన జీవితాన్ని, తిరిగి దిద్దుకున్న విధానాన్ని పరిచయం చేస్తోంది.

# జీవితాన్ని దిద్దుకుంది... పేదల పక్షాన నిలిచింది



రెనీ జాయ్

"మా తాతగారు ఆర్మీ ఉద్యోగి. దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసి, చివరకు ఢిల్లీలో స్థిరపడ్డారు. మా అమ్మనాన్నలకు నేను ఒక్కదాన్నే సంతానం. నా చిన్నతనంలో మా అమ్మనాన్నలు విడివిడిగా ఉండేవారు. దీంతో నాన్న నుంచి ఎలాంటి సపోర్ట్, సాయం లభించలేదు. మా అమ్మనాన్నలు అంటే అమ్మమ్మ తాతయ్యలే. దీంతో కుటుంబం అసంపూర్తిగా ఉందని ఎప్పుడూ భావించలేదు. మా అమ్మనాన్నలు విడి విడిగా ఉన్న విషయం ఎవరికీ తెలియలేదు. ఆ రోజుల్లో విడాకులు తీసుకోవడం అనేది సమాజం దృష్ట్యా మంచిది కాదు అనే అభిప్రాయం ఉండేది. అందుకే వాళ్లు చాలా ఏళ్ల విడాకులు తీసుకోలేదు. నేను కాలేజీకి వెళ్లిన తర్వాత వారు చట్టబద్ధంగా విడిపోయారు. సమాజం ఇలా ఆలోచించడం వల్ల ఆ సమయంలో నా తల్లిదండ్రులు విడిపోయారని ఎవరికీ చెప్పుకోలేకపోయాను. ఎందుకంటే ఈ విషయం తెలిస్తే వెంటనే నా పట్ల వారి దృక్పథం మారిపోతుందనే భయం ఉండేది.

### చిన్న వయసులోనే..

నా తల్లిదండ్రులు విడిపోవడానికి గల కారణాలన్నీ చూసిన తర్వాత, ఆడపిల్లలు తమ కాళ్లపై తాము నిలబడాలని నాకు చాలా చిన్న వయసులోనే అర్థమైంది. మా అమ్మమ్మ ఎప్పుడూ 'ఎంత సంపాదించినా, ఏ పని చేసినా ఫర్వాలేదు. కానీ, నీ కాళ్ల మీద నువ్వు నిలబడటమే ముఖ్యం' అనేది. కుటుంబంలో ఏ సమస్య వచ్చినా దానిని నివారించే ఉపాయాలను కనుక్కోమనేది. అలాంటి వాతావరణంలో పెరగడం వల్ల పెద్దయ్యాక మహిళల హక్కుల కోసం పోరాడాలని అనుకునేదాన్ని. చదువు తర్వాత బ్యాంకింగ్ రంగంలో సేల్స్ అండ్ మార్కెటింగ్ టీమ్‌లో చేరి, నా కెరీర్‌ను ప్రారంభించాను.

### నష్టం తెచ్చిన కష్టాలు..

మా అమ్మ జాతీయ బ్యాంకులో పనిచేసేది. ఆ ఉద్యోగంలో ఒత్తిడి ఎక్కువ కాబట్టి బ్యాంకులో చేరవద్దని ఎప్పుడూ చెబుతుండేది. కానీ, మార్కెటింగ్ రంగంలో ఏదైనా చేయాలనుకున్నాను కాబట్టి బ్యాంకులో అవకాశం రాగానే వదలలేదు. ప్రతి పనినీ నేర్చుకున్నాను. పదకొండేళ్ల పాటు బ్యాంకులో పనిచేశాను. అక్కడ పనితీరుతో అతి పిన్నవయసులో బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి పొందాను. ఒకానొక సమయంలో ఉద్యోగంపై విసుగు అనిపించి స్టాక్ మార్కెట్‌లో కన్సల్టింగ్ పనిని ప్రారంభించాను. స్టాక్ మార్కెట్ క్రాష్ అయ్యి, తీవ్ర నష్టం చవిచూశాను. వ్యాపార భాగస్వాములు మోసం చేశారు. ఉద్యోగం మానేసిన ఏడాదిన్నర కాలం చాలా దారుణంగా గడిచింది. తిరిగి తక్కువ జీతం, ఎక్కువ పనిగంటలు చేసేలా బ్యాంక్ ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. అయితే, బ్యాంకింగ్ అనుభవాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సీనియర్ల సలహాతో 'లా' చదివాను. అప్పటికి నా కూతురికి నాలుగేళ్లు. ఓ వైపు ఉద్యోగం, మరో వైపు చదువు, ఇంటి పని.. అంత తేలికయ్యేది కాదు.



మహిళలకు సహాయం చేస్తున్న రెనీ

స్త్రీల పనికి సమాజంలో అంత త్వరగా అంగీకారం లభించదు. ఎందుకంటే స్త్రీ సామర్థ్యాల పట్ల ప్రజల వైపు ఎప్పుడూ చిన్నచూపే ఉంటుంది. అటువంటి పరిస్థితుల్లో క్లయింట్స్‌ను ఒప్పించడానికి, వారిలో విశ్వాసం కలిగించడానికి నేను రెండు రెట్లు ఎక్కువ కష్టపడాల్సి వచ్చింది. నా దృక్పథాన్ని, పని విధానాన్ని మార్చుకున్నాను. నన్ను నేను ఉత్సాహపరచుకుంటూనే ఉన్నాను. మెల్లగా నా గమ్యం వైపు కదిలి ఈ రోజు ఈ స్థితికి చేరుకున్నాను.

### అభిప్రాయ భేదాలు తలెత్తినా..

నా భర్తకు నాకు మధ్య అనేక విషయాల్లో అభిప్రాయ భేదాలు తలెత్తడంతో మేమిద్దరం విడిపోవాలనుకున్నాం. భార్యాభర్తలుగా కాకుండా స్నేహితులుగా మారడం ద్వారా మా సంబంధాన్ని మరింత మెరుగ్గా కొనసాగించవచ్చని భావించాను. నా కూతురికి మంచి పెంపకాన్ని అందించడానికి అన్ని ముఖ్యమైన నిర్ణయాలు కలిసి తీసుకుంటాం. కానీ, మేం విడిగానే ఉంటాం. మా కుటుంబంలో 'లా' చదివినవారు ఎవరూ లేరు. నేను చాలా కేసుల్లో మహిళల తరపున నిలబడి న్యాయం చేశాను. ఈ రంగంలో లీగల్ అడ్వైజర్‌గా నాదైన ముద్ర వేయగలిగాను. 2015లో అలేఖ్ ఫౌండేషన్‌ను ప్రారంభించి మహిళల జీవితాలను మెరుగుపరిచే పనిని చేపట్టాను. లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తాను. ఫౌండేషన్ ద్వారా బాలికా విద్య, వృత్తి విద్యలలో నైపుణ్యాలకు సంబంధించిన కోర్సులు ఇవ్వడంలో కృషి చేస్తున్నారు. రొమ్ము క్యాన్సర్, పీరియడ్స్, శానిటేషన్ వంటి ఆరోగ్య సమస్యలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నాను.

### పర్యావరణ పరిరక్షణ..

నిరుపేద బాలికల చదువుకు బాధ్యత తీసుకున్నాను. ఇటీవల నాగాలాండ్‌లో సౌండ్ ఇంజనీరింగ్ లో శిక్షణ ఇవ్వడానికి ఒక కాలేజీతో టై అప్ అయ్యాం. దీనికి అయ్యే ఖర్చులను ఫౌండేషన్ భరిస్తుంది. పర్యావరణానికి మేలు కలిగేలా అవగాహన, ప్రచారం నిర్వహిస్తున్నాను. వాతావరణ మార్పుల నుండి చెట్లను రక్షించడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించడం, పేపర్‌లెస్ జీవనశైలిని ప్రోత్సహించడం చేస్తుంటాను" అని తన ప్రస్థానాన్ని వివరించింది రెనీ.

కిచెన్‌టిప్స్



- మండే స్వభావమున్న ఏ వస్తువులనూ స్టవ్‌కు దగ్గరగా ఉంచకూడదు. వంట చేసేహడావిడిలో కిచెన్ నాప్‌కిన్‌ను స్టవ్ దగ్గరే వదిలేయడం జరుగుతుంటుంది. అలాగే ఇంట్లో అన్ని కిటికీలకు, వాకిళ్లకూ కర్టెన్లు వేయాలన్న సరదా కూడా ప్రమాదాలకు హేతువవుతుంది. స్టవ్ వెలిగేటప్పుడు గాలికి కిటికీ కర్టెన్ పైకి లేచి అంటుకునే ప్రమాదంఉంది. అందుకే స్టవ్‌కు కనీసం మూడు లేదా నాలుగు అడుగుల దూరం వరకు త్వరగా మండడానికి అవకాశమున్న వాటిని ఉంచకూడదు.
- బాణలి, పెనం వంటి వాటిని వంట పూర్తయిన తర్వాత స్టవ్ మీద నుంచి తీసేసి వేడి తగ్గే వరకు కిచెన్ ప్లాట్‌ఫాం మీద ఒక పక్కగా పెడుతుంటాం. చిన్న పిల్లలున్న ఇంట్లో ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. కనిపించీ కనిపించకుండా ఉన్న ప్రతిదానినీ ముట్టుకుని, దగ్గరకు లాక్కుని చూడాలన్న తపన పిల్లలలో ఎక్కువగా ఉంటుంది.

గ్రీన్ ఫ్యూచర్

ఒక మంచి పని చేసినప్పుడు అభినందించే వారే కాదు అనుసరించే వారు కూడా ఉంటారు. సోషల్ మీడియాలో పాపులర్ అయిన కామ్నా గౌతమ్ విషయంలోనూ ఇలాగే జరిగింది. 'పర్యావరణహిత మార్గం వైపు ప్రయాణం మన ఇంటి నుంచే మొదలు కావాలి' అంటుంది కామ్నా గౌతమ్...

# ప్రతి ఇంటి నుంచి పచ్చటి అడుగు


కామ్నా గౌతమ్



'పర్యావరణ సంరక్షణకు మన వంతుగా ఉడతాభక్తిగా చేయడానికి ఎంతో ఉంది. అందుకు మన ఇంటి నుంచే శ్రీకారం చుట్టాలి' అంటుంది కామ్నా గౌతమ్. తన ఇన్‌స్పైరింగ్ మాటలతో సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందిన కామ్నా న్యూట్రీషనిస్ట్. వేస్ట్ మేనేజ్‌మెంట్ టెక్నిక్‌లు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం... మొదలైన వాటి గురించి విస్తృతంగా ప్రచారం చేస్తోంది కామ్నా గౌతమ్.

బేబీ–వియరింగ్, బ్రెస్ట్‌ఫీడింగ్‌లాంటి అంశాలకు సంబంధించి ఉపయోగకరమైన సమాచారం అందించడంతో కామ్నా సోషల్ మీడియా జర్నీ మొదలైంది.

'నేను ఒక బిడ్డకు తల్లిని. బిడ్డ భవిష్యత్ బాగుండాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. అందుకే బిడ్డల బంగారుభవిష్యత్ కోసం పర్యావరణహిత మార్గాన్ని ఎంచుకున్నాను' అంటుంది కామ్న.

పర్యావరణ హిత మార్గంలో తన ఇంటి నుంచే తొలి అడుగు వేసింది. ఇంట్లో ప్లాస్టిక్ వస్తువులు కనిపించకుండా చేసింది. కుటుంబ సభ్యులను ఒప్పించింది. 'మన ఇంట్లో ప్లాస్టిక్ బాటిల్స్‌ను ఎందుకు ఉపయోగించడం లేదో తెలుసా?' అని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పింది.

'నేను ఇలా చేస్తున్నప్పుడు ఇతరులు కూడా చేయవచ్చు కదా. వారిలో ఎందుకు స్పందన కనిపించడం లేదు?' అంటూ బాధ పడేది కామ్నా. అయితే ఆ తరువాత మాత్రం ఒక్కరొక్కరుగా ఆమెను అనుసరించడం ప్రారంభించారు. ఇంటిని ఎన్విరాన్‌మెంట్–ఫ్రెండ్లీగా తీర్చిదిద్దడం మొదలు పెట్టారు.

ప్లాస్టిక్ బ్యాగులు కనిపించకుండా ఉండాలంటే ప్రతి ఇంట్లో క్లాత్‌బ్యాగులు ఉండాలి, డిస్పోజబుల్ వాటర్ బాటిల్ కాదు మీదైన సొంత వాటర్ బాటిల్ ఉండాలి, ట్రెండ్‌లను అనుసరిస్తూ పర్యావరణానికి హాని కలిగించే వస్త్రాలు లేదా వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వకూడదు, ఇంట్లోని వ్యర్థాలను తడి, పొడి విభాగాలుగా వేరు చేయండి...ఇలాంటి విషయాలెన్నో చుట్టుపక్కల వారికి చెబుతున్నప్పుడు మొదట్లో వారి స్పందన ఎలా ఉండేదో తెలియదుగానీ ఆ తరువాత మాత్రం మార్పు కనిపించింది.

పురస్కారం

# బంగారంలాంటి బిడ్డ



హెత్వి ఖిమ్సూరియా

గుజరాత్‌లోని వదోదరకు చెందిన హెత్వి ఖిమ్సూరియా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పీఎం నేషనల్ చైల్డ్ అవార్డ్ (ప్రధాన్‌మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్-పీఎంఆర్‌బీపి) అందుకుంది. వివిధ రంగాలలో పిల్లలు సాధించిన అద్భుత విజయాలకు గుర్తింపుగా ఇచ్చే పురస్కారం ఇది. పదమూడు సంవత్సరాల హెత్వి సెరిబ్రల్ పాల్సీని అధిగమించి పెయింటింగ్, పజిల్ సాల్వింగ్‌లో అసాధారణ ప్రతిభ చూపుతోంది. తనకు వచ్చే పెన్షన్‌ను దివ్యాంగుల సంక్షేమ నిధికి ఇస్తోంది. తన ఆర్ట్‌పై యూట్యూబ్ చానల్ నడుపుతోంది....

వడోదరలోని 8–గ్రేడ్ స్టూడెంట్ హెత్వి ఖిమ్సూరియాకు పురస్కారాలు కొత్త కాదు. ప్రశంసలు కొత్తకాదు. గత సంవత్సరం ఫ్రీహ్యాండ్ పెయింటింగ్, క్రాఫ్ట్, పజిల్ సాల్వింగ్‌లో చూపుతున్న ప్రతిభకు 'గుజరాత్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించింది. 'వరల్డ్స్ ఫస్ట్ సీపీ గర్ల్ విత్ ఎక్స్‌ట్రార్డినరీ స్కిల్స్' టైటిల్ సాధించింది. వంద ఎడ్యుకేషనల్ పజిల్స్ సాల్వ్ చేసిన ఫస్ట్ సీపీ గర్ల్‌గా ఆమెను 'ది లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' గుర్తించింది.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు సాధించిన హెత్వి గీసిన చిత్రాలు యాభై ఆర్ట్ గ్యాలరీలలో ప్రదర్శితమయ్యాయి. చిత్రకళలపై పిల్లల్లో ఆసక్తి కలిగించడానికి 'స్పెషల్ చైల్డ్ ఎడ్యుకేషన్ యాక్టివిటీ–హెత్వి ఖిమ్సూరియా' అనే యూట్యూబ్ చానల్ ప్రారంభించింది.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రధాన్‌మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ (పీఎంఆర్‌బీపి) అందుకుంటున్న హెత్వి ఖిమ్సూరియా

హెత్వి విజయాల వెనుక ఆమె తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉంది.

కూతురు ప్రస్తావన వచ్చినప్పుడు 'అయ్యో! మీ అమ్మాయి' అంటూ ఎంతోమంది సానుభూతి చూపే సమయాల్లో 'బాధ పడాల్సిన అవసరం ఏముంది. మా అమ్మాయి బంగారం. భవిష్యత్‌లో ఎంత పేరు తెచ్చుకుంటుందో చూడండి' అనేవారు. ఆ మాట అక్షరాలా నిజమైంది.

చిన్నప్పటి నుంచి బిడ్డను కంటికి రెప్పలా చూసుకుంటున్నారు.

హెత్విని చూసుకోవడానికి ఆమె తల్లి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసింది. రంగులు, పజిల్స్‌తో బేసిక్స్ ప్రారంభించారు. రంగులు, పజిల్స్ అంటే హెత్విలో ఇష్టం ఏర్పడేలా చేశారు. బొమ్మలు వేస్తున్నప్పుడు, పజిల్స్ పరిష్కరిస్తున్నప్పుడు ఆ అమ్మాయి కళ్లలో శక్తి కనిపిస్తుంది. ఆ శక్తితో ఏదైనా సాధించవచ్చు అనే నమ్మకాన్ని తల్లిదండ్రులలో నింపింది.

హెత్వి మోములో ఎప్పుడూ చెరగని చిరునవ్వు కనిపిస్తుంది. ఆ చిరునవ్వే ఈ చిన్నారి బలం.

హెత్వి ఖిమ్సూరియా మర్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

బ్యూటిప్స్

# ముత్యంలా మెరవాలంటే...

ఇంట్లో రోజూ వాడే వాటితోనే చేసుకోగలిగిన ట్రీట్‌మెంట్‌లు. ఇక్కడ ఇచ్చినవన్నీ ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేని హెర్బల్ ఫేస్ ప్యాక్‌లు.



- చందనం ముఖం మీద ఉన్న నల్లటి మచ్చలను తొలగించడంతో పాటు మొటిమలు, యాక్నేతో పాటు వేడితో చర్మం పొంగినప్పుడు వచ్చిన ఎర్రటి మచ్చలను కూడా తొలగిస్తుంది. చందనంలో పన్నీరు కలిపి ప్యాక్ వేస్తుంటే మంచి ఫలితాన్నిస్తుంది. ఎండకాలంలో ఈ ప్యాక్ వేస్తుంటే శరీరానికి చల్లదనాన్నిస్తుంది.
- బొప్పాయి చెక్కు, అరటి తొక్కలు కూడా సౌందర్య సాధనాలే. వీటిని లోపలి వైపు (గుజ్జు ఉండే వైపు) చర్మానికి అంటేలా రుద్ది పది నిమిషాల తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేస్తుంటే క్రమంగా ముఖం స్వచ్ఛంగా ముత్యంలా మెరుస్తుంది.
- ఒక టేబుల్ స్పూన్ తేనెలో ఒక టీ స్పూన్ పాల పొడి కాని తాజా పాలు కాని కలిపి ముఖానికి అప్లయ్ చేసి ఐదు నిమిషాల సేపు మర్దన చేయాలి. ఇలా క్రమం తప్పకుండా ప్రతిరోజూ చేస్తుంటే రెండు వారాలకు ఇనుమడించిన చర్మ కాంతి స్పష్టంగా కనిపిస్తుంది.
- చర్మాన్ని నునుపుగా కాంతివంతంగా చేయడంలో కమలా, బత్తాయిపండ్లు బాగా పని చేస్తాయి. ఈ రెండింటిలో ఏదో ఒక రసాన్ని ఒక టేబుల్ స్పూన్ తీసుకుని ముఖానికి రాసి ఐదు నిమిషాల సేపు మర్దన చేయాలి. ఇవి ముఖాన్ని క్లియర్‌గా చేయడంతోపాటు స్కిన్ టోనర్‌గా కూడా పనిచేస్తాయి.



## తెలుగు టైటాన్స్ జట్టుకు 14వ పరాజయం

ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టుకు 14వ పరాజయం ఎదురైంది. గచ్చిబౌలి స్టేడియంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పవన్ సెహ్రావత్ కెప్టెన్సీలోని తెలుగు టైటాన్స్ 29-54తో తమిళ్ తలైవాస్ చేతిలో ఓడిపోయింది. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 35-32తో హరియాణా స్టీలర్స్‌పై గెలిచింది. బుధవారంతో హైదరాబాద్ అంచె పోటీలు ముగిశాయి. గురువారం విశ్రాంతి దినం. శుక్రవారం పట్నాలో జరిగే మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో పట్నా పైరేట్స్; గుజరాత్ జెయింట్స్‌తో యు ముంబా తలపడతాయి.



## తొలి రౌండ్‌లోనే శ్రీకాంత్ ఓటమి

ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ హెచ్ఎస్ ప్రణయ్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే ఇంటి దారి పట్టగా... లక్ష్య సేన్, ప్రియాన్షు, కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. జకార్తాలో బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో శ్రీకాంత్ 21-19, 14-21, 11-21తో లీ జి జియా (మలేసియా) చేతిలో... ప్రణయ్ 18-21, 21-19, 10-21తో లో కీన్ యె (సింగపూర్) చేతిలో ఓడిపోయారు.

# భారత్‌ను ఇంగ్లండ్ ఆపతరమా!

- నేటి నుంచి హైదరాబాద్‌లో తొలి టెస్టు
- సొంతగడ్డపై పటిష్టంగా టీమిండియా
- 'బజ్‌బాల్'తో పోటీకి ఇంగ్లండ్ సిద్ధం
- ఉదయం గం.9:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలలో ప్రత్యక్ష ప్రసారం

సొంతగడ్డపై భారత జట్టు 2012లో చివరిసారిగా, అదీ ఇంగ్లండ్ చేతిలో ఓడింది... అయితే ఆ తర్వాత ఏ ఒక్క టీమ్ కూడా మన జట్టుతో తలపడి పైచేయి సాధించలేకపోయింది. ఇంకా చెప్పాలంటే టీమిండియా వరుసగా 16 సిరీస్‌లలో విజయం సాధించగా ఇందులో 7 క్లీన్‌స్వీప్‌లు ఉన్నాయి. రెండుసార్లు ఆస్ట్రేలియా మాత్రమే సిరీస్‌ను 'డ్రా' చేసేందుకు కాస్త చేరువగా రాగలిగింది. నాటినుంచి ఇక్కడ ఆడిన 44 టెస్టుల్లో భారత్ మూడింటిలో మాత్రమే ఓడిందంటే మన బలం, బలగం ఏమిటో అర్థమవుతుంది.

ఇంగ్లండ్ కూడా ఇక్కడ ఆడిన గత రెండు టెస్టు సిరీస్‌లలో భారత్ చేతిలో 0–4, 1–3తో చిత్తుగా ఓడింది... ఇలాంటి స్థితిలో భారత జట్టు మరోసారి ప్రత్యర్థిని పడగొట్టేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల మన మేనేజ్‌మెంట్ వ్యాఖ్యలు చూస్తే పూర్తి స్థాయిలో స్పిన్ పిచ్‌లే తయారు కావడం ఖాయం. మరోవైపు గత కొంతకాలంగా దూకుడైన ఆటతో 'బజ్‌బాల్' అంటూ సిద్ధమైన ఇంగ్లండ్ ఏమాత్రం పోటీనిస్తుందనేది చూడాలి. ఈ నేపథ్యంలో ఐదు టెస్టుల భారీ సిరీస్‌కు రంగం సిద్ధమైంది.

> గత దశాబ్దకాలంలో మా జట్టుకు ఇక్కడ అద్భుతమైన రికార్డు ఉన్నది వాస్తవమే అయినా అది ఈ సిరీస్ విజయానికి పనికి రాదు. పరిస్థితులకు తగినట్లుగా అత్యుత్తమ క్రికెట్ ఆడాల్సిందే. ఆఖరిసారిగా ఇంగ్లండే మమ్మల్ని ఇక్కడ ఓడించింది. మేం అజేయులం ఏమీ కాదు. అలాంటి భ్రమలేవీ లేవు. కాబట్టి ఏమాత్రం ఉదాసీనత కనబర్చినా ఓటమి ఎదురవుతుంది. ఎదుటివారి బలబలాలకంటే మన జట్టు వ్యూహం గురించి స్పష్టత ఉండాలి. దానిని అమలు చేయాలి కూడా. ఇలాంటి పరిస్థితుల్లో మేమందరం ఆడాం కాబట్టి ఎలా ఆడాలో సొంత ప్రణాళికలు కూడా రూపొందించుకోవాలి. టెస్టుల్లో ఒత్తిడిని అధిగమించడమే పెద్ద సవాల్. బరిలోకి దిగి పూర్తి సత్తాను ప్రదర్శించాలి. ఎప్పటికీ సీనియర్లపైనే ఆధారపడలేం కదా. కొత్త కుర్రాళ్లకు కూడా అవకాశం ఇవ్వాలి. లేదంటే వారు ఎప్పుడు ఆడతారు. అందుకే పటిదార్‌ను ఎంచుకున్నాం.
> –రోహిత్ శర్మ, భారత కెప్టెన్




సాక్షి, హైదరాబాద్: భారత గడ్డపై మరో పెద్ద జట్టుతో టెస్టు సిరీస్‌కు సమయం ఆసన్నమైంది. నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. ఇందులో భాగంగా గురువారం నుంచి ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో తొలి టెస్టులో ఇరు జట్లు తలపడతాయి. బలాబలాలు, రికార్డుపరంగా చూస్తే అన్ని విధాలా రోహిత్ శర్మ జట్టుదే పైచేయిగా కనిపిస్తుండగా... గత కొంతకాలంగా మార్పులతో కనిపిస్తూ వచ్చిన ఇంగ్లండ్‌ను పూర్తిగా తక్కువ చేయలేం. ఏ జట్టు గెలిచినా సిరీస్‌లో శుభారంభం చేస్తే ఆపై దాని ప్రభావం కనిపించడం ఖాయం.

### కోహ్లి లేకుండా...

భారత్‌కు సంబంధించి తుది జట్టు విషయంలో ఎలాంటి సందిగ్ధత లేదు. దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో ఆడిన టీమ్ నుంచి సహజంగానే స్వదేశంలో మార్పులు ఖాయం. బౌలింగ్ విభాగంలో ఇద్దరు పేసర్ల స్థానాల్లో ఇద్దరు స్పిన్నర్లు వస్తున్నారు. సీనియర్ ఆటగాడు అశ్విన్ బరిలోకి దిగడం ఖాయం. అశ్విన్–జడేజాల స్పిన్ జోడీ చెలరేగితే ఇంగ్లండ్ ఏమాత్రం నిలబడగలదనేది ఆసక్తికరం. గత దశాబ్దకాలంలో వీరిద్దరు సొంతగడ్డపై ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. మూడో స్పిన్నర్‌గా అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ మధ్య పోటీ ఉంది. కెప్టెన్ రోహిత్ కూడా దీనిపై స్పష్టత ఇవ్వకపోయినా బ్యాటింగ్‌ను దృష్టిలో పెట్టుకునే అక్షర్‌కే ప్రాధాన్యత ఉంది. ఇద్దరు పేసర్లు బుమ్రా, సిరాజ్ కొత్త బంతిని పంచుకుంటారు. కెరీర్‌లో 23 టెస్టులు ఆడిన సిరాజ్‌కు తన సొంత మైదానంలో ఇదే తొలి టెస్టు కావడం విశేషం. ఆరంభంలో వీరిద్దరు ప్రభావం చూపించగలరు. స్టార్ బ్యాటర్ కోహ్లి ఈ మ్యాచ్‌కు దూరం కావడం అభిమానులను నిరాశపర్చేదే. అయితే అతను లేకపోవడం వల్ల బ్యాటింగ్‌లో ఎంపిక సమస్య లేకుండా పోయింది. నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్, ఐదో స్థానంలో కేఎల్ రాహుల్ ఆడతారు. శుబ్‌మన్ గిల్ టెస్టుల్లో ఇంకా మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. కోహ్లి స్థానంలో స్పెషలిస్ట్ వికెట్ కీపర్‌గా ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ (కేఎస్) భరత్ జట్టులోకి వస్తాడు. రజత్ పటిదార్‌ను ఎంపిక చేసినా... తుది జట్టులో చోటు కష్టమే. మన బ్యాటర్లు భారీ స్కోరు అందిస్తే ఇంగ్లండ్ పని పట్టడం బౌలర్లకు పెద్ద కష్టం కాకపోవచ్చు.

### పిచ్, వాతావరణం

ఉప్పల్ పిచ్ పొడిగా కనిపిస్తోంది. మరో మాటకు తావు లేకుండా స్పిన్‌కు అనుకూలించడం ఖాయం. అయితే అది ఎంత తొందరగా మొదలవుతుందనేదే ఆసక్తికరం. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌కే మొగ్గు చూపుతుంది.

### తుది జట్లు

**భారత్ (అంచనా):** రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, కేఎల్ రాహుల్, జడేజా, భరత్, అశ్విన్, అక్షర్ పటేల్, బుమ్రా, సిరాజ్.
**ఇంగ్లండ్:** స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, వుడ్, రేహన్, హార్లీ, లీచ్.

### ముగ్గురు స్పిన్నర్లతో...

మ్యాచ్‌కు ముందు రోజే ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. స్పిన్ పిచ్‌ను దృష్టిలో ఉంచుకొని ముగ్గురు స్పిన్నర్లకు అవకాశమిచ్చి ఒకే ఒక పేసర్‌తో బరిలోకి దిగుతోంది. నాణ్యమైన స్పిన్నర్లు కాకపోయినా... అందుబాటులో ఉన్నవారి నుంచే ఎంచుకోక తప్పలేదు. 35 టెస్టుల అనుభవం ఉన్న లెఫ్టార్మ్ స్పిన్నర్ లీచ్ కొంత వరకు ప్రభావం చూపించవచ్చు. కానీ లెగ్‌స్పిన్నర్ రేహన్ ఒకే ఒక టెస్టు ఆడగా, మరో లెఫ్టార్మ్ స్పిన్నర్ టామ్ హార్లీకి ఇదే తొలి టెస్టు కానుంది.

**4** ఉప్పల్ స్టేడియంలో భారత జట్టు 5 టెస్టులు ఆడింది. న్యూజిలాండ్‌తో 2010లో జరిగిన తొలి టెస్టు 'డ్రా'గా ముగియగా... తర్వాతి నాలుగు మ్యాచ్‌లలో వరుసగా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, వెస్టిండీస్‌లపై భారీ విజయాలు సాధించింది.

అదనంగా జో రూట్ ఆఫ్ స్పిన్ కూడా వేయగలడు. ఇంగ్లండ్ స్పిన్నర్లు మన బ్యాటింగ్‌ను ఏమాత్రం నిలువరించగలరనేది సందేహమే అయినా... స్పిన్‌తో కనీసం ప్రయత్నమైనా చేసేందుకు ఆ జట్టు సిద్ధమైంది. సీనియర్ అండర్సన్‌ను కాకుండా మార్క్ వుడ్ రూపంలో ఏకైక ఫాస్ట్ బౌలర్‌గా ఎంచుకుంది. బ్యాటింగ్‌లో రూట్, బెయిర్‌స్టోలపై ప్రధానంగా ఆ జట్టు ఆధారపడుతోంది. ఓలీ పోప్ కూడా మెరుగైన బ్యాటరే అయినా... క్రాలీ, డకెట్ ఎలాంటి ఆరంభం ఇస్తారో చూడాలి. స్టోక్స్ బ్యాటింగ్‌లో ధాటిని ప్రదర్శించాలని జట్టు కోరుకుంటోంది. ముఖ్యంగా కోచ్ బ్రెండన్ మెకల్లమ్ ఆధ్వర్యంలో 'బజ్‌బాల్' అంటూ దూకుడైన తరహా శైలితోనే టీమ్ సఫలమైంది. అయితే పూర్తి భిన్నమైన భారత పిచ్‌లపై అలాంటి మంత్రం ఎలా పని చేస్తుందో చూడాలి. ఈ జోరులో జట్టు కుప్పకూలిపోయే ప్రమాదమూ ఉంది.

## షోయబ్ బషీర్‌కు వీసా మంజూరు



లండన్: భారత వీసా లభించకపోవడంతో తొలి టెస్టుకు దూరమైన ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్‌కు ఊరట లభించింది. వీసా లేకపోవడంతో అతను జట్టుతో పాటు భారత్‌కు ప్రయాణించకుండా యూఏఈ నుంచి ఇంగ్లండ్‌కు వెనక్కి వెళ్లిపోయాడు. అయితే ఇప్పుడు బషీర్‌కు వీసా మంజూరైందని గురువారం ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ప్రకటించింది. 'బషీర్ తన వీసా అందుకున్నాడు. ఈ వారాంతంలో భారత్‌కు వచ్చి అతను జట్టుతో కలుస్తాడు. సమస్య పరిష్కారం కావడంతో సంతోషంగా ఉంది' అని ఈసీబీ వెల్లడించింది. ఇంగ్లండ్‌లో పుట్టినా... పాకిస్తాన్ మూలాలు ఉన్న కారణంగానే బషీర్ వీసాను భారత ప్రభుత్వం ఆలస్యం చేసిందని గత రెండు రోజులుగా విమర్శలు వచ్చాయి. ఇంగ్లండ్ ప్రభుత్వ అధికారి కూడా ఒకరు దీనిపై అసంతృప్తి వ్యక్తం చేయగా... ఇప్పుడు అంతా సుఖాంతమైంది. 20 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ బషీర్ ఇప్పటి వరకు ఒక్క టెస్టు కూడా ఆడలేదు.



## భళా బోపన్న...

- 43 ఏళ్ల వయసులో వరల్డ్ నంబర్‌వన్
- ఈ ఘనత సాధించనున్న అతిపెద్ద వయస్కుడిగా రికార్డు

మెల్‌బోర్న్: తన కెరీర్ చరమాంకంలో భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న ఉన్నత శిఖరానికి చేరుకున్నాడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో బోపన్న నంబర్‌వన్ ర్యాంక్ సొంతం చేసుకోవడం ఖరారైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ జంట 6–4, 7–6 (7/5)తో మాక్సిమో గొంజాలెజ్–ఆండ్రెస్ మొల్టెని (అర్జెంటీనా) జోడీపై గెలిచింది. దాంతో ఈనెల 29న విడుదలయ్యే ఏటీపీ తాజా ర్యాంకింగ్స్‌లో బోపన్న, ఎబ్డెన్ వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్ జోడీగా అవతరిస్తుంది. ఈ క్రమంలో టెన్నిస్ చరిత్రలోనే నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలవనున్న అతిపెద్ద వయస్కుడిగా రోహన్ బోపన్న (43 ఏళ్ల 330 రోజులు) రికార్డు నెలకొల్పనున్నాడు. పురుషుల డబుల్స్‌లో ప్రస్తుతం ఈ రికార్డు అమెరికా దిగ్గజం మైక్ బ్రయాన్ (41 ఏళ్ల 76 రోజులు; 2019లో) పేరిట ఉంది. మహిళల డబుల్స్‌లో అమెరికా ప్లేయర్ లీసా రేమండ్ (39 ఏళ్లు; 2012లో)... పురుషుల సింగిల్స్‌లో స్విట్జర్లాండ్ దిగ్గజం ఫెడరర్ (36 ఏళ్ల 320 రోజులు; 2018లో)... మహిళల సింగిల్స్‌లో అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్ (35 ఏళ్ల 124 రోజులు; 2017లో) వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిన అతి పెద్ద వయస్కులుగా రికార్డు సృష్టించారు. 'నంబర్‌వన్ ర్యాంక్ అందుకోనుండటంతో గర్వంగా అనిపిస్తోంది. నా జీవితంలో ఇదో ప్రత్యేక క్షణం. ఈస్థాయికి చేరుకోవడానికి కోచ్‌లు, కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషుల పాత్ర ఎంతో ఉంది' అని బోపన్న వ్యాఖ్యానించాడు

**4** లియాండర్ పేస్, మహేశ్ భూపతి, సానియా మీర్జా తర్వాత డబుల్స్ ర్యాంకింగ్స్‌లో వరల్డ్ నంబర్‌వన్‌గా నిలవనున్న నాలుగో భారతీయ ప్లేయర్‌గా బోపన్న గుర్తింపు పొందుతాడు.

**24** ఇప్పటి వరకు బోపన్న సాధించిన డబుల్స్ టైటిల్స్. 37 టోర్నీలలో అతను రన్నరప్‌గా నిలిచాడు. 2017లో గాబ్రియేలా దబ్రొస్కీ (కెనడా)తో కలిసి బోపన్న ఫ్రెంచ్ ఓపెన్‌లో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ సాధించాడు. 2010తో ఐజామ్ ఖురేషీ (పాకిస్తాన్)తో యూఎస్ ఓపెన్‌లో... 2023లో ఎబ్డెన్‌తో యూఎస్ ఓపెన్‌లో బోపన్న రన్నరప్‌గా నిలిచాడు.

### అల్‌కరాజ్‌కు షాక్

ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్) కథ ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ జ్వెరేవ్ (జర్మనీ) 6–1, 6–3, 6–7 (2/7), 6–4తో అల్‌కరాజ్‌ను ఓడించి సెమీఫైనల్లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా)తో పోరుకు సిద్ధమయ్యాడు. మరో క్వార్టర్ ఫైనల్లో మెద్వెదెవ్ 7–6 (7/4), 2–6, 6–3, 5–7, 6–4తో తొమ్మిదో సీడ్ హుర్కాజ్ (పోలాండ్)పై గెలిచాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో క్వాలిఫయర్ దయానా యాస్‌ట్రిమ్‌స్కా (ఉక్రెయిన్) 6–3, 6–4తో లిండా నొస్కోవా (చెక్ రిపబ్లిక్)పై... 12వ సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా) 6–7 (4/7), 6–3, 6–1తో అనా కలిన్‌స్కాయ (రష్యా)పై గెలిచి తమ కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

## సూర్యకుమార్‌కు ఐసీసీ అవార్డు

వరుసగా రెండో ఏడాది 'టి20 ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపిక



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 2023 వార్షిక పురస్కారాల్లో భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌కు గుర్తింపు లభించింది. పురుషుల టి20 ఫార్మాట్‌లో సూర్యకుమార్ వరుసగా రెండో ఏడాది 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును గెల్చుకున్నాడు. గత ఏడాది సూర్య 18 మ్యాచ్‌లు ఆడి 155.95 స్ట్రయిక్‌రేట్‌తో 733 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు, ఐదు అర్ధ సెంచరీలు ఉన్నాయి. 'టి20 ఫార్మాట్‌లో భారత మిడిలాఆర్డర్ వెన్నెముకగా సూర్య ఉన్నాడు. తన దూకుడైన ఆటతో పలుసార్లు భారత జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. కెప్టెన్సీ బాధ్యతల్లోనూ అతను ఒత్తిడికి లోను కాకుండా నిలకడగా రాణించాడు' అని ఐసీసీ వ్యాఖ్యానించింది.



## భారత హాకీ జట్టుకు రెండో గెలుపు

మస్కట్: మహిళల 'ఫైవ్స్' ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. అమెరికాతో జరిగిన పూల్ 'సి' రెండో మ్యాచ్‌లో టీమిండియా 7–2 గోల్స్‌తో గెలిచింది. భారత్ తరఫున మరియానా (20వ, 22వ ని.లో), దీపిక (23వ, 25వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేయగా... ముంతాజ్ (27వ ని.లో), అజ్మీనా (29వ ని.లో), మహిమ (17వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. పోలాండ్‌తో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 5–4తో గెలిచింది.

# సినిమా

## వినూత్న పురుషోత్తముడు


రాజ్ తరుణ్


రాజ్ తరుణ్, హాసినీ సుధీర్ జంటగా రామ్ భీమన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పురుషోత్తముడు'. డా. రమేశ్ తేజావత్, ప్రకాష్ తేజావత్ నిర్మిస్తున్న ఈ చిత్రం టాకీ రాజమండ్రిలోని భారీ సెట్‌లో జరిపిన షెడ్యూల్‌తో పూర్తయింది. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రం డబ్బింగ్ జరుగుతోంది. ''ఇప్పటివరకూ తెలుగులో రాని కథతో ఈ చిత్రాన్ని నిర్మించాం. వినూత్న కథ, గోపీ సుందర్ పాటలు, పీజీ విందా కెమెరా వర్క్.. ఇలా అన్నీ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటాయి'' అన్నారు నిర్మాతలు.

## రామ్ సైనికులకు అంకితం


సూర్య, ధన్య

''రామ్' మాకు తొలి సినిమా. మా చిత్రానికి తెగే ప్రతి టికెట్‌లో రూ. ఐదు నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఇస్తాం. దేశ సైనికులకు ఈ చిత్రాన్ని అంకితం చేస్తున్నాం'' అన్నారు నిర్మాత దీపికాంజలి. సూర్య అయలసోమయాజుల, ధన్యా బాలకృష్ణ జంటగా మిహిరామ్ వైనతేయ దర్శకత్వం వహించిన చిత్రం 'రామ్'. ఓఎస్ఎం విజన్‌తో కలిసి దీపికాంజలి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న రిలీజవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకకి నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, బెక్కెం వేణుగోపాల్ అతిథులుగా హాజరై, 'రామ్' హిట్టవ్వాలన్నారు. ''రామ్' మంచి దేశభక్తి చిత్రం'' అన్నారు సూర్య అయలసోమయాజుల, ధన్యా బాలకృష్ణ. ''దేశ సరిహద్దు లోపల ఉగ్రవాదుల దాడి నుంచి మనల్ని కాపాడే అన్‌సంగ్ హీరోల గురించి 'రామ్' తీశాం'' అన్నారు మిహిరామ్.

## అయలాన్‌ని హాయిగా చూడొచ్చు
- శివ కార్తికేయన్



''యూనివర్సల్ కాన్సెప్ట్‌తో రూపొందిన చిత్రం 'అయలాన్'. సినిమాలా ఉండదు.. థీమ్ పార్క్‌లోకి వెళ్లినట్టు, జాలీ రైడ్‌లా ఉంటుంది. రెండున్నర గంటలు హాయిగా ఎంజాయ్ చేయొచ్చు. మా సినిమా తమిళనాడులో భారీ విజయం సాధించింది. తెలుగులోనూ సూపర్ హిట్టవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు హీరో శివ కార్తికేయన్. ఆర్. రవికుమార్ దర్శకత్వంలో శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్‌సింగ్ జంటగా నటించిన చిత్రం 'అయలాన్'. కోటపాడి జె. రాజేష్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 12న తమిళంలో విడుదలైంది. తెలుగులో మహేశ్వర్ రెడ్డి ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శివకార్తికేయన్ మాట్లాడుతూ– ''అయలాన్' షూటింగ్ కోవిడ్‌కి ముందే పూర్తి చేశాం. కరోనా వల్ల విజువల్ ఎఫెక్ట్స్ చేయడం కుదరలేదు. 'రోబో', 2.ఓ' సినిమాల్లో కన్నా ఎక్కువ విజువల్ ఎఫెక్ట్స్ ఉన్న చిత్రమిది. 'అయలాన్'లో నేనో హీరో అయితే ఏలియన్ మరో హీరో. అయలాన్' సీక్వెల్‌ని ఇంకా భారీగా చేస్తాం'' అన్నారు.


శ్రుతీహాసన్

## డిటెక్టివ్ అను

ఇంగ్లిష్ మూవీ 'చెన్నై స్టోరీ' కోసం డిటెక్టివ్‌గా అనుగా మారనున్నారు శ్రుతీహాసన్. 'ది అరేంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' నవల ఆధారంగా దర్శకుడు, 'బాఫ్టా' అవార్డు విజేత ఫిలిప్ జాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఓ ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీ నడిపే తమిళ మహిళ కథే ఈ చిత్రం. కనిపించకుండా పోయిన తన తండ్రిని కనుగొనే ప్రయత్నంలో ఓ వ్యక్తి (బ్రిటిష్ నటుడు వివేక్ కల్రా) వేల్స్ నుంచి చెన్నైలో అడుగుపెట్టి, డిటెక్టివ్ అను సహాయం కోరడం, ఆ తర్వాత అను ఏం చేసింది? అనేది కథాంశం. ప్రధానంగా ఇంగ్లిష్, కొంచెం తమిళ్, వేల్స్ భాషలతో ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం సాగుతుంది. కాగా, ఇండో–యూకే ప్రొడక్షన్ నిర్మించనున్న ఈ చిత్రానికి యూకేకి చెందిన బ్రిటిష్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఫండింగ్ చేయనుంది. ''చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రానికి అంతర్జాతీయ భాగస్వామ్యం ఉండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శ్రుతీహాసన్. కాగా ఈ సినిమాని సమంత చేయాల్సింది. కానీ కొన్నాళ్లు ఆమె సినిమాలకు గ్యాప్ ఇవ్వడంవల్ల ఈ చాన్స్ శ్రుతీ హాసన్‌కి దక్కింది.

## ప్రేమ... యుద్ధం


రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్

భార్యాభర్తలు రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ ప్రేమికులుగా కనిపించనున్నారు. ఈ వెండితెర ప్రేమకు సంజయ్ లీలా భన్సాలీ దర్శకుడు. రణ్‌బీర్, ఆలియా జంటగా విక్కీ కౌశల్ ఓ హీరోగా ఈ చిత్రం రూపొందనుంది. ఒక పురాణ గాథ.. 'లవ్ అండ్ వార్' అంటూ ఈ చిత్రాన్ని ప్రకటించారు. యుద్ధం నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు భన్సాలీ. వచ్చే ఏడాది క్రిస్మస్‌కి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.

## రెండు సార్లు గుండు చేయించుకున్నాను
- సుహాస్


శివానీ నాగరం, సుహాస్

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీ నాకెంతో స్పెషల్. ఈ సినిమా కోసం రెండు సార్లు గుండు చేయించుకున్నాను. బ్యాండ్ కొట్టడం నేర్చుకున్నాను. మా సినిమాకు ప్రేక్షకులు మంచి సక్సెస్ అందిస్తారని ఆశిస్తున్నా'' అని హీరో సుహాస్ అన్నారు. దుష్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో దుష్యంత్ కటికనేని మాట్లాడుతూ– ''కొన్ని వాస్తవ ఘటనలతో ఈ సినిమా తీశాం. లవ్ స్టోరీతో పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది'' అన్నారు. ''ప్రేక్షకులు మా సంస్థకి 'బేబీ' వంటి బ్లాక్ బస్టర్ అందించారు. 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'తో మరో సూపర్ హిట్ ఇస్తారని ఆశిస్తున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని.

## సినిమా అంతా ఒకటే పాత్ర ఉంటుంది


బొమ్మక్ శివ

''105 మినిట్స్' మంచి ప్రయోగాత్మక చిత్రం. సినిమా మొత్తం ఒకటే పాత్ర ఉంటుంది. కానీ, ఇంకో వాయిస్ వినిపిస్తుంది. పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఓ బాలీవుడ్ నటుడి మాటలు వినిపిస్తుంటాయి'' అని నిర్మాత బొమ్మక్ శివ అన్నారు. హీరోయిన్ హన్సిక లీడ్ రోల్‌లో రాజు దుస్సా దర్శకత్వం వహించిన చిత్రం '105 మినిట్స్'. బొమ్మక్ శివ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదలవుతోంది. బొమ్మక్ శివ మాట్లాడుతూ– ''నాకు రియల్ ఎస్టేట్, కన్వెన్షన్ సెంటర్స్ బిజినెస్‌లు ఉన్నాయి. సినిమాపై ప్యాషన్‌తో మొదటి ప్రాజెక్టుగా '105' మూవీ తీశాను. రాజు దుస్సా చక్కగా తీశాడు. హన్సికను ఈ మూవీలో కొత్తగా చూస్తారు. మైత్రీ మూవీస్ సంస్థ మా సినిమాని రిలీజ్ చేస్తుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు.

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 690 | 215 |
| 71,060 | 21,454 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 15,615 | ▲ | 189 |
| డోజోన్స్ | 38,027 | ▲ | 121 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,528 | ▲ | 42 |
| డాక్స్ | 16,890 | ▲ | 263 |
| షాంఘై | 2,821 | ▲ | 50 |
| నికాయ్ | 36,226 | ▼ | 291 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

## బులియన్ (రూ.లలో)

**ముంబై**

| | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | | |
| 62,591 | ▲ | 236 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | | |
| 62,340 | ▲ | 235 |
| వెండి (కిలో) | | |
| 71,072 | ▲ | 761 |

## ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 82.73 | 83.75 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 104.63 | 107.21 |
| € | యూరో | ఎస్‌బీఐ | 89.49 | 91.85 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 55.58 | 56.84 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 53.92 | 55.85 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 61.19 | 62.63 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 21.22 | 22.83 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 21.73 | 23.53 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.49 | 12.56 |

# ఆర్థికమంత్రి హల్వా విందు...



2024 మధ్యంతర బడ్జెట్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందుకు ప్రతీకాత్మకంగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థికశాఖ నార్త్‌బ్లాక్‌లో హల్వా విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంతో బడ్జెట్ పత్రాల ముద్రణ అధికారికంగా ప్రారంభమవుతుంది. లోక్‌సభలో ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థికమంత్రి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టేంతవరకూ ముద్రణ ప్రక్రియలో పాల్గొనే అధికారులు అందరూ 'లాక్-ఇన్'లో ఉంటారు. బడ్జెట్‌కు ముందు సంప్రదాయంగా వస్తున్న ఈ హల్వా రుచుల ఆస్వాదన కార్యక్రమంలో ఆర్థికశాఖ సహాయమంత్రి కరాద్, ఫైనాన్స్ సెక్రటరీ టీవీ సోమనాథన్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్, దీపమ్ సెక్రటరీ తుహిన్ కాంతా పాండే తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# లాభాల్లోకి టాటా స్టీల్

### డిసెంబర్ క్వార్టర్‌లో రూ. 522 కోట్లు




**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) మూడో త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నష్టాలను వీడి రూ. 522 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 2,502 కోట్ల నికర నష్టం ప్రకటించింది. ఈ ఏడాది క్యూ2(జులై-సెప్టెంబర్)లోనూ రూ. 6,511 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 57,354 కోట్ల నుంచి రూ. 55,540 కోట్లకు క్షీణించింది. కాగా.. నికర రుణ భారం రూ. 77,405 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో టాటా స్టీల్ షేరు బీఎస్ఈలో 4% జంప్‌చేసి రూ. 135 వద్ద ముగిసింది.

# మారుతీ ఫ్రాంక్స్ అమ్మకాలు @ లక్ష




**న్యూఢిల్లీ:** ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా కాంపాక్ట్ ఎస్‌యూవీ ఫ్రాంక్స్ లక్ష యూనిట్ల విక్రయాల మార్కును అధిగమించింది. రికార్డు సమయంలో 10 నెలల వ్యవధిలోనే దీన్ని సాధించినట్లు సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. ఇది పరిశ్రమలో కొత్త బెంచ్‌మార్క్‌ను సృష్టించిందని ఆయన పేర్కొన్నారు. 2022లో ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో 10.4 శాతంగా ఉన్న తమ వాటాను 19.7 శాతానికి పెంచుకోవడంలో ఈ మోడల్ గణనీయంగా తోడ్పడిందని శ్రీవాస్తవ వివరించారు. 2023 ఏప్రిల్ 24న ఫ్రాంక్స్‌ను మారుతీ దేశీ మార్కెట్లో ప్రవేశపెట్టింది. దీన్ని లాటిన్ అమెరికా, మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియా మార్కెట్లకు కూడా ఎగుమతి చేస్తోంది. ఇప్పటివరకు 9,000 యూనిట్లను ఎగుమతి చేసింది.

# బుల్ బౌన్స్ బ్యాక్

**ముంబై:** గత రెండు రోజులుగా అమ్మకాల ఒత్తిడితో తడబడిన బుల్ బుధవారం బౌన్స్‌బ్యాక్ అయ్యింది. ఇటీవల మార్కెట్ పతనంతో కనిష్టాలకు దిగివచ్చిన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలను ఆసరాగా చేసుకొని ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టారు. ముఖ్యంగా నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీ ఇండెక్సుల్లో షార్ట్ కవరింగ్ చోటుచేసుకుంది. ఇండెక్సుల్లో అధిక వెయిటేజీ షేర్లైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2%, రిలయన్స్ ఒకశాతానికి మేర రాణించి సూచీల రికవరీకి తోడ్పడ్డాయి. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీలు అంతకు ముందు కోల్పోయిన కీలకమైన 71000, 21,450 స్థాయిలని తిరిగి అందుకున్నాయి. మెటల్, కమోడిటీ, టెలికం షేర్లకు భారీ డిమాండ్ నెలకొనడంతో సెన్సెక్స్ 690 పాయింట్లు పెరిగి 71,060 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 70,002 వద్ద కనిష్టాన్ని, 71,150 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 215 పాయింట్లు బలపడి 21,454 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 21,137 - 21,482 పరిధిలో కదలాడింది. సెన్సెక్స్ ఒక శాతం ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.42 లక్షల కోట్లు పెరిగి రూ.371.4 లక్షల కోట్లకు చేరింది.



- కలిసొచ్చిన కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు
- ప్రపంచ మార్కెట్లలో సానుకూలతలు
- అధిక వెయిటేజీ షేర్ల ర్యాలీ
- 1% పెరిగిన సూచీలు

# కెనరా బ్యాంక్ లాభం జూమ్

### క్యూ3లో రూ. 3,659 కోట్లు



**ముంబై:** ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. నికర లాభం 27 శాతం జంప్‌చేసి రూ. 3,659 కోట్లను తాకింది. అధిక వడ్డీ ఆదాయం, తగ్గిన రుణ వ్యయాలు ఇందుకు సహకరించాయి. నికర వడ్డీ ఆదాయం 9 శాతం పైగా వృద్ధితో రూ. 9,417 కోట్లకు చేరింది. క్రెడిట్ వ్యయం 0.24 శాతం తగ్గి 0.97 శాతానికి చేరినట్లు బ్యాంక్ సీఈవో కె.సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.5 శాతం తగ్గి 3.39 శాతానికి, నికర ఎన్‌పీఏలు సైతం 0.64 శాతం మెరుగుపడి 1.32 శాతానికి దిగివచ్చినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో కెనరా బ్యాంక్ షేరు బీఎస్ఈలో 0.5% క్షీణించి రూ. 454 వద్ద ముగిసింది.

# గిఫ్ట్ సిటీ ఎక్స్ఛేంజీల్లో నేరుగా లిస్టింగ్

### దేశీ సంస్థలకు ప్రభుత్వం అనుమతి



**న్యూఢిల్లీ:** దేశీ కంపెనీలు తమ షేర్లను గుజరాత్ గిఫ్ట్ ఐఎఫ్‌ఎస్‌సీలోని అంతర్జాతీయ ఎక్స్ఛేంజీల్లో నేరుగా లిస్ట్ చేసుకునేందుకు అనుమతినిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్థిక శాఖలో భాగమైన ఆర్థిక వ్యవహారాల విభాగం (డీఈఏ) ఈ మేరకు విదేశీ మారక నిర్వహణ చట్ట నిబంధనలను సవరించి, నోటిఫై చేసింది. అటు కార్పొరేట్ వ్యవహారాల శాఖ కూడా ఇందుకు సంబంధించిన నిబంధనలను జారీ చేసింది. దీనితో విదేశీ పెట్టుబడుల రాకకు, వృద్ధి అవకాశాలకు ఊతం లభించగలదని, భారతీయ కంపెనీలకు మరింత మంది ఇన్వెస్టర్లు అందుబాటులోకి రాగలరని ఆర్థిక శాఖ ప్రకటన తెలిపింది.

# టెక్ మహీంద్రా లాభం డౌన్

### రూ. 510 కోట్లకు పరిమితం




**ముంబై:** ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర పనితీరు ప్రదర్శించింది. నికర లాభం 60 శాతం పతనమై రూ. 510 కోట్లకు పరిమితమైంది. లాభాల మార్జిన్లు దెబ్బతినడం ప్రభావం చూపింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 1,297 కోట్లు ఆర్జించింది. ఈ ఏడాది క్యూ2(జులై-సెప్టెంబర్)లో రూ. 494 కోట్ల లాభం మాత్రమే సాధించింది. సీజనల్‌గా క్యూ3 బలహీనమేకాకుండా టెలికం, హైటెక్, ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాల్లో డిమాండ్ నీరసించడం ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. కాగా.. మొత్తం ఆదాయం 5 శాతం క్షీణించి రూ. 13,101 కోట్లకు పరిమితమైంది. గత క్యూ3లో రూ. 13,734 కోట్ల టర్నోవర్ సాధించింది. 38.1 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్ కుదుర్చుకుంది. ఈ ఏడాది క్యూ2(64 కోట్ల డాలర్లు)తో పోలిస్తే భారీగా క్షీణించాయి. ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 17 శాతం నుంచి 10 శాతానికి దిగివచ్చింది. ఈ క్యూ2లో ఇది 11 శాతంగా నమోదైంది. త్రైమాసికవారీగా మొత్తం సిబ్బంది సంఖ్య 3 శాతం తగ్గి 1,46,250కు చేరింది.

టెక్ మహీంద్రా షేరు బీఎస్ఈలో 3% ఎగసి రూ. 1,408 వద్ద ముగిసింది.

## కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 25-1-2024 | |
|---|---|
| విశాఖ | 565-00 |
| చిత్తూరు | 573-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 560-00 |
| విజయవాడ | 560-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **24-1-2024 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 540-00 |
| వరంగల్ | 542-00 |
| రిటైల్ ధర | 6.00 |

# వివిఫైకి రూ. 622 కోట్ల నిధులు

### ఇక లఘు, చిన్న తరహా పరిశ్రమలకు రుణాలు




**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఫిన్‌టెక్ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ వివిఫై తాజాగా 75 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 622.50 కోట్లు) నిధులు సమీకరించింది. డెట్, ఈక్విటీ రూపంలో ఈ మొత్తాన్ని సమకూర్చుకున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు అనిల్ పినపాల బుధవారమిక్కడ విలేకరులకు చెప్పారు. రుణాలు, కార్యకలాపాల విస్తరణకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు వివరించారు. కొత్తగా లఘు, చిన్న తరహా పరిశ్రమల విభాగంలోకి ప్రవేశిస్తున్నట్లు అనిల్ చెప్పారు. గతేడాది దాదాపు రూ. 1,000 కోట్ల రుణాలు ఇవ్వగా, ఈసారి రూ. 3,000 కోట్ల వితరణను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. సహ వ్యవస్థాపకుడు శ్రీనాథ్ కొంపెల్ల, చైర్మన్ ప్యాట్రిక్ కిషోర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫ్లెక్స్‌పే, ఫ్లెక్స్‌శాలరీ ఉత్పత్తుల ద్వారా సంస్థ అల్పాదాయ వర్గాలకు అత్యంత తక్కువగా రూ. 500 నుంచి రూ. 2.5 లక్షల వరకు అన్‌సెక్యూర్డ్ రుణాలు అందిస్తోంది.

# ఇండియన్ ఆయిల్.. దూకుడు

### నికర లాభం రూ. 8,063 కోట్లు




**న్యూఢిల్లీ:** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. స్టాండెలోన్ నికర లాభం భారీగా దూసుకెళ్లి రూ. 8,063 కోట్లను అధిగమించింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో కేవలం రూ. 448 కోట్లు ఆర్జించింది. అయితే ఈ ఏడాది క్యూ2(జులై-సెప్టెంబర్)లో ఆర్జించిన రూ. 12,697 కోట్లతో పోలిస్తే తాజా లాభాలు తక్కువేకావడం గమనార్హం.

ఫలితాల నేపథ్యంలో ఐవోసీ షేరు బీఎస్ఈలో 3.3 శాతం బలపడి రూ. 144 వద్ద ముగిసింది.

---

# భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఐవోసీఎల్ పైప్‌లైన్స్ విభాగంలో 473 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్).. పైప్‌లైన్స్ డివిజన్ పరిధిలోని ఐదు రీజియన్‌లలో టెక్నికల్/నాన్ టెక్నికల్ ట్రేడుల్లో అప్రెంటిస్‌ల శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 473
- **అర్హత:** 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **వయసు:** 12.01.2024 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వైద్య పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.02.2024.
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** 09.02.2024 నుంచి 18.02.2024 వరకు.
- **రాతపరీక్ష తేది:** 18.02.2024.
- **వెబ్‌సైట్:** https://www.iocl.com

### ఎన్‌హెచ్ఏఐ, న్యూఢిల్లీలో 60 డిప్యూటీ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన డిప్యూటీ మేనేజర్(టెక్నికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 60
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 30ఏళ్లు మించకూడదు.
- **పే స్కేల్:** రూ.15,600 నుంచి రూ.39,100.
- **ఎంపిక విధానం:** యూపీఎస్సీ 2023లో నిర్వహించిన ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.02.2024.
- **వెబ్‌సైట్:** https://nhai.gov.in

### యూఓహెచ్‌లో ఎంబీఏ ప్రవేశాలు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్.. 2024-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- **అర్హత:** ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, క్యాట్-2023 ఉత్తీర్ణులై ఉండాలి.
- **ప్రవేశ ప్రక్రియ:** క్యాట్-2023 స్కోర్, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.01.2024.
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

# క్యాట్.. మలిదశలో మెరిసేలా!

దేశంలోని ప్రతిష్టాత్మక మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లైన ఐఐఎంలు క్యాట్ స్కోర్ ఆధారంగా మలిదశ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తాయి. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు ఖరారు చేస్తున్నాయి. క్యాట్-2023 ఆన్‌లైన్ పరీక్షను నవంబర్ 26న నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫలితాల డిసెంబర్ 21న విడుదల చేశారు. ఈ క్యాట్ స్కోర్ ఆధారంగా ఫిబ్రవరిలో మలిదశ ఎంపికను ప్రారంభించనున్నాయి. ఇందుకు సంబంధించి ఐఐఎంలు, ఇతర టాప్ బీస్కూల్స్ షార్ట్‌లిస్ట్‌లను విడుదల చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. క్యాట్ మలిదశ ఎలా ఉంటుంది.. ఇందులో రాణించడమెలాగో తెలుసుకుందాం..

- ఇటీవల క్యాట్ 2023 ఫలితాలు వెల్లడి
- ఫిబ్రవరిలో మలిదశ ఎంపిక ప్రక్రియ!
- జీడీ,పీఐ,రిటెన్ ఎబిలిటీ టెస్ట్ కీలకం



**ఎంబీఏ స్పెషల్**

ఐఐఎంలు క్యాట్ స్కోర్ ఆధారంగా..మలిదశలో గ్రూప్ డిస్కషన్(జీడీ), రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ(పీఐ) నిర్వహిస్తున్నాయి. క్యాట్-2023 విజేతలు మలిదశపై సమగ్ర అవగాహన పెంచుకోవడం ద్వారా విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు. మలిదశలో ముఖ్యంగా నేర్చుకోవాలనే తపన, నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సానుకూల దృక్పథం తదితర లక్షణాలను పరిశీలిస్తారు.

### గ్రూప్ డిస్కషన్

క్యాట్‌లో నిర్దేశిత కటాఫ్ సాధించిన అభ్యర్థులకు మలిదశలో ఆయా ఐఐఎం క్యాంపస్‌లలో నిర్వహించే ఎంపిక ప్రక్రియ.. గ్రూప్ డిస్కషన్. అభ్యర్థులను బృందాలుగా ఏర్పరిచి.. ఏదైనా ఒక అంశాన్ని ఇచ్చి దానిపై చర్చించమంటారు. ఇందులో కోర్ నుంచి కాంటెంపరరీ వరకు అనేక టాపిక్స్ అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచే సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో పాటు సమకాలీన పరిణామాలపై అన్ని కోణాల్లో అవగాహన పెంచుకోవాలి. ఇందులో రాణించేందుకు ఆత్మవిశ్వాసంతో మాట్లాడేలా సాధన చేయాలి. అలాగే ఇతరులు చెప్పే విషయాలను శ్రద్ధగా వినే నైపుణ్యం పెంచుకోవాలి.

### రిటెన్ ఎబిలిటీ టెస్ట్

గ్రూప్ డిస్కషన్ తర్వాత అభ్యర్థులు తమ ప్రతిభను నిరూపించుకోవాల్సిన మరో పరీక్ష.. రిటెన్ ఎబిలిటీ టెస్ట్. ఇందులో ఏదైనా నిర్దిష్టంగా ఒక అంశాన్ని పేర్కొని.. అభ్యర్థుల అభిప్రాయం లేదా సలహాలు వ్యక్తీకరించే విధంగా ప్రశ్నలు అడుగుతున్నారు. ఒక అంశానికి సంబంధించి మూడు వందల నుంచి నాలుగు వందల పదాల మధ్యలో అభ్యర్థులు తమ సమాధానం రాయాల్సి ఉంటుంది. సబ్జెక్ట్ నాలెడ్జ్, సోషల్ అవేర్‌నెస్ సమ్మిళితంగా ఈ ప్రశ్నలు ఉంటున్నాయి. అభ్యర్థులు ముందుగా ఇచ్చిన టాపిక్‌ను సమగ్రంగా అవగాహన చేసుకోవాలి. దానికి సంబంధించి అన్ని కోణాల్లో తన ఆలోచనలను ఒక క్రమ పద్ధతిలో సిద్ధం చేసుకోవాలి. వాటిని సులభమైన భాషలో రాయగలగాలి. ముఖ్యంగా గ్రామర్, స్పెల్లింగ్ పొరపాట్లు లేకుండా చూసుకోవాలి.

### పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో విజయం సాధించిన అభ్యర్థులు చివరిగా ఎదుర్కోవాల్సిన ప్రక్రియ.. పర్సనల్ ఇంటర్వ్యూ. విద్యార్థికి మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఉన్న వాస్తవ ఆసక్తి, అతని భవిష్యత్తు లక్ష్యాలు, వాటిని అందుకునేందుకు అతను ఎంచుకున్న మార్గాలు వంటి వాటిని తెలుసుకునేలా నిపుణులైన ప్రొఫెసర్స్ కమిటీ ఈ ఇంటర్వ్యూను నిర్వహిస్తుంది. కాబట్టి అభ్యర్థులు తమ కెరీర్ లక్ష్యాలపై పూర్తి స్పష్టతతో ఇంటర్వ్యూకు వెళ్లాలి.

### అకడెమిక్ వెయిటేజీ

ఐఐఎంలలో పీజీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్‌లో చేరే అభ్యర్థుల తుది ఎంపికకు క్యాట్ స్కోర్, జీడీ, ఆర్ఏటీ, పర్సనల్ ఇంటర్వ్యూలలో ప్రతిభతోపాటు మరెన్నో అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. తుది ఎంపికలో వాటికి కూడా నిర్దిష్ట వెయిటేజీ కల్పిస్తున్నారు. మొత్తం వంద మార్కుల వెయిటేజీ విధానంలో.. 35 నుంచి 50 శాతం మేరకు జీడీ, పీఐలకు వెయిటేజీ కల్పిస్తున్నారు. డైవర్సిటీ వెయిటేజీ పేరుతో జండర్ డైవర్సిటీ, కల్చరల్ డైవర్సిటీలకు మూడు నుంచి అయిదు శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నారు. పలు ఐఐఎంలు అకడమిక్ వెయిటేజీ నిబంధన కూడా అమలు చేస్తున్నాయి. పదో తరగతి,ఇంటర్మీడియెట్,బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు పది శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తున్నారు. అదే విధంగా ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్స్ ఉన్న వారికి ప్రత్యేక వెయిటేజీని ఇస్తున్నారు. ఈ వెయిటేజీ రెండు నుంచి మూడు శాతం మధ్యలో ఉంటోంది.

### వర్క్ ఎక్స్‌పీరియన్స్

ఐఐఎంలు తుది జాబితా రూపకల్పనలో పని అనుభవానికి కూడా వెయిటేజీ కల్పిస్తున్నాయి. వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఉన్న అభ్యర్థులకు అయిదు నుంచి పది శాతం మధ్యలో వెయిటేజీ ఇస్తున్నాయి. ఈ వెయిటేజీ కూడా అభ్యర్థులు పని చేస్తున్న రంగం, మొత్తం అనుభవం గడించిన సంవత్సరాల ఆధారంగా ఉంటోంది.

### జండర్ వెయిటేజీ

- జండర్ వెయిటేజీ..ఐఐఎంలు అనుసరిస్తున్న మరో వినూత్న విధానం. మేనేజ్‌మెంట్ విద్యలో మహిళా విద్యార్థులు చేరేలా ప్రోత్సహించేందుకు జండర్ డైవర్సిటీ విధానాన్ని అమలు చేస్తున్నారు.
- ఐఐఎం కోల్‌కత.. జండర్ డైవర్సిటీ వెయిటేజీ పేరుతో మహిళా విద్యార్థులకు అదనంగా మూడు మార్కులు కేటాయిస్తోంది.
- ఐఐఎం లక్నో.. మహిళా విద్యార్థులకు రెండు పాయింట్లు కేటాయిస్తోంది.
- ఐఐఎం రోహతక్.. జండర్ డైవర్సిటీ, నాన్-ఇంజనీరింగ్ ఫ్యాక్టర్స్ పేరుతో మొత్తం ఎంపిక ప్రక్రియలో 30పాయింట్లు కేటాయిస్తుండటం విశేషం
- ఐఐఎం రాయ్‌పూర్.. ఎంపిక ప్రక్రియలో 20 శాతం వెయిటేజీని జండర్ డైవర్సిటీ పేరుతో కేటాయిస్తోంది.
- ఐఐఎం- ఉదయ్‌పూర్ 15 పాయింట్లు; ఐఐఎం -కాశీపూర్ మూడు పాయింట్లు కేటాయిస్తోంది.

### అకడమిక్ డైవర్సిటీ

క్యాట్‌లో ఉత్తీర్ణత, ఐఐఎంలలో ప్రవేశ ప్రక్రియలో ఇంజనీరింగ్ అభ్యర్థులు ముందంజలో ఉంటున్నారనే అభిప్రాయం నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో ఐఐఎంలలో నాన్-ఇంజనీరింగ్ విద్యార్థులకూ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఐఐఎంలు అకడమిక్ డైవర్సిటీకి కూడా పెద్ద పీట వేస్తున్నాయి.

# టెన్త్, ఇంటర్‌తోనే కేంద్ర కొలువు

**జాబ్స్ ఇన్ఫో**

**ఏఏఐ నదరన్ రీజియన్‌లో 119 పోస్టులకు నోటిఫికేషన్**

టెన్త్, ఇంటర్ విద్యార్హతతోనే కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకోవాలనుకునే వారికి చక్కటి అవకాశం. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. సదరన్ రీజియన్‌లోని వివిధ విమానాశ్రయాల్లో జూనియర్/సీనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్ దీవులకు చెందిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 119
- **ఖాళీల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్(ఫైర్ సర్వీస్)-73 పోస్టులు, జూనియర్ అసిస్టెంట్(ఆఫీస్)-02,సీనియర్ అసిస్టెంట్(ఎలక్ట్రానిక్స్)-25, సీనియర్ అసిస్టెంట్(అకౌంట్స్)-19 పోస్టులు.

### వయసు

20.12.2023 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు 5ఏళ్లు, ఓబీసీలు,ఎక్స్-సర్వీస్‌మెన్‌కు 3ఏళ్ల గరిష్ట వయోపరిమితిలో సడలింపు.

### అర్హతలు-ఎంపిక విధానం

పోస్టును అనుసరించి విద్యార్హతలు, ఎంపిక విధానాలు వేర్వేరుగా ఉన్నాయి.

### జూనియర్ అసిస్టెంట్ (ఫైర్ సర్వీసెస్)

- ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు పదోతరగతితో పాటు మూడేళ్ల రెగ్యులర్ మెకానికల్/ఆటోమొబైల్/ఫైర్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఇంటర్మీడియట్‌పాసవ్వాలి. స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కింద ఈ పోస్టులను ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు కేటాయించారు. హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
- రాత పరీక్ష ఇలా.. ఎంపిక ప్రక్రియలో భాగంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. పార్ట్-1లో 50శాతం ప్రశ్నలు బేసిక్ మ్యాథమెటిక్స్, బేసిక్స్ సైన్స్, ఎలిమెంటరీ ఇంగ్లిష్/గ్రామర్‌ల నుంచి ఉంటాయి. ప్రశ్నపత్రం 10వ తరగతి స్థాయిలో ఉంటుంది. పార్ట్-బిలో 50శాతం ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ నుంచి అడుగుతారు. ప్రశ్నలు 10+2 స్థాయిలో ఉంటాయి. స్టేజ్-2: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. దీంట్లో పాసైతే డ్రైవింగ్, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్‌లు ఉంటాయి.

### జూనియర్ అసిస్టెంట్ (ఆఫీస్)

- ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంపిక ఇలా.. కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు. రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఎంఎస్-ఆఫీస్‌లో కంప్యూటర్ లిటరసీ టెస్ట్ నిర్వహిస్తారు. 50 శాతం ప్రశ్నలు విద్యార్హతల సబ్జెక్ట్‌లకు సంబంధించినవి ఉంటాయి. జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్‌లో 50శాతం ప్రశ్నలు అడుగుతారు.

### సీనియర్ అసిస్టెంట్(ఎలక్ట్రానిక్స్)

- ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు ఎలక్ట్రానిక్స్/టెలికాం/రేడియో ఇంజనీరింగ్ డిప్లొమా, సంబంధిత విభాగంలో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
- రాత పరీక్ష.. కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఇందులో అకడమిక్ సబ్జెక్టుల నుంచి 70శాతం ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ నుంచి 30 శాతం ప్రశ్నలు ఇస్తారు.

### సీనియర్ అసిస్టెంట్ (అకౌంట్స్)

- ఈ విభాగంలోని పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు బీకాం ఉత్తీర్ణులై ఉండాలి. రెండేళ్ల ఉద్యోగానుభవం తప్పనిసరి. ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ తయారీ, టాక్సేషన్, ఆడిట్, ఫైనాన్స్, అకౌంట్స్ రంగాల్లో పరిజ్ఞానం ఉండాలి.
- **రాత పరీక్ష:** ఈ పోస్టుల ఎంపికలో భాగంగా 100 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో రాత పరీక్షను నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. ఎంఎస్ ఆఫీస్‌లో కంప్యూటర్ లిటరసీ టెస్ట్ ఉంటుంది. సీబీటీలో అర్హత సాధించినవారికి కంప్యూటర్ లిటరసీ టెస్ట్ నిర్వహిస్తారు. ఇది అర్హత పరీక్ష మాత్రమే. సీబీటీలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల తుది ఎంపిక ఉంటుంది. విద్యార్హతలకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి 70 శాతం ప్రశ్నలు ఇస్తారు. మిగతా 30 శాతం ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ నుంచి అడుగుతారు.

### ప్రిపరేషన్ ఇలా

70 శాతం ప్రశ్నలు సంబంధిత అకడమిక్ సబ్జెక్టుల నుంచే వస్తాయి. కాబట్టి గతంలో చదివిన సబ్జెక్టులపై పట్టు సాధించడానికి ప్రయత్నించాలి. వీలైనన్నీ ఎక్కువ మాక్ టెస్టులు రాయాలి. జీకే, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్‌ల కోసం పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి. నెగిటివ్ మార్కులు లేవు.

### ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 26.01.2024
- వెబ్‌సైట్: https://www.aai.aero

బుధవారం గోల్కొండ కోటలో లేజర్ బేస్ట్ లైట్ అండ్ సౌండ్ షోను ప్రారంభిస్తున్న చిరంజీవి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో విజయేంద్రప్రసాద్





# మోదీ హయాంలోనే పర్యాటక అభివృద్ధి

### గోల్కొండ కోటలో లేజర్ బేస్ట్ లైట్ అండ్ సౌండ్ షో ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్(గోల్కొండ):** ప్రధాని మోదీ హయాంలోనే పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందిందని ఆ శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం గోల్కొండ కోటలో సరికొత్తగా ఏర్పాటు చేసిన లేజర్ బేస్ట్ లైట్ అండ్ సౌండ్ షోను సినీనటుడు చిరంజీవితో కలిసి కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ హయాంలోనే అన్ని రాష్ట్రాలలో టూరిజంకు ఆదరణ పెరిగిందని, టెంపుల్ టూరిజం అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు. గోల్కొండ కోటలో ప్రస్తుతమున్న లైట్ అండ్ సౌండ్ షోకు మరింత ఆధునిక సాంకేతికత జోడించి పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తయారు చేశామన్నారు. ఈ లైట్ అండ్ సౌండ్ షో ప్రతి రోజూ మూడు భాషల్లో ఉంటుందని చెప్పారు. తెలంగాణతోపాటు హైదరాబాద్ నగరానికి కూడా పర్యాటకులు ఎక్కువగా వచ్చేలా ప్రణాళికలు రూపొందించి, వాటిని అమలు చేస్తామన్నారు. కాచిగూడ, సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్లను రూ.1300 కోట్లతో ఆధునీకరించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. సంజీవయ్య పార్కులో ఏర్పాటు చేసిన లైట్ అండ్ సౌండ్‌షో వచ్చే నెలలో ప్రారంభమవుతుందని, దీనికి వాడుతున్న లేజర్ లైట్లు దేశంలోనే అత్యుత్తమమైనవని తెలిపారు. వరంగల్ కోటలో కూడా లైట్ అండ్ సౌండ్ షో ఏర్పాటు చేస్తామని, వెయ్యి స్తంభాల గుడిని అభివృద్ధి చేయడానికి కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. గిరిజన పర్యాటక అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, శక్తిపీఠమైన జోగుళాంబ ఆలయాన్ని కూడా డెవలప్ చేస్తామని చెప్పారు. ప్రముఖ సినీనటుడు చిరంజీవి మాట్లాడుతూ తాను కేంద్ర పర్యాటకశాఖ మంత్రిగా ఉన్నప్పుడు గోల్కొండ కోటలో 50 దేశాల ప్రతినిధులతో సమావేశమైన వారికి లైట్ అండ్ షో చూపించామన్నారు. మగధీరతో పాటు రామ్‌చరణ్‌తో కలిసి గోల్కొండ కోటలో తాను సినిమా షూటింగ్‌లో పాల్గొన్న రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సినీ రచయిత, ఎంపీ విజయేంద్రప్రసాద్, ఏఎస్ఐ డైరెక్టర్ జనరల్ యూఎస్.రావత్ పాల్గొన్నారు.



స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ పర్యాటక ట్రేడ్ ఫెయిర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ స్టాల్‌లో సంప్రదాయ కళారూపాలు ప్రదర్శించిన కళాకారులతో మంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ తదితరులు. తెలంగాణకు అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య పెరిగేలా స్థానిక పర్యాటక ప్రాంతాలను మెరుగుపరుస్తామని మంత్రి చెప్పారు.

# సిరిసిల్లకు ఇప్పట్లో రైలు కూత లేనట్టే

- సిద్దిపేట–సిరిసిల్ల మధ్య నిలిచిపోయిన పనులు
- భూసేకరణ పరిహారం చెల్లింపులో జాప్యం
- ఇంకా రైల్వేకు స్వాధీనం రాని 80 ఎకరాలు

**సాక్షి, హైదరాబాద్:** సిరిసిల్లకు ఇప్పట్లో రైలుకూత వినిపించే పరిస్థితి లేదు. మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టు పనుల్లో భాగంగా భూసేకరణ పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరిగింది. దీంతో పనులు ముందుకు సాగడం లేదు. సికింద్రాబాద్ నుంచి ప్రస్తుతం సిద్దిపేట స్టేషన్ వరకు రైలు సర్వీసులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ మార్చి నాటికి సిరిసిల్ల స్టేషన్ వరకు పనులు పూర్తి చేయాల్సి ఉంది. వీలునుబట్టి రైలు సర్వీసులను సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు పొడిగించాలని అనుకుంది. డిమాండ్ సర్వేలో, ప్రయాణికుల సంఖ్య ఉంటుందని తేలితే సిరిసిల్ల నుంచి రైలు సర్వీసులు నడిపే అవకాశం ఉంటుంది. కానీ, ఇప్పుడు సిద్దిపేట–సిరిసిల్ల మధ్య కీలక ప్రాంతంలో పనులే జరగటం లేదు. ఫలితంగా రైలు సర్వీసు కూడా ఇప్పట్లో ఉండే అవకాశం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇదీ సంగతి..:** భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యే కొద్దీ రైల్వే అధికా రులు పనులు చేస్తూ వెళ్లారు. ఇలా సిద్దిపేట వరకు వేగంగా పూర్తి చేసి అనుకున్న సమయంలో రైలు సర్వీసులు ప్రారంభించా రు. ఆ తర్వాత సిద్దిపేట –సిరిసిల్ల సెక్షన్ల మధ్య పనులు ప్రారంభించారు. కానీ, మధ్యలో 80 ఎకరాలకు సంబంధించిన భూసేకరణలో ఇబ్బందులొచ్చాయి. ఆ ప్రాంతంలో భూముల ధరలు ఎక్కువగా ఉండటంతో రైతు ల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో అక్కడివరకు వదిలి ఆపై భాగంలో భూసేకరణ ప్రక్రియ కొనసాగించారు. తర్వా త సిద్దిపేట సమీపంలోని భూముల వివాదం పరిష్కారమైంది. భూయజమానులకు పరిహారం కింద రూ.19 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇదే సమ యంలో ఎన్ని కల కోడ్ రావడంతో ఆ చెల్లింపులు నిలిచిపోయా యి. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభు త్వం ఏర్పడ గానే ఆ డబ్బులు చెల్లింపు కోసం రైల్వే అధికారు లు ఒత్తిడి ప్రారంభించారు. కానీ కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడి 45 రోజులు గడుస్తున్నా ఇప్పటి వర కు చెల్లింపు జాడే లేదు. దీంతో పెద్ద కోడూరు, మాచాపూర్, గంగాపూర్, వితలాపూర్ గ్రామాల పరిధిలో రైల్వేలైన్ పనులు ప్రారంభం కాలేదు. రైతులకు పరిహారం చెల్లిస్తే తప్ప ఆ భూములను రైల్వే స్వాధీనం చేసుకునే వీలు లేదు. సిరిసిల్ల సమీపంలో మాత్రం పనులు కొనసాగుతున్నా యి. అక్కడ పూర్తయినా, సిద్దిపేట సమీపంలో పెండింగ్‌లో ఉంటే రైల్వేలైన్ వేసే వీలుండదు. రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లిస్తేనే పనులు మొదలవుతాయి. దీంతో పనులు కనీసం 4నెలలు వెనక బడ్డట్టు అయ్యిందని ఓ రైల్వే అధికారి వ్యాఖ్యానించారు. గతంతో పోలిస్తే అన్నిరకాల పనుల్లో జాప్యం జరుగుతోందని సమాచారం. పరిహారం చెల్లింపే కాకుండా ప్రాజెక్టు వ్యయంలోనూ మూడో వంతు ఖర్చు రాష్ట్రప్రభుత్వం భరించాల్సి ఉంది. ఇప్పుడు ఆ మొత్తానికి సంబంధించి కూడా కొంత పేరుకుపోయిందని తెలుస్తోంది. సిద్దిపేట–సిరిసిల్ల మధ్య 30 కిలోమీటర్ల మేర పనులకు రూ.480 కోట్లు వ్యయమవుతుందని అంచనా. ఆ మార్గంలో కొంత గుట్టభూమి కూడా ఉండటంతో దాన్ని కట్ చేసి పనులు చేయాల్సి ఉంది. ఇది స్వతహాగానే ఆలస్యమయ్యే పని. భూపరిహారం పంపిణీలో జాప్యం, ఇతర పనులూ నెమ్మదించటం వెరసి.. ఈ 30 కిలోమీటర్ల పనుల నిర్వహణలో తీవ్ర జాప్యం తప్పేలా కనిపించటం లేదు.



రోడ్డు కోసం కొలతలు తీస్తున్న అధికారులు

# చెంచుల చెంతకు అధికారులు

- కొల్లంపెంట, కొమ్మెనపెంట సందర్శన
- ఐసీడీఎస్ భవన నిర్మాణానికి స్థలం ఖరారు
- 11.30 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు కొలతలు

సాక్షి ఎఫెక్ట్

**అమ్రాబాద్:** నల్లమల అటవీ పరిధిలోని చెంచు పెంటల చెంతకు అధికార యంత్రాంగం తరలివచ్చింది. చెంచులకు విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారింది.ఆరు నెలలుగా గిరిపోషణ ముందుకు సాగడం లేదు. చిన్నపిల్లల నుంచి బాలింతల వరకు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. వారి వెతలకు 'సాక్షి' అక్షరరూపం ఇస్తూ 'అడవే చెంచులకు అమ్మ' శీర్షికన బుధవారం కథనం ప్రచురించింది. దీనిపై నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్ కుమార్ స్పందించారు. చెంచు పెంటలను క్రమం తప్పకుండా సందర్శించి, వారికి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ వెంకటయ్య, పీఆర్ ఏఈ రుక్మాంగధ అమ్రాబాద్ మండలంలోని కొమ్మెనపెంట, కొల్లంపెంటను సందర్శించారు. చెంచు కుటుంబాల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ వెంకటయ్య మాట్లాడుతూ చెంచు కుటుంబాల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని, వారికి కావాల్సిన వసతులు, వారి అవసరాలను గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు. ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా అటవీ ప్రాంతంలో ఉండే కొల్లంపెంట, కొమ్మెనపెంటలకు కనీస రవాణా సౌకర్యం కోసం 11.30 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులు చేపడతామన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించనున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్థలం ఖరారు చెప్పారు. వారి వెంట ఎంపీడీఓ రామ్మోహన్, కార్యదర్శి మల్లేష్, ఉపాధి హామీ పథకం ఈసీ రేణయ్య, టీఏ అంజనేయులు తదితరులు ఉన్నారు.

# 20 ఏళ్లు ఏం చేశారు?

- బీఆర్‌ఎస్‌కు భూ కేటాయింపు పిటిషన్‌పై హైకోర్టు
- కారణాలు తెలుపుతూ పిటిషన్‌ను మళ్లీ వేయాలని ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** బీఆర్‌ఎస్ పార్టీకి 2004లో బంజారాహిల్స్‌లో భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో పిటిషనర్ తీరును హైకోర్టు తప్పుబట్టింది. 20 ఏళ్ల క్రితం భూమి కేటాయిస్తే ఇప్పటివరకు ఎందుకు పిటిషన్ వేయలేదు అని ప్రశ్నించింది. కారణాలు తెలుపుతూ పిటిషన్‌ను మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది. కేసు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. 2004లో బీఆర్‌ఎస్ పార్టీకి తక్కువ ధరకు ఎకరం స్థలం కేటాయించారని, దానిని తిరిగి స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. పార్టీ కోసం కేటాయించిన స్థలంలో భవనం నిర్మించి అందులోనే ఓ న్యూస్ చానల్‌ను కూడా నడుపుతున్నారన్నారు. ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అయితే ధర్మాసనం జోక్యం చేసుకుని.. పార్టీకి ఎకరం స్థలం కేటాయిస్తూ 2004లో ప్రభుత్వం జీవో నంబర్ 966 విడుదల చేస్తే ఇప్పటివరకు ఏం చేశారని ప్రశ్నించింది. పిటిషన్‌ను మార్చి వేయా లని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

# మైదాన ప్రాంతాల్లో ఐటీడీఏ ఏర్పాటెప్పుడు?



**సాక్షి, హైదరాబాద్:** మైదాన ప్రాంతాల్లో షెడ్యూల్ తెగల (ఎస్టీ) అభివృద్ధికి జీవో ఇచ్చినా ఇప్పటి వరకు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లను ఎందుకు ఏర్పాటు చేయలేదో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. రాష్ట్రంలోని మైదాన ప్రాంతాల్లోని షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కోసం ఐటీడీఏ ఏర్పాటుకు సంబంధించి 2014లో జీవో నంబర్ 57 ఇచ్చినా ఇప్పటివరకు అమలు చేయడం లేదంటూ లంబాడీ హక్కుల పోరాట సమితి కార్యదర్శి బానోతు శివ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నిజామాబాద్, కామారెడ్డి, వికారాబాద్, నిర్మల్, జడ్చర్ల, జనగాం, యాదాద్రి భువనగిరి, పెద్దపల్లి తదితర ప్రాంతాల్లోనే దాదాపు 30 లక్షల మంది షెడ్యూల్ తెగలకు చెందిన వారు నివసిస్తున్నారని, వీరి అభివృద్ధికి ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వీటికి ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం జీవో జారీ చేసినా ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేసింది.

# హారిజాంటల్... వర్టికల్ ?

### మహిళా రిజర్వేషన్ల కేటాయింపుపై నేడు కీలకతీర్పు వచ్చే చాన్స్
### స్పష్టత వస్తేనే నియామకాల ప్రక్రియ ముందుకు...

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో మహిళా రిజర్వేషన్లపై నెలకొన్న అనిశ్చితికి గురువారం తెరపడే అవకాశముంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నా, వాటి అమలు క్రమం హారిజాంటల్ లేదా వర్టికల్ పద్ధతిలోనా..? అనే అంశాన్ని తేల్చాలని కోరుతూ గతేడాది సెప్టెంబర్ నెలలో పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో టీఎస్‌పీఎస్సీ సహా తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డులు నియామక ప్రక్రియను నిలిపివేశాయి. మహిళా రిజర్వేషన్లపై కోర్టు వెలువర్చే తీర్పునకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఉద్యోగ నియామక సంస్థలు నిర్ణయించుకొని తీర్పుకోసం వేచి చూస్తున్నాయి. అయితే విచారణలో భాగంగా ఇదే మొదటి కేసు కావడంతో అటు నియామక బోర్డువర్గాలు, ఇటు నిరుద్యోగ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

### ఒక నెలలో ఐదోసారి..

మహిళా రిజర్వేషన్ల అమలు కేసు ఒక నెలలోనే ఐదోసారి బెంచ్ ముందుకు రావడం గమనార్హం. పలుమార్లు విచారణకు రాగా, నియామక సంస్థలు ప్రత్యేకంగా న్యాయవాదిని నియమించుకున్నాయి. అయితే కౌంటర్ పార్టీ కొంత సమయం కావాలంటూ న్యాయమూర్తిని అడగడంతో పలుమార్లు వాయిదా పడింది. ఈనెల 5వ తేదీన కేసు విచారణకు వచ్చింది. అప్పుడు కూడా కేసు వేసిన పార్టీ కొంత సమయం కావాలని అడిగింది. అలా ఈనెల 8, 12, 22వ తేదీ వరుసగా విచారణకు వచ్చినా, నాయ్యవాది సమయం కోరారు. అయితే 22న కేసు విచారణకు వచ్చినప్పుడు ఇకపై వాయిదాలొద్దంటూ సదరు న్యాయవాదికి జడ్జి సూచించారు. దీంతో ఈనెల 25కు కేసు వాయిదా పడింది. అయితే ఈ కేసు ప్రాధాన్యతలోనూ ముందు వరుసలో ఉండడంతో రిజర్వేషన్లపై తీర్పు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ముఖ్యమంత్రి భద్రతాధికారుల మార్పు

### నిఘా విభాగం సూచనల మేరకు ఉన్నతాధికారుల నిర్ణయం

**సాక్షి, హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి భద్రతలో ఉన్నతాధికారులు మార్పులు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ వద్ద పనిచేసి, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి వద్ద కూడా కొనసాగుతున్న భద్రతా సిబ్బందిని పూర్తిగా మార్చేశారు. ముఖ్యమంత్రి కార్యకలాపాలకు సంబంధించిన ప్రతీ సమాచారం బయటకు పొక్కుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. గత సీఎం వద్ద పనిచేసిన వారిలో ఇదివరకు కొద్ది మందిని మాత్రమే మార్చగా, ఇంకా చాలా మంది అదే సెక్యూరిటీ విధుల్లో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎంకు సంబంధించిన కీలక సమావేశ వివరాలు బయటకు వెళ్లడం, ఆయన భద్రతకు, పరిపాలన, ప్రభుత్వానికి మంచిది కాదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నిఘా విభాగం అధిపతి శివధర్‌రెడ్డి ఈ అంశాన్ని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లిన అనంతరం భద్రతా సిబ్బందిని మార్చాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సీఎం భద్రతను చూసేందుకు ప్రత్యేకంగా ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌ను ఏర్పాటు చేశారు.

**ల్యాండ్ క్రూయిజర్లతో కొత్త కాన్వాయ్..** భద్రతాధికారులు సీఎంకు కొత్త కాన్వాయ్‌ని కూడా సమకూర్చారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి నల్లరంగు కారులో వెళ్తే, ఆయన భద్రతా సిబ్బంది వాహనాలు వేరే రంగులో ఉండేవి. ఇలా సీఎం ప్రయా ణించే వాహనాన్ని సులభంగా గుర్తించడానికి వీలవడంతో.. ముప్పు ఉంటుందని నిఘావర్గాలు హెచ్చరించాయి. దీంతో ఆయన కాన్వాయ్‌లోని వాహన శ్రేణిని మొత్తం నల్లరంగులోకి మార్చేశారు. మాజీ సీఎం కేసీఆర్ తెల్ల రంగున్న వాహన శ్రేణిని వినియోగించేవారు. గత ప్రభుత్వ హయాంలోనే సీఎం కోసం తెల్లరంగు ల్యాండ్ క్రూయిజర్ వాహనాలను కొనుగోలు చేశారు. వాటికి విజయవాడలో బుల్లెట్‌ప్రూఫ్ చేయించారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నల్లరంగు వాహనాలంటే ఇష్టం కావడంతో, వాటి కలర్‌ను అధికారులు మార్చేశారని తెలిసింది.



Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. 